www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 302
గురువారం | 30-1-2025
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి సా. 4.11 తదుపరి విదియ; నక్షత్రం: శ్రవణం ఉ. 7.15, ధనిష్ఠ తె. 5.50; వర్జ్యం: ఉ.11.01-12.23; దుర్ముహూర్తం: ఉ.10.36-11.21, మ.3.05-3.50; అమృతఘడియలు: రా.8.03-9.33; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.05
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో చెల్లాచెదురుగా పడిన బ్యాగులు, దుస్తుల మధ్య మృతులు (వృత్తంలో)



అనుకోని ఈ ఘటన ఎంతో బాధాకరం: ప్రధాని మోదీ 2

అరకొర ఏర్పాట్ల వల్లే: విపక్షాలు

తీవ్ర రద్దీ.. మరో మూడు వారాలు అయోధ్యకు రాకండి: ట్రస్టు

మహాకుంభమేళా.. చీకట్లో తొక్కిసలాట..

40 మంది దుర్మరణం

60 మందికి తీవ్ర గాయాలు.. బుధవారం తెల్లవారుజామున ప్రయాగ్‌రాజ్‌లో పెను విషాదం

'మౌని అమావాస్య' సందర్భంగా త్రివేణి సంగమం వద్ద అమృతస్నానాల కోసం కోట్ల మంది రాక





ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారిని తరలిస్తున్న సహాయక సిబ్బంది

ఏర్పాట్లు సరిగ్గా లేక.. చీకట్లో దారి కనిపించక భక్తులకు ఇబ్బందులు

చెత్త డబ్బాలు తగిలి కిందపడ్డ కొందరు

వారిని తొక్కుకుంటూ ముందుకెళ్లిపోయిన మరికొందరు

ఎటుచూసినా మృతదేహాలు.. బాధితుల ఆర్తనాదాలతో భీతావహంగా ఘటనాస్థలి

25 మంది మృతుల వివరాలు గుర్తింపు

మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు

ఘటనపై న్యాయ విచారణ: సీఎం యోగి

బుధవారం ఒక్కరోజే 7.5 కోట్ల మంది అమృతస్నానాలు ఆచరించినట్టు అంచనా

మహాకుంభ్‌నగర్, జనవరి 29: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహాకుంభమేళాలో తీవ్ర అపశ్రుతి చోటు చేసుకుంది! మౌని అమావాస్య సందర్భంగా పవిత్ర త్రివేణి సంగమస్థలి వద్ద బ్రహ్మ ముహూర్తంలో అమృత స్నానాలు ఆచరించేందుకు దేశం నలుమూలల నుంచీ కోట్లాది మంది భక్తులు ప్రయాగరాజ్‌కు చేరుకున్న వేళ.. అక్కడ తొక్కిసలాట జరిగి 40 మంది దుర్మరణంపాలయ్యారు. మరో 60 మందికి పైగా గాయాలపాలయ్యారు. బుధవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో జరిగిందీ విషాదం. ఒకవైపు అంబులెన్స్ సైరన్లు.. మరోవైపు పోలీసు వాహనాల సైరన్లు.. భక్తుల ఆర్తనాదాలు.. తొక్కిసలాట జరిగిన ప్రాంతంలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు.. అయినవారిని కోల్పోయి, తీవ్రంగా గాయపడి రోదిస్తున్నవారితో.. చిందరవందరగా పడి పోయిన సంచులు, పాదరక్షలు, బ్యాక్‌ప్యాక్‌లు, దుస్తులు, దుప్పట్లు, ఇతర వస్తువులతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారిపోయింది. అప్రమత్తమైన అధికారులు క్షతగాత్రులను అంబులెన్సుల్లో మేళా ఏరియాలో ఏర్పాటు చేసిన ఆస్పత్రికి, మృతదేహాలను మోతీలాల్ నెహ్రూ వైద్య కళాశాల

మిగతా 2వ పేజీలో...

మెడికల్ పీజీలో లోకల్ కోటా వద్దు



ప్రతిభ ఆధారంగానే పీజీ వైద్య విద్య ప్రవేశాలు

రాష్ట్ర కోటాలో 'నివాస ఆధారిత' భర్తీ కుదరదు

అది రాజ్యాంగ విరుద్ధం.. ఆర్టికల్ 14 ఉల్లంఘన

ఎంబీబీఎస్ కోర్సులకు నివాస కోటా ఉండొచ్చు

దేశంలో ఎవరు ఎక్కడైనా చదువుకోవచ్చు

సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పు

ఇప్పటికే 'నివాస' కోటాలో భర్తీ అయిన పీజీ సీట్లకు ఈ తీర్పు వర్తించదని వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 29: వైద్య విద్య పోస్ట్‌గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలకమైన తీర్పు ఇచ్చింది. పీజీ వైద్య విద్య రాష్ట్ర కోటా (50శాతం) సీట్లను నివాస ఆధారంగా భర్తీ చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. నివాస ఆధారిత కోటాలో భర్తీ చేయడమంటే ఆర్టికల్ 14ను ఉల్లంఘించడమేనని పేర్కొంది. సమానత్వ హక్కును కాలరాయడమేనని తెలిపింది. నివాస(స్థానికత) ఆధారిత రిజర్వేషన్లు ఎంబీబీఎస్ ప్రవేశాల వరకు ఆమోదయోగ్యమని, పీజీకి మాత్రం కుదరదని పేర్కొంది. పీజీలో స్పెషాలిటీ వైద్య సేవలు ఉంటాయని గుర్తుచేసింది. నీట్ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగానే రాష్ట్ర కోటా పీజీ సీట్లనూ భర్తీ చేయాలని బుధవారం సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చింది. "మనకు దేశంలో ఎక్కడైనా నివసించే హక్కు ఉన్నట్లే ఎక్కడైనా చదువుకునే హక్కు కూడా ఉంది. మనమందరం భారత భూభాగంలో నివాసితులం. ఏ ప్రాంతం, ఏ రాష్ట్రం అనే తేడా ఉండదు. ఎక్కడైనా ఉద్యోగం, వ్యాపారం చేసుకునే హక్కు ఉంది. అలాగే చదువుకునే హక్కు కూడా ఉంది" అని జస్టిస్ రిషికేశ్ రాయ్, జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టిల ధర్మాసనం తేల్చి చెప్పింది. పీజీ కోర్సుల్లో నివాస ప్రాంతాన్ని ప్రాతిపాదికగా తీసుకుంటే.. రాజ్యాంగంలోని 14వ అధికరణం కల్పించిన సమానత్వపు హక్కుని ఉల్లంఘించినట్లే అవుతుందని పేర్కొంది. రాష్ట్రాల కోటా సీట్లలో నిర్దేశిత రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాత మిగిలిన సీట్లను తప్పనిసరిగా ఆలిండియా పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఇప్పటికే జారీ అయిన నివాస ఆధారిత రిజర్వేషన్లకు, ఆ కోటా కింద పట్టభద్రులైన వారికి ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ ధులియా కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాలు 'శాశ్వత నివాసం' పదానికి పర్యాయపదంగా 'నివాసం' పదాన్ని

మిగతా 2వ పేజీలో...

పంచాయతీ ఎన్నికలు

బీసీ రిజర్వేషన్లు తేలాకే!



సమగ్ర కులగణన సర్వేపై సచివాలయంలో జరిగిన సమీక్షలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, దామోదర, సీతక్క, కాంగ్రెస్ నేతలు కేకే, జానారెడ్డి

ఫిబ్రవరి 2 నాటికి సబ్‌కమిటీకి కుల సర్వే నివేదిక

ఆ వెంటనే మంత్రివర్గ సమావేశం.. నివేదికపై చర్చ

అనంతరం అసెంబ్లీలో తీర్మానం.. బీసీ రిజర్వేషన్లను పెంచుకునే అవకాశమివ్వాలని కేంద్రానికి వినతి

దేశానికే ఆదర్శంగా నిలిచిన సర్వే: రేవంత్‌రెడ్డి

టీటీడీ తరహాలో యాదగిరి గుట్ట దేవస్థానం బోర్డు ఏర్పాటుకు వేగంగా చర్యలు తీసుకోవాలన్న సీఎం

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు.. బీసీ రిజర్వేషన్లు తేలిన తరువాతే జరగనున్నాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల సర్వే వివరాల ముసాయిదా మరో రెండు రోజుల్లో ప్రభుత్వానికి అందనుంది. అనంతరం పూర్తి నివేదికను క్యాబినెట్ సబ్ కమిటీకి ఫిబ్రవరి 2 నాటికి అధికారులు అందజేయనున్నారు. ఆ వెంటనే సబ్‌కమిటీ సమావేశమై.. నివేదికపై చర్చిస్తుంది. ఆపై రాష్ట్ర మంత్రివర్గం భేటీ అయి.. బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చించి, నిర్ణయం తీసుకుంటుంది. అనంతరం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటుచేసి బీసీల రిజర్వేషన్లపై తీర్మానం చేసి కేంద్రానికి పంపనున్నారు. దీనిపై కేంద్రం నుంచి సమాధానం వచ్చిన తరువాత రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలల్లోనే 2024 ఫిబ్రవరిలో కులగణనకు శ్రీకారం చుట్టింది. ఈ సర్వేలో వచ్చిన వివరాల ఆధారంగా రాష్ట్రంలో బీసీల లెక్కలు తేలనున్నాయి. కాగా, బీసీలకు ఖరారు చేయాల్సిన రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను కూడా నియమించింది. కుల సర్వేలో వచ్చిన వివరాలను ఇచ్చిన అనంతరం.. రిజర్వేషన్లను సూచిస్తూ ప్రత్యేక కమిషన్ ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తుంది.

50 శాతం మించరాదని సుప్రీంకోర్టు తీర్పు

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలోనే తీర్పునిచ్చింది. మరోవైపు ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా దామాషా ప్రకారం 27 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉంది. దీంతో ప్రస్తుతం బీసీలకు 23 శాతం రిజర్వేషన్ మాత్రమే అమలవుతోంది. ఇప్పుడు కులసర్వేలో వచ్చిన

మిగతా 13వ పేజీలో...

పర్యాటకానికి పెద్దపీట

వచ్చే నెల 10 లోగా సమగ్ర పర్యాటక విధానం

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగి ఉండాలి

పర్యాటక శాఖపై సమీక్షలో సీఎం ఆదేశాలు 13

సైబర్ నేరాల్లో బ్యాంకు సిబ్బంది!

'మ్యూల్' ఖాతాలు.. ప్రతి లావాదేవీకి కమీషన్

వేర్వేరు బ్యాంకులకు చెందిన నలుగురి అరెస్ట్

20 సైబర్ నేరాల్లో ప్రమేయం.. చైనా, నేపాల్ సైబర్ క్రిమినల్స్‌కు రూ.23 కోట్లు చేరవేత

దర్యాప్తులో నిగ్గుతేల్చిన పోలీసులు

ఏపీ, తెలంగాణ సహా 9 రాష్ట్రాల్లో 52 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు: సీపీ సీవీ ఆనంద్

బ్యాంకర్లూ జాగ్రత్త.. నేరగాళ్లకు సహకరిస్తే అరెస్టులే: సైబర్ సెక్యూరిటీ బ్యూరో



సీపీ సీవీ ఆనంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఆగడాలకు కొందరు బ్యాంకు ఉద్యోగులు దన్నుగా ఉంటున్నారు. ఖాతా వివరాలు అడిగో.. ఓటీపీ నంబరు అడిగో.. లేదంటే డిజిటల్ అరెస్టు అయ్యారని భయపెట్టో అమాయక ప్రజలను మోసం చేసి.. వారి నుంచి కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్ల విశృంఖలతకు ఆ ఉద్యోగులే గొడుగు పడుతున్నారు. సైబర్ నేరగాళ్ల కోసం మ్యూల్ ఖాతాలను సృష్టించి.. ఆ దొంగ

మిగతా 10వ పేజీలో...



వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోతు తెలియక

ఎన్నికల హామీలిచ్చాం

అప్పు, మిత్తి ఎంత ఉందో తెలియదు

తొలిరోజుల్లో జీతాలివ్వలేని పరిస్థితి

హామీల అమలుకు సీఎం రేవంత్ రోజుకు 18 నుంచి 20 గంటలు పనిచేస్తున్నారు

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వ్యాఖ్యలు

'ఊళ్లలోకి పోతే జనం తిడుతున్నరు.. కేసీఆరే బాగుండేనని అంటున్నరు'

ఇటీవల ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు

రాజేంద్రనగర్/యాదాద్రి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): "శాసనసభ ఎన్నికల ప్రచారంలో ఆరు గ్యారెంటీలతో పాటు అనేక హామీలు ఇచ్చాం. ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి కూడా అనేక హామీలు ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోతు తెలియక, అప్పు, మిత్తి ఎంత ఉందో తెలియక ఆ హామీలు ఇవ్వడం జరిగింది. అధికారం చేపట్టిన తొలిరోజుల్లో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేది. ప్రజలకు ఇచ్చిన

మిగతా 13వ పేజీలో...

విశ్రాంత ఉద్యోగుల అరిగోస

రాష్ట్రంలో రిటైర్మెంట్ ప్రయోజనాల సొమ్ములందక ఇక్కట్లు

2024 మార్చి తర్వాత 7,995 మంది పదవీ విరమణ

ఒక్కొక్కరికి సగటున రావాల్సిన మొత్తం రూ.60-70 లక్షలు


జీపీఎఫ్, గ్రాట్యుటీ, ఎల్ఐసీ, కమ్యూటేషన్ బిల్లులన్నీ పెండింగ్

గ్రాట్యుటీ తప్ప.. మిగతా సొమ్ము ఉద్యోగులు దాచుకున్నదే

వారి సొమ్ము వారికివ్వడానికే ఇబ్బందులు పెడుతున్న వైనం

కమీషన్లు ఇచ్చేవారికి, పైరవీకారుల బిల్లులకు ఆమోదం!

అందరికీ చెల్లించాలంటే రూ. 5 వేల కోట్లు అవసరం



హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి సగటున 30 ఏళ్లపాటు విధులు నిర్వర్తిస్తారు.. పదవీ విరమణ చేసిన తర్వాత శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని కోరుకుంటారు. ఉద్యోగం చేసినంత కాలం తాను దాచుకున్న జీపీఎఫ్, టీజీఎల్ఐసీ, ఆర్జిత సెలవుల సొమ్ములు అందుతాయని.. ప్రభుత్వం నుంచి గ్రాట్యుటీ లభిస్తుందని ఆశిస్తారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, సొంతింటి నిర్మాణం, చేసిన అప్పులు తీర్చడం.. ఇలా ఎన్నో ప్రణాళికలు వేసుకొని ఉంటారు. కానీ, సర్కారు మాత్రం వారి ఆశలను అడియాశలు చేస్తోంది. విశ్రాంత ఉద్యోగులకు అందించాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ఇవ్వకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుతోంది. 61 ఏళ్ల పైబడి, నడవడానికి ఇబ్బంది పడేవారు, పక్షవాతం, ఇతర వ్యాధులతో బాధపడేవారు తీవ్ర ఇక్కట్లు

మిగతా 14వ పేజీలో...

పక్షవాతంతో బాధ పడుతున్నా..

ఉపాధ్యాయుడిగా పని చేసి 2024 మేలో రిటైరయ్యా. నాకు రూ.40 లక్షలకు పైగా రావాల్సి ఉంది. ఇప్పటిదాకా పైసా రాలే. అధికారులు, యూనియన్ నేతల చుట్టూ తిరుగుతున్నా. పక్షవాతంతో బాధ పడుతున్నా. నా భార్య కూడా అనారోగ్యంతో ఉంది. ఇద్దరికీ వేల రూపాయల ఆస్పత్రి ఖర్చులుంటున్నాయి.

- కృష్ణ, రిటైర్డు టీచర్, సదాశివపల్లి, మెదక్ జిల్లా

భూ పరిపాలన లీగల్ సెల్ 12

ఏర్పాటు చేస్తూ సీసీఎల్ఏ ఉత్తర్వుల జారీ

ఈ విభాగంతోనే భూభారతి నిబంధనలు!

లీగల్‌సెల్ సలహాదారుగా భూమి సునీల్?

వికటించిన మధ్యాహ్న భోజనం 3

నారాయణపేట, కామారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో 47 మంది విద్యార్థులకు అస్వస్థత

వెంటనే చికిత్స.. ప్రమాదం లేదన్న వైద్యులు

మంచి భోజనం పెట్టాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి



'వంద'ర్‌ఫుల్ 3

ఇస్రో 100వ ప్రయోగం విజయవంతం

నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్15

19 నిమిషాల్లోనే కక్ష్యలోకి నావిక్-02

దేశీయ నావిగేషన్ వ్యవస్థ మరింత బలోపేతం

రికార్డు విజయంతో ఇస్రో సరికొత్త చరిత్ర

ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు

ఖమ్మం, కరీంనగర్ టీచర్ స్థానాలకు.. 13

కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు

ఫిబ్రవరి 3న నోటిఫికేషన్.. మార్చి 3న ఫలితాలు

షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం

ఏపీలోనూ మూడు ఎమ్మెల్సీ సీట్లకు షెడ్యూల్

మహాకుంభమేళాలో తొక్కిసలాట..

40 మంది దుర్మరణం!


తొక్కిసలాట జరిగిన ప్రాంతం నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆస్పత్రికి తీసుకొచ్చిన వారిలో కొందరికి ఎముకలు విరిగిపోయాయని.. మరికొందరికి తీవ్రగాయాలయ్యాయని.. కొంతమంది అప్పటికే చనిపోయారని వైద్యుడొకరు వెల్లడించారు. అయితే, మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో.. బుధవారం మధ్యాహ్నం 12 గంటల దాకా మోతీలాల్ నెహ్రూ వైద్య కళాశాల ఆస్పత్రికి మృతదేహాల తరలింపు కొనసాగుతూనే ఉందని తెలిసింది. మృతుల బంధువులు ఆ ఆస్పత్రికి పెద్ద ఎత్తున చేరుకుని తమవారి మృతదేహాల కోసం సాయంత్రం దాకా ఎదురుచూశారు.

చీకటిలో కనిపించక..

మౌని అమావస్య కావడంతో పది కోట్ల మంది దాకా భక్తులు వస్తారని తెలిసినా అధికారులు ఏర్పాట్లు సరిగ్గా చేయలేదని, చీకటిగా ఉండడంతో అసలు ఎటు వెళ్తున్నామో తెలియని పరిస్థితి నెలకొందని.. తొక్కిసలాటకు అదే కారణమైందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంగమస్థలికి వెళ్లే దారిలో నిర్వాహకులు ఏర్పాటు చేసిన చెత్తడబ్బాలు చీకటి కారణంగా కనపడకపోవడంతో కొంతమంది భక్తులు వాటిని తట్టుకుని కింద పడిపోయారని.. అప్పటికే విపరీతమైన రద్దీ ఉండడంతో వెనక వచ్చేవారు కిందపడ్డవారిని తొక్కుకుంటూ వెళ్లిపోయారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. "భక్తుల్లో చాలామంది చేతుల్లో బ్యాగులు, ఇతర లగేజీ ఉంది. వారు నడిచే దారిలో పెద్ద సంఖ్యలో చెత్తడబ్బాలున్నాయి. వాటిని తట్టుకుని కొంతమంది కిందపడిపోయారు. వారి చేతుల్లో ఉన్న బ్యాగులు చెల్లాచెదురుగా పడిపోయాయి. వాటిని తట్టుకొని మరికొందరు కిందపడిపోయారు. నా కాలు కూడా ఒక డస్ట్‌బిన్‌లో ఇరుక్కుపోయింది. వెనక వస్తున్నవారిలో కొందరు యువకులు ముందున్నవారిని తోసుకుంటూ వచ్చేశారు. ఈ తొక్కిడిలో నేను కిందపడిపోవడంతో.. నా కాలికి గాయమైంది. ఎలాగోలా పైకి లేచి, కిందపడిపోయిన మా అమ్మానాన్నల్ని, మరో మహిళను కాపాడి పక్కకు తీసుకెళ్లా" అని ప్రయాగరాజ్‌కు చెందిన వివేక్ మిశ్రా అనే కంటెంట్ క్రియేటర్ అక్కడ జరిగిన విషాదాన్ని కళ్లకు కట్టారు. "మేం రెండు బస్సుల్లో మొత్తం 60 మందిమి మహాకుంభమేళాకు వచ్చాం. తెల్లవారుజామున తొమ్మిది మంది ఒక బృందంగా వెళ్తుండగా ఉన్నట్టుండి తోపులాట మొదలైంది. దాంట్లో మేం చిక్కుకుపోయాం. ఆ తొక్కిసలాటలో మాలో చాలా మంది కిందపడిపోయాం. అన్నివైపుల నుంచి జనం ఒకరినొకరు తోసుకోవడంతో మాకు అసలు తప్పించుకునే అవకాశమే లేకపోయింది. ఎలాగోలా బయటపడ్డాం" అని కర్ణాటక నుంచి వచ్చిన సరోజిని అనే మహిళ తెలిపారు. పోలీసులు సరైన ఏర్పాట్లు చేయలేదని ఆమె మండిపడ్డారు. "తోపులాటలో ఎటువెళ్లాలో తోచని పరిస్థితి. మమ్మల్ని తోసేస్తున్న చాలా మంది పెద్దగా నవ్వుతున్నారు. కనీసం పిల్లల మీదయినా దయచూపించాలని వేడుకున్నా వారు పట్టించుకోలేదు" అని ఈ ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో మహిళ తనకు ఎదురైన భయానక అనుభవాన్ని వివరించారు. సామాన్యభక్తులతోపాటు వీఐపీల తాకిడి కూడా ఎక్కువగా ఉండడం.. భద్రతా ఏర్పాట్లు, క్యూలైన్లను సరిగ్గా ఏర్పాటు చేయకపోవడం కూడా తొక్కిసలాటకు కారణాలుగా చాలా మంది చెబుతున్నారు.


త్రివేణి సంగమంలో సాధువులు

7.5 కోట్ల మంది స్నానాలు

మౌని అమావాస్య సందర్భంగా మహాకుంభమేళాలో ఒక్క బుధవారంనాడే సాయంత్రం 5 గంటల సమయానికి ఆరు కోట్ల మంది.. మొత్తంగా ఏడున్నర కోట్ల మంది దాకా భక్తులు అమృతస్నానాలు ఆచరించినట్టు సమాచారం.

బ్యారికేడ్లు విరగ్గొట్టడం వల్లే..

చీకటి, ఏర్పాట్లు సరిగా లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని భక్తులు ఆరోపిస్తుండగా.. యూపీ సర్కారు భిన్న వాదన వినిపిస్తోంది. తెల్లవారుజామున 2 గంటల సమయంలో కొంత మంది భక్తులు బ్యారికేడ్లను విరగ్గొట్టి అవతలివైపునకు దూసుకెళ్లడంతో.. అప్పటికే అటువైపు ఉన్నవారు వీరికింద నలిగిపోయారని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహాకుంభ్ డీఐజీ వైభవ్‌కృష్ణ చెప్పడం గమనార్హం. మృతులు కూడా 30 మందే అని, 60 మంది గాయపడ్డారని వైభవ్‌కృష్ణ బుధవారం సాయంత్రం మీడియా సమావేశంలో వెల్లడించారు. మొత్తం 90 మందికి పైగా గాయపడ్డారని.. ఆస్పత్రికి తరలించేటప్పటికే వారిలో 30 మంది మరణించారని ఆయన వివరించారు. మృతుల్లో 25 మందిని ఇప్పటికే గుర్తించినట్టు చెప్పారు. వారిలో నలుగురు కర్ణాటకవాసులు, అస్సాం, గుజరాత్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాల భక్తులు ఉన్నట్టు చెప్పారు. క్షతగాత్రుల్లో 36 మంది ఇంకా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతుండగా.. మిగతావారు ప్రాథమిక చికిత్స చేయించుకుని వెళ్లిపోయినట్టు తెలిపారు. ఇక.. తొక్కిసలాటకు కారణాలపై న్యాయవిచారణకు రిటైర్డ్ జడ్జి హరీశ్‌కుమార్, మాజీ డీజీపీ వీకే గుప్తా, రిటైర్డ్ ఐఏఎస్ డీకే సింగ్‌తో కూడిన త్రిసభ్య ప్యానెల్‌ను నియమించినట్టు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. దీంతోపాటు విడిగా పోలీసు విచారణ కూడా జరిపించనున్నట్టు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ ఘోరం జరగడానికి గల కారణాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ గురువారం ఘటనాస్థలికి వెళ్లి దీనిపై లోతైన విచారణ జరుపుతారని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం 9 నుంచి 10 కోట్ల మంది భక్తులు ప్రయాగరాజ్‌లో ఉన్నారని.. వారి భద్రతే తమకు ముఖ్యమని.. భక్తులంతా తాము ఉన్న ప్రాంతాలకు సమీపంలోని ఘాట్లలో స్నానం చేయాలని.. త్రివేణి సంగమ స్థలి వద్దకు చేరుకునే ప్రయత్నాలు చేయొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

భారీగా నిలిచిపోయిన వాహనాలు

లక్నో, జనవరి 29: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతోన్న మహాకుంభమేళాకు భక్తులు భారీగా తరలి వస్తుండటంతో ఉత్తరప్రదేశ్-మధ్యప్రదేశ్ సరిహద్దుల్లో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాలో నిలిచిపోయిన ఈ వాహనాల్లో అనేక మంది భక్తులు చిక్కుకుపోయారు. దీంతో వీరికి ఆహారం, వసతి ఏర్పాట్లు చేసినట్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఎక్స్ ద్వారా వెల్లడించారు. డాక్టర్ల బృందాన్ని కూడా అందుబాటులో ఉంచామన్నారు. భక్తులు ఓపికగా ఉంటూ అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మహాకుంభమేళాకు వస్తున్న భక్తులు ఆ తర్వాత కాశీకి ఎక్కువగా వెళ్తుండటంతో తీవ్రమైన రద్దీ నెలకొంది. కాశీ విశ్వనాథ్ మందిర్‌కు దారి తీసే మార్గాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఫిబ్రవరి 5న వసంత పంచమికి కూడా భక్తులు భారీ ఎత్తున తరలివచ్చే అవకాశముందని భావిస్తున్నారు. .



మరో 3 వారాలు అయోధ్యకు రాకండి

మహాకుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్ వస్తున్న భక్తులు సమీపంలోనే ఉన్న అయోధ్యకు తరలివెళ్తుండటంతో రామజన్మభూమి ఆలయ నిర్వాహక కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. మరో మూడు వారాల పాటు అయోధ్యలో రాముడి దర్శనం కోసం రావద్దని భక్తులకు సూచించింది. రద్దీ తగ్గాక ప్రశాంతంగా వచ్చి రామ్‌లల్లా దర్శనం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అయోధ్య పర్యటన వాయిదా వేసుకోవాలని సూచించింది.

సాధుసన్యాసులపై పూలవర్షం

మౌని అమావాస్య సందర్భంగా తెల్లవారుజామున అమృత స్నానం ఆచరించాల్సిన సాధుసన్యాసులు, బైరాగులు.. తొక్కిసలాటలో పలువురు మరణించడంతో ఆ ప్రక్రియను బుధవారం మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో వారంతా ఊరేగింపుగా బయల్దేరగా.. అధికారులు హెలికాప్టర్లతో వారిపై పూలవర్షం కురిపించారు. వారంతా త్రివేణీ సంగమ ప్రాంతానికి చేరుకుని సంప్రదాయబద్ధంగా అమృత స్నానం చేశారు. అఖాడాలు పవిత్ర స్నానాలు ఆచరించడానికి చక్కటి ఏర్పాట్లు చేశారంటూ అఖిల భారతీయ అఖాడా పరిషత్ అధిపతి మహంత్ రవీంద్ర పురి ప్రశంసించారు.

ఎంతో బాధాకరం

కుంభమేళా తొక్కిసలాటపై యోగీకి మోదీ ఫోన్



న్యూఢిల్లీ, జనవరి 29: మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఎంతో బాధాకరమని ప్రధాని మోదీ అన్నారు. బాధితులకు ప్రయాగ్‌రాజ్‌లోని స్థానిక యంత్రాంగం అన్ని విధాల సహాయం చేస్తోందని ఆయన తెలిపారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తొక్కిసలాట ఘటనపై పరిస్థితిని మోదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగీ ఆదిత్యనాథ్‌కు ఆయన పలుమార్లు ఫోన్ చేసి సమాచారం తెలుసుకుంటున్నారు. తొక్కిలాట ఘటన ఎంతో బాధకలిగించిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన వార్త ఎంతో బాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చెప్పారు.

అరకొర ఏర్పాట్ల వల్లే ప్రమాదం:

అరకొర ఏర్పాట్ల వల్లే కుంభమేళాలో తొక్కిసలాట జరిగి పదుల సంఖ్యలో భక్తులు మృత్యువాత పడ్డారని ప్రతిపక్షాలు కేంద్రం, యూపీలోని యోగీ ప్రభుత్వంపై ధ్వజమెత్తాయి. పాలన యంత్రాంగం సామాన్య భక్తుల గురించి కాకుండా వీవీఐపీల తరలింపుపై దృష్టిపెట్టడం వల్లే దుర్ఘటన సంభవించిందని విపక్షాలు విరుచుకుపడ్డాయి. అరకొర ఏర్పాట్లు, వీఐపీ తరలింపు, స్వంత ప్రచారంపై శ్రద్ధ చూపడం, నిర్వహణ లోపాలే ఈ ప్రమాదానికి కారణమని ఖర్గే పేర్కొన్నారు. వీవీఐపీల రాకపోకలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన యోగీ ప్రభుత్వ వైఫల్యమని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. కుంభమేళాకు ప్రపంచ స్థాయి ఏర్పాటు చేశామని చెప్పిన ఆయన ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలన్నారు. కుంభమేళా నిర్వహణను ఆర్మీకి అప్పగించాలని అన్నారు. కాగా, పరిపాలన యంత్రాంగం వీఐపీల భద్రత ఏర్పాట్లలో మునిగితేలుతూ బీజీగా ఉండడం వల్లే ఇంత ఘోరం జరిగిందని నిరంజనా మహామండలేశ్వరుడు స్వామి ప్రేమానంద్ పూరీ విమర్శించారు.


తొక్కిసలాట సమయంలో బారికేడ్ల మీద నుంచి దూకుతున్న భక్తులు

ట్రిపుల్ తలాక్ ఎఫ్ఐఆర్‌ల వివరాలివ్వండి!

కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 29: ట్రిపుల్ తలాక్ చెప్పి భార్యకు విడాకులు ఇవ్వటానికి ప్రయత్నించిన వ్యక్తుల మీద దాఖలైన ఎఫ్ఐఆర్, చార్జిషీట్ల వివరాలను తమకు అందజేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2019లో వచ్చిన 'ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ చట్టం' ట్రిపుల్ తలాక్‌ను నిషేధించిన విషయం తెలిసిందే. అయితే, ట్రిపుల్ తలాక్ చెప్పటాన్ని ఈ చట్టం నేరంగా పరిగణించి, ఆ నేరానికి పాల్పడిన వారికి మూడేళ్ల జైలు శిక్షను విధిస్తుంది. దీనిని వ్యతిరేకిస్తూ పలు ముస్లిం సంఘాలు, వ్యక్తులు సుప్రీంకోర్టులో 12 పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. తలాక్ అనే పదాన్ని ఉచ్చరించటాన్ని నేరంగా పరిగణించటం అన్యాయమని, వివాహాన్ని రద్దు చేసుకున్నందుకు దేశంలో ఇతర ఏ మతసమూహమూ ఇటువంటి న్యాయపరమైన సమస్యలు ఎదుర్కోవటం లేదని తెలిపారు. కేంద్రప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణించటం వల్ల అది చెప్పటానికి భయపడే పరిస్థితిని సృష్టించినట్లయ్యిందన్నారు. 'ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ చట్టం' కింద నిందితులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష పడుతుందని, మహిళా హక్కులకు సంబంధించిన చట్టాల్లో ఇదే అతి తక్కువ శిక్ష అని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'ట్రిపుల్ తలాక్‌కు ప్రస్తుతం చట్టబద్ధత లేదు. కాబట్టి, ట్రిపుల్ తలాక్ చెప్పిన తర్వాత కూడా భార్యభర్తలు కలిసి ఉండవచ్చు. కానీ, ట్రిపుల్ తలాక్ చెప్పినందుకు భర్తకు జైలు శిక్ష పడుతోంది. దీనినే పిటిషనర్లు వ్యతిరేకిస్తున్నారు' అని పేర్కొంది. ఈ మేరకు 'ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ చట్టం' కింద దాఖలైన ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్ల వివరాలను కేంద్రం సమర్పించాలని ఆదేశించింది. విచారణను మార్చి 17వ తేదీకి వాయిదా వేసింది.

గతంలోనూ విషాదాలు

1954లో అతి పెద్ద విషాదం

మహా కుంభమేళాలో తొక్కిసలాటలు గతంలోనూ జరిగాయి. అయితే, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారి, 1954లో జరిగిన మహాకుంభమేళా దేశ చరిత్రలోనే అతి పెద్ద విషాదాన్ని మిగిల్చింది. మౌని అమావాస్యను పురస్కరించుకుని 1954 ఫిబ్రవరి 3న అలహాబాద్(ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్)లో పుణ్యస్నానం ఆచరించేందుకు 50 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో దాదాపు 800 మంది ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది భక్తులు నీళ్లలో మునిగిపోయి ప్రాణాలు కోల్పోయారు. వేల మంది గాయపడ్డారు.

1986లో 200 ప్రాణాలు బలి

1986లో హరిద్వార్ వేదికగా జరిగిన కుంభమేళాలో తొక్కిసలాట జరిగి 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. నాటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి వీర్ బహదూర్ సింగ్ పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎంపీలతో కలిసి హరిద్వార్‌లోని కుంభమేళా ప్రాంగణానికి వచ్చారు. దీంతో సామాన్య ప్రజలను నదీ తీరానికి వెళ్లనీయకుండా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాట తొక్కిసలాటకు దారి తీసి విషాదాన్ని మిగిల్చింది.

2003 నాసిక్‌లో 39 మంది మృతి

2003లో మహారాష్ట్రలోని నాసిక్‌లో కుంభమేళా సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన 39 మంది చనిపోయారు. 100 మందికి పైగా గాయపడ్డారు.

12 ఏళ్ల క్రితం 36 మంది దుర్మరణం

సరిగ్గా 12 ఏళ్ల క్రితం 2013లో మౌని అమావాస్య రోజున ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో కుంభమేళాకు వచ్చిన 36 మంది చనిపోయారు. ఈ తొక్కిసలాట ప్రయాగ్‌రాజ్ రైల్వే స్టేషన్‌లో జరిగింది. స్టేషన్‌లోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కూలడంతో కలకలం రేగి తొక్కిసలాటకు దారితీసింది. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ.. నాటి కుంభమేళా ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరించిన రాష్ట్ర మంత్రి అజామ్ ఖాన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు.

2008లో నైనా దేవీ ఆలయం వద్ద 160 మంది

2008 ఆగస్టులో హిమాచల్ ప్రదేశ్‌లోని నైనా దేవీ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో 160 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. అమ్మవారి దర్శనానికి సుమారు 20వేల మంది భక్తులు వేచి ఉండగా.. కొండపై నుంచి రాళ్లు జారి పడుతున్నాయనే వదంతి వ్యాపించి తొక్కిసలాటకు దారి తీసింది.

సంగమ ముఖద్వారం.. ఎందుకంత కీలకం?


సంగమం ముఖద్వార ప్రాంతం

మహాకుంభ్ నగర్, జనవరి 29: ప్రయాగరాజ్‌లో ఉత్తర దిశ నుంచి ప్రవహించే గంగా నది, దక్షిణ దిశ నుంచి వచ్చిన యమునా నది రెండూ సంగమించే ప్రదేశం త్రిభుజాకారంలో ఒక ముక్కులాగా కనిపిస్తుంది. అందుకే దీనిని సంగమ ముఖద్వారంగా వ్యవహరిస్తారు. ఇక్కడే సరస్వతీ నది(అంతర్వాహిని) కూడా వీటితో సంగమిస్తుందని చెబుతారు. ఈ త్రివేణీ సంగమ ప్రదేశం హిందువులకు పరమ పవిత్ర పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి పొందింది. మాఘ మేళాలో ఇక్కడ స్నానం చేయడానికి మనుషులతో పాటు దేవతలు, రాక్షసులు కూడా వస్తారని నమ్మిక. ఇక్కడ స్నానాలు చేస్తే పాపాలు తొలగిపోతాయని, జనన మరణ చక్రం నుంచి జీవుడికి విముక్తి లభించి, మోక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. అదీ 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా సమయంలో ఇక్కడ స్నానాలు ఆచరిస్తే దాని ఫలితం అనంతమని బలంగా నమ్ముతారు. ఈ కారణంగా ఇక్కడ భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. వేణీ మాధవుడు స్వయంగా ఇక్కడ వెలిసినందున ఈ సంగమానికి ప్రాధాన్యం మరింత ఎక్కువ. వివిధ అఖాడాల నుంచి వచ్చిన సాధువులు సంగమ ముఖద్వారం ప్రాంతంలోనే అమృత స్నానాలు ఆచరిస్తారు. కుంభమేళాలో పవిత్ర స్నానాలకు అత్యంత డిమాండ్ ఉన్న ప్రదేశం ఇదే.

రెండు నదుల నీరు వేర్వేరు రంగుల్లో..

సంగమ ముఖద్వారం వద్ద యమునా నదిలో నీరు లేత నీలం రంగులోనూ, గంగా నదిలో నీరు కొద్దిగా బురదగానూ కనిపిస్తాయి. ఇక్కడే యమునా నది ప్రయాణం అంతమైపోయి... గంగలో పూర్తిగా లీనమైపోతుంది. ఇక్కడినుంచి గంగానది బనారస్ దిశగా ప్రవహిస్తుంది. కుంభమేళాలో ఈ ప్రాంతాన్ని సంగమ ఘాట్‌గా గుర్తించారు. కుంభమేళా జరిగే 4వేల హెక్టార్లలో సంగమ ముఖద్వారంతో పాటు రెండు నదీ తీరాల్లోనూ అనేక ఘాట్‌లను సిద్ధం చేశారు. మొత్తం 25 సెక్టార్లుగా ఈ ప్రాంతాన్ని విభజించారు. ఇందులో 5 సెక్టార్లు సంగమ ముఖద్వారం పరిధిలో ఉన్నాయి. ఇక్కడకు అతి సమీపంలో ఉన్న సెక్టార్ 1, 2లలో పోలీసు పోస్టులు, తప్పిపోయిన వారి కోసం సహాయక కేంద్రాలు తదితర తాత్కాలిక ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. సెక్టార్ 3, 4 కూడా సంగమ ప్రాంతానికి దగ్గరగానే ఉంటాయి.


సామర్థ్యం 4 రెట్లు పెంపు

కుంభమేళాను దృష్టిలో ఉంచుకొని యూపీ ప్రభుత్వం ముందుగానే సంగమ ముఖద్వారం తూర్పు ప్రాంతాన్ని విస్తరించింది. గంగా నదిపై శాస్త్రి బ్రిడ్జి, సంగమ ముఖద్వారం మధ్య 26 హెక్టార్ల స్థలాన్ని అదనంగా అందుబాటులోకి తెచ్చింది. 1,650 మీటర్ల పొడవునా ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక ఘాట్లు సిద్ధం చేసింది. దీంతో ఒకేసారి ఎక్కువమంది భక్తులు స్నానాలు చేసే అవకాశం లభించింది. 2019లో సంగమ ముఖద్వారం వద్ద గంటకు 50వేల మంది వరకూ భక్తులు స్నానాలు చేస్తే ప్రస్తుతం ప్రతి గంటకు 2లక్షల మందికి పైగా స్నానం చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కాగా, జనవరి 13న పుష్య పౌర్ణమి నాడు, 14న తొలి అమృత స్నానాల వేళ ఇక్కడ గంటకు 3లక్షల మంది చొప్పున భక్తులు స్నానాలు ఆచరించారు.

నిరుద్యోగులకు నెలకు రూ. 8,500

మహిళలకు ప్రతినెలా రూ.2,500.. పింఛన్ రూ.5 వేలు

ఢిల్లీలో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల



న్యూఢిల్లీ, జనవరి 29: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తాము విజయం సాధిస్తే కులగణన అమలు చేస్తామని, పూర్వాంచలీలకు ప్రత్యేకంగా ఓ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని, చదువుకున్న నిరుద్యోగ యువతకు ఏడాదిపాటు నెలకు రూ.8,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. అలాగే, మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తామని, కుటుంబానికి నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తామని, ఉచిత రేషన్ కిట్లు కూడా పంపిణీ చేస్తామని, ఢిల్లీ నగరంలో 100 ఇందిరా క్యాంటీన్లు ఏర్పాటు చేసి, రూ.5కే భోజనం అందిస్తామని, యమునా నదికి ఇరువైపులా ఆక్రమణలు తొలగిస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. ఆరోగ్యం, విద్య, మహిళా, మైనారిటీ, ఎస్సీ, పూర్వాంచలీ, ఎల్‌జీబీటీక్యూఐఏ అంశాలకు సంబంధించి మొత్తం 219 హామీలతో రూపొందించిన ఈ మేనిఫెస్టోను కాంగ్రెస్ కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌చార్జి జైరాం రమేశ్‌తో కలిసి ఆ పార్టీ ఢిల్లీ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్ విడుదల చేశారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు నెలకు రూ.5 వేల పింఛన్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33% రిజర్వేషన్, ఉద్యోగాలు చేసే మహిళల కోసం మరిన్ని హాస్టళ్లు ఏర్పాటు చేస్తామని కూడా పేర్కొంది. మరోవైపు, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్(ఆమ్‌ఆద్మీ పార్టీ) మధ్య రహస్య పొత్తు ఉందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఇది ఢిల్లీపై డబుల్ ఆపదగా మారనుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఢిల్లీలోని కర్తార్ నగర్‌లో మోదీ 'సంకల్ప ర్యాలీ' నిర్వహించారు. ఢిల్లీ వైపు ప్రవహిస్తున్న యమునా నదిలో హరియాణా ప్రజలు విషం కలిపి ఢిల్లీవాసులను చంపేందుకు ప్రయత్నిస్తున్నారంటూ కేజ్రీవాల్ నిందలు వేయడం ద్వారా హరియాణా ప్రజలతోపాటు భారతీయులందరినీ అవమానించారని మోదీ మండిపడ్డారు.

మెడికల్ పీజీలో లోకల్ కోటా వద్దు




(మొదటి పేజీ తరువాయి)

వాడుతున్నాయన్నారు. శాశ్వత నివాసం అంటే ఓ వ్యక్తి నివాసం ఉంటున్న ప్రాంతం అని కాదని స్పష్టం చేశారు. భారతీయులందరి ఒకే ఆవాస ప్రాంతమని పేర్కొన్నారు. భారతదేశంలో ఎక్కడైనా చదువుకొనే హక్కును రాజ్యాంగం మనకు కల్పించిందని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. వైద్య విద్య పీజీ ప్రవేశాల్లో నివాసిత ఆధారిత రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని 2019లోనే పంజాబ్ హరియాణా హైకోర్టు తీర్పునిచ్చింది. చండీగఢ్ ప్రభుత్వ వైద్య కళాశాలలో రాష్ట్ర కోటా కింద 64 పీజీ సీట్లు ఉన్నాయి. ఆ సీట్లను చండీగఢ్ నివాసితులు లేదా అదే కాలేజీలో ఎంబీబీఎస్ చదివిన వారితో భర్తీ చేశారు. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. అలాంటి రిజర్వేషన్లు సరికాదని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును కొందరు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. విచారణ సందర్భంగా గతంలో సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ.. 64 సీట్లలో విద్యా సంస్థ, ఇతర రిజర్వేషన్లకు అనుగుణంగా 32 సీట్లను భర్తీ చేసుకోవచ్చని తెలిపింది. మిగిలిన 32 సీట్లను స్థానికత ఆధారంగా భర్తీ చేయడం తప్పని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. కేసు ప్రాముఖ్యత దృష్ట్యా సుప్రీం త్రిసభ్య ధర్మాసనానికి సిఫారసు చేయగా.. తాజా తీర్పు వెలువడింది. దీంతో పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో దేశవ్యాప్తంగా పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు సీట్లు దక్కనున్నాయి.

లోకం తీరు

దేశవ్యాప్తంగా మెరుగుపడ్డ చిన్నారుల చదువు సంధ్యలు: నివేదిక



ఒప్పందాలు లెక్కచేయని చైనా

» ఎల్‌ఏసీ వెంబడి సైనిక కార్యకలాపాల విస్తరణ

న్యూఢిల్లీ, జనవరి 29: వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి ఉద్రిక్తతలు పెంచేలా చైనా కవ్వింపు చర్యలు కొనసాగిస్తూనే ఉంది. సరిహద్దులోని డెప్సాంగ్, డెమ్‌చోక్ నుంచి సైనిక దళాలను ఉపసహరించాలని గత అక్టోబరులో ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి దౌత్య చర్చల్లో నిర్ణయం తీసుకున్నప్పటికీ చైనా దానిని పట్టించుకోవడంలేదు. దౌత్యపరంగా చర్చలను కూడా లెక్కచేయడంలేదు. అరుణాచల్ ప్రదేశ్ నుంచి లడఖ్ వరకు ఎల్‌ఏసీ వెంబడి మూడు సెక్టార్‌లలో మౌలిక సదుపాయాలు, రోడ్లు, బ్రిడ్జిలు, హెలీప్యాడ్‌లు, మిలిటరీ స్థావరాలను విస్తరిస్తూనే ఉంది. వాస్తవాధీన రేఖ వెంబడి పలు ప్రాంతాల్లో చైనా ఆర్మీ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని భారత మిలిటరీ అధికారి ఒకరు స్పష్టం చేశారు. తూర్పున ఉన్న రోంగ్త్రోచు, ఇతర ప్రాంతాల్లో ఆ పనులు జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఇక్కడి సరిహద్దు గ్రామాల నుంచి ఎల్‌ఏసీ వరకు కొత్తగా సిమెంట్ రోడ్లు, మిలిటరీ క్యాంపులను చైనా మిలిటరీ నిర్మిస్తోందని వివరించారు. అవసరమైతే పెద్దఎత్తున దళాలను సరిహద్దు వద్దకు తరలించేందుకు ఈ పనులు కొనసాగిస్తోందన్నారు.

38% తగ్గిన హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్లు

న్యూఢిల్లీ, జనవరి 29: అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసా ప్రక్రియలో అమలులోకి తెచ్చిన నూతన నిబంధనల ప్రభావంతో ఈసారి రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గాయి. 2024లో 7,58,994 రిజిస్ట్రేషన్లు నమోదవగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాటి సంఖ్య 4,79,953కు పడిపోయింది. అంటే దాదాపు 38 శాతం తగ్గుదల నమోదైంది. తాజా దరఖాస్తుల్లో 4,70,342 అర్హత కలిగినవిగా అమెరికా పౌరసత్వ, వలసల విభాగం (యూఎస్‌సీఐఎస్) గుర్తించింది. గతంలో ఒకే అభ్యర్థి కోసం పలువురు యజమానులు రిజిస్ట్రేషన్లు సమర్పించే అవకాశం ఉండేది. దీంతో ఉద్యోగికి వీసా మంజూరయ్యే అవకాశాలు గణనీయంగా పెరిగేవి. అయితే సవరించిన నిబంధనల ప్రకారం ప్రతి లబ్ధిదారుడికి ఒక్క రిజిస్ట్రేషన్‌ను మాత్రమే అనుమతిస్తారు.

బెంగళూరులో భారీ అగ్నిప్రమాదం

» వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాలు దగ్ధం

బెంగళూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని శేషాద్రిపురం జేడీఎస్ కార్యాలయం పక్కనున్న మైదానంలో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగి వివిధ కేసులలో సీజ్ చేసిన వందకు పైగా వాహనాలు దగ్ధమయ్యాయి. శేషాద్రిపురం, మల్లేశ్వరం, శ్రీరాంపుర పోలీసుస్టేషన్‌ల పరిధిలో సీజ్ చేసిన వాహనాలను 2016 నుంచి ఈ మైదానంలో ఉంచుతున్నారు. జక్కరాయన చెరువుగా పిలవబడే ఈ ప్రాంతంలో రెండు ఎకరాలకుపైగా ఖాళీ స్థలం ఉంది. గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ కాల్చి, ఆర్పేయకుండా పడేయడంతో గడ్డి, మొక్కలు అంటుకుని అగ్ని కీలలు వ్యాపించాయని పోలీసులు భావిస్తున్నారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు దగ్ధమయ్యాయి.

ఎయిర్ ఇండియా కనిష్క విమానం పేలుడు అనుమానితుడిని చంపిన వ్యక్తికి జీవిత ఖైదు

న్యూఢిల్లీ, జనవరి 29: 1985లో ఎయిర్ ఇండియా కనిష్క విమానం బాంబు పేలుడు ఘటనలో అనుమానితుడు రిపుదమన్ సింగ్ మాలిక్‌ను హతమార్చిన కేసులో టనెర్ ఫాక్స్‌కు బ్రిటిష్ కొలంబియా సుప్రీంకోర్టు జీవిత ఖైదు విధించింది. ఈ కేసులో ఫాక్స్‌తోపాటు సహ నిందితుడిగా ఉన్న జోస్ లోపెజ్‌పై గత అక్టోబరులో నేరనిర్ధారణ జరిగింది. తాము డబ్బులు తీసుకుని మాలిక్‌ను హత్య చేసినట్టు వీరు అంగీకరించారు. డబ్బు ఎవరు ఇచ్చింది మాత్రం వెల్లడించలేదు. లోపెజ్‌కు శిక్ష ఖరారుచేయాల్సి ఉంది. 1985లో ఎయిర్ ఇండియా విమానాన్ని బాంబుతో పేల్చివేయడంతో 329 మంది చనిపోయారు.

వందర్‌ఫుల్

ఇస్రో శతక ప్రయోగం విజయవంతం

» నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్‌ఎల్వీ-ఎఫ్15 ..

» 19 నిమిషాల్లోనే నావిక్-02 ఉపగ్రహం కక్ష్యలోకి..



సూళ్లూరుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మహాద్భుత విజయాన్ని అందుకుంది. ఈ ఏడాది ఇస్రో చేపట్టిన తొలి ప్రయోగం.. షార్‌లో వందో మిషన్.. విజయవంతమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రంలోని రెండో ప్రయోగ వేదికపై నుంచి బుధవారం ఉదయం 6:23 గంటలకు ఇస్రో చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ప్రయోగం గ్రాండ్ సక్సెస్ అయింది. 27:30 గంటల కౌంట్‌డౌన్ ముగియగానే రెండోతరం నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌వీఎస్-02 (నావిక్-02)ను తీసుకుని నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి ఎగిరిన రాకెట్.. మూడు దశలను నిరాటంకంగా పూర్తిచేసుకుని 19.12 నిమిషాల్లోనే దాన్ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ గమనాన్ని పర్యవేక్షిస్తున్న ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్.. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు. ఇస్రో అధిపతిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఇదే మొదటి ప్రయోగం. శాస్త్రవేత్తలు ఉపగ్రహంలో ఉన్న 1,250 కిలోల ఇంధనాన్ని దశలవారీగా మండిస్తూ, భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలోకి దాన్ని ప్రవేశపెడుతారు.

నావిగేషన్ వ్యవస్థ బలోపేతం దిశగా..

ఎన్‌వీఎస్-02.. ఇస్రో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. ఇది కొత్తతరం నావిగేషన్ ఉపగ్రహాల్లో రెండోది. భౌగోళిక, వైమానిక, సముద్ర నేవిగేషన్, సేవలు, వ్యవసాయంలో సాంకేతికత, మొబైల్ లోకేషన్ ఆధారిత సేవలకు ఉపయోగపడుతుంది. దేశీయ నావిగేషన్ వ్యవస్థ ఐఆర్‌ఎన్ఎస్ఎస్ ఇప్పటికే అందుబాటులో ఉండగా.. దీన్ని మరింత బలోపేతం చేసేందుకు నావిక్ సిరీస్ కొత్త ఉపగ్రహాలు దోహదపడతాయి. గతంలో పంపిన ఉపగ్రహాల్లో ఎస్-బ్యాండ్, కె-బ్యాండ్, కేయూ-బ్యాండ్ లాంటి ఉపకరణాలను అమర్చారు. రెండోతరం నావిగేషన్ సిరీస్ ఉపగ్రహాలైన నావిక్-01, నావిక్-02లో ఎల్-1, ఎల్-5, ఎస్-బ్యాండ్ సిగ్నల్ వ్యవస్థను అమర్చారు. ఎల్-1లో ప్రజలకు ఉపయోపడే సివిలియన్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్ ఉంటుంది. భూ, జల, వాయు మార్గాల్లో పొజిషన్‌ను 20 మీటర్ల అత్యంత ఖచ్చితత్వంతో, 50 నానోసెకన్ల రియల్‌టైమ్‌తో చూపించడం ఈ కొత్తతరం ఉపగ్రహాల ప్రత్యేకత. భారతదేశ సరిహద్దుల ఆవల 1,500 కిలోమీటర్ల పరిధి వరకూ ఈ వ్యవస్థ పనిచేస్తుంది.

2 నెలల్లో నిసార్ ప్రయోగం

నావిక్-02 ప్రయోగం విజయానంతరం షార్‌లోని మీడియా సెంటర్‌లో సహచర శాస్త్రవేత్తలతో కలిసి నారాయణన్ మీడియాతో మాట్లాడారు. నావిక్-02 పదేళ్లపాటు సేవలందిస్తుందని వివరించారు. ఇస్రో, నాసా సంయుక్తంగా చేపట్టిన నిసార్ ఉపగ్రహాన్ని మరో 2నెలల్లో జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా ప్రయోగిస్తామని నారాయణన్ వెల్లడించారు. కాగా, శ్రీహరికోట నుంచి వందో ప్రయోగాన్ని చేపట్టిన ఇస్రోకు అభినందనలు వెల్లువెత్తాయి. ఈ ప్రయోగం ద్వారా ఇస్రో చరిత్రాత్మక మైలురాయిని అధిగమించిందని ప్రధాని మోదీ ప్రశంసించారు.

100 | షార్‌లో ఇస్రోకిది వందో ప్రయోగం.

62 | ఇస్రో 100 మిషన్లలో పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా చేపట్టిననే ప్రయోగాలే 62 ఉన్నాయి. జీఎస్ఎల్వీ (17), ఎల్‌వీఎం3 (7), ఎస్ఎస్ఎల్వీ (3) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ఐదేళ్లలో 100 మిషన్లు సాధ్యమే!

100 మిషన్ల మైలురాయిని చేరుకోవడానికి ఇస్రోకు దాదాపు ఐదు దశాబ్దాలు (46 ఏళ్లు) పట్టింది. ఇది చాలా ఎక్కువ కాలమే..! 1979లో షార్‌లో తొలి ప్రయోగాన్ని చేపట్టినప్పుడు ఇస్రో వద్ద ఇప్పుడు ఉన్నంత టెక్నాలజీ లేదు. రాకెట్ టెక్నాలజీ కోసం రష్యా వంటి దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. దీంతో మెల్లగా ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చిన ఇస్రో వంద మిషన్లు పూర్తిచేసుకుంది. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారాయి. అత్యాధునిక టెక్నాలజీని ఇస్రో అందిపుచ్చుకుంది. సొంతంగా రాకెట్లు, ఇంజన్లు నిర్మించుకుంటోంది. ఈ క్రమంలో 2000వ సంవత్సరం నుంచి దూకుడు పెంచింది. ఇదే జోరు కొనసాగిస్తే వచ్చే ఐదేళ్లలో మరో వంద ప్రయోగాలు నిర్వహించి 200 మార్కు అందుకోగలమని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ అన్నారు. సైకిల్, ఎడ్లబండిపై రాకెట్ విడిభాగాలను తరలించిన కాలం నుంచి.. అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను డాకింగ్ చేసే స్థాయికి ఇస్రో ఎదిగింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్, రోవర్‌ను దింపి చరిత్ర సృష్టించిన ఇస్రో.. సూర్యుడి గుట్టు విప్పేందుకు ఆదిత్య-ఎల్1 మిషన్‌ను కూడా చేపట్టింది. త్వరలోనే చంద్రుడిపైకి మన వ్యోమగామిని పంపే ప్రయత్నాలు చేస్తోంది.

'వక్ఫ్' నివేదికకు జేపీసీ ఓకే

15-11 మెజారిటీతో ఆమోదం

» నేడు లోక్‌సభ స్పీకర్‌కు సమర్పణ

» జేపీసీ ఛైర్మన్ జగదంబికాపాల్ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 29: కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును పరిశీలించి.. పలు మార్పులు, సవరణలు ప్రతిపాదిస్తూ రూపొందించిన నివేదికకు సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) బుధవారం ఆమోదముద్ర వేసింది. 15-11 మెజారిటీతో కమిటీ సదరు రిపోర్టును అంగీకరించిందని బీజేపీ ఎంపీ, జేపీసీ ఛైర్మన్ జగదంబికాపాల్ విలేకరులకు తెలిపారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన పలు అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని.. బిల్లు చట్టరూపం దాలిస్తే వక్ఫ్ బోర్డు తన విధులను మరింత సమర్థంగా, పారదర్శకంగా నిర్వర్తించేందుకు తోడ్పడుతుందని చెప్పారు. వక్ఫ్ ఆస్తుల ప్రయోజనాలు పొందేవారి జాబితాలో తొలిసారి పస్మాందా ముస్లింలు, పేదలు, మహిళలు, అనాథలను చేర్చామన్నారు. 655 పేజీలతో కూడిన తమ నివేదికను గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పిస్తామని చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటులో బిల్లును ఆమోదిస్తారా అని విలేకరులు ప్రశ్నించగా.. భావి కార్యాచరణను నిర్ణయించాల్సింది సభాపతి, పార్లమెంటేనని ఆయన స్పష్టంచేశారు. నిరుడు ఆగస్టు 8న ఏర్పాటైన ఈ జేపీసీ ఢిల్లీలో 38 సమావేశాలు నిర్వహించింది.కాగా.. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని విపక్షాలు మండిపడ్డాయి. కమిటీ పనితీరుపైన, అది ఆమోదించిన బిల్లుపైన కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆప్, ఎంఐఎం సభ్యులు విమర్శలు గుప్పించారు. వారిలో కొందరు కమిటీకి అసమ్మతి నోట్‌ను సమర్పించారు. నివేదికలో దీనిని నమోదుచేయాల్సి ఉంటుంది. రిపోర్టు 655 పేజీలు ఉందని.. దానిని తమకు మంగళవారం సాయంత్రం పంపిణీ చేశారని.. బుధవారం సాయంత్రం 4 గంటల్లోపు అభిప్రాయం చెప్పాలన్నారని.. అన్ని పేజీలు చదివి నిరసన సిద్ధం చేసుకోవడానికి చాలా తక్కువ వ్యవధి ఇచ్చారని విపక్ష ఎంపీలు ఆక్షేపించారు. 'వక్ఫ్ బై యూజర్ (దీర్ఘకాలం వక్ఫ్ బోర్డు వినియోగంలో ఉండే ఆస్తి దానికే శాశ్వతంగా సంక్రమిస్తుంది. కోర్టుల్లో సవాల్ చేయడానికి వీల్లేదు)' అనే నిబంధనను తొలగించడాన్ని ఒవైసీ వ్యతిరేకించారు.

ఆ వ్యోమగాములను వెనక్కి తీసుకురండి

ఐఎస్ఎస్ నుంచి సునీత, విల్‌మోర్‌ను తీసుకురావాలని మస్క్‌కు ట్రంప్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, జనవరి 29: అంతరిక్షంలో ఇరుక్కుపోయిన నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లను తిరిగి భూమికి తీసుకురావాలని స్పేస్ ఎక్స్‌ను, దాని అధినేత ఎలాన్ మస్క్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరారు. మస్క్ ఈ పనిని త్వరలోనే పూర్తి చేస్తారని ట్రంప్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ట్రంప్ పోస్టును షేర్ చేస్తూ త్వరలోనే ఆ పనిని పూర్తి చేస్తామని ఎలాన్ మస్క్ తెలిపారు. వ్యోమగాములను అంతరిక్షం నుంచి తీసుకొచ్చే విషయంలో గత బైడెన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మస్క్ ఆరోపించారు. వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లో గతేడాది జూన్‌లో 8 రోజుల మిషన్ లో భాగంగా అంతరిక్ష కేంద్రా(ఐఎస్ఎస్)నికి వెళ్లారు. అయితే వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురై అనుకున్న సమయానికి వారు తిరిగి రావడం వీలుకాలేదు. వారు 7 నెలలుగా అంతరిక్షంలోనే చిక్కుకుపోయి ఉన్నారు. ఏడునెలలుగా అంతరిక్షంలో చిక్కుకుపోవడంతో సునీత నడవడం మర్చిపోయినట్లు తెలుస్తోంది. సోమవారం ఆమె అంతరిక్షం నుంచే కొందరు విద్యార్థులతో మాట్లాడారు. "నేను చాలా కాలంగా అంతరిక్షంలో ఉంటున్నాను ఇక్కడ నడవడానికి లేదు. కూర్చోవడానికి, పడుకోవడానికి వీలులేదు. ప్రస్తుతం నేను నడవడాన్ని గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను" అన్నారు.

రక్షణశాఖ భూముల్లోని అక్రమ నిర్మాణాల కూల్చివేత

» కోర్టు తీర్పుతో నిర్మాణాలను తొలగించిన అధికారులు

» రోడ్డున పడ్డ ఏవియేషన్ అకాడమీ విద్యార్థులు

బోయిన్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో రక్షణశాఖ భూములలో వెలసిన అక్రమ నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేశారు. కంటోన్మెంట్ పరిధిలో రక్షణ శాఖ బీ-3 క్యాటగిరీకి చెందిన సుమారు 120 బంగ్లాల్లో కొన్ని కోర్టు వివాదంలో ఉన్నాయి. వాటిలో ఒకటి బంగ్లా నంబర్ 190. ఇది మేడ్చల్ హైవేను అనుకుని బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి గార్డెన్ పక్కన ఉంది. ఇక్కడ కొన్ని సంవత్సరాల క్రితం వెలసిన అక్రమ నిర్మాణాలతోపాటు ఈ భవనంలో అనుమతులు లేకుండా నడిపిస్తున్న రాజీవ్ గాంధీ ఏవియేషన్ అకాడమీని కంటోన్మెంట్ సీఈవో ఆదేశాల మేరకు అధికారులు బుధవారం కూల్చివేశారు. దీంతో ఈ కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థులు రోడ్డున పడ్డారు. జీఎల్ఆర్ సర్వేనెంబర్ 538లో భూమిని ఆక్రమించి 190 భవనాన్ని నిర్మించారని గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కొంతకాలంగా విచారణ జరగ్గా, ఈ స్థలంలోని అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని ఇటీవల కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో కూల్చివేతలు చేస్తున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఇదే తరహాలో కంటోన్మెంట్ పరిధిలోని అక్రమ నిర్మాణాలనూ త్వరలోనే నేలమట్టం చేస్తామని అధికారులు తెలిపారు. రక్షణశాఖకు సంబంధించిన భూములను కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

తరగతి గదిలో కిందపడి గాయం.. చికిత్స పొందుతూ బాలిక మృతి

» ఖమ్మం జిల్లాలో ఘటన

రఘునాథపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో ఆడుకుంటూ కింద పడి గాయపడిన ఓ బాలిక.. మరుసటి రోజు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మరణించింది. అయితే, సదరు బాలిక గుండెపోటుతో మరణించిందని పోలీసులు కేసు మార్చి రాశారని బాధిత కుటుంబసభ్యులు ఆరోపించడం వివాదాస్పదమైంది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో జరిగిన ఈ ఘటన లో విద్యార్థిని పొట్ట శ్రావణి (14) బుధవారం మృతి చెందింది. రఘునాథపాలెం మండలం రేగులచెలకకు చెందిన పొట్ట నాగేశ్వరరావు, మరియమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. నాగేశ్వరరావు 13ఏళ్ల క్రితం ప్రమాదంలో మరణించగా నాటి నుంచి కూలిపనులు చేస్తూ మరియమ్మ కుమార్తెలను పెంచుతోంది. చిన్న కుమార్తె అయిన శ్రావణి కొయచెలక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. అయితే, ఈ నెల 25న తన స్నేహితులతో కలిసి తరగతి గదిలోని బల్లపై ఆడుకుంటుండగా శ్రావణి కింద పడింది. తల వెనుక దెబ్బ తగిలి బొప్పి కట్టింది. మరుసటి రోజు శ్రావణికి వాంతులు, ఫిట్స్ రావటంతో తల్లి, తాత ఆమెను ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూసింది. దీంతో ఈ ఘటనపై శ్రావణి తాత వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, తలకు గాయమైన విషయాన్ని దాచి.. శ్రావణి జ్వరం, గుండెపోటుతో మరణించిందని పోలీసులు కేసు రాశారని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం హైదరాబాద్ వాసి మృతి



వాజిద్(ఫైల్)

ఖైరతాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖైరతాబాద్ ఎంఎస్ మక్తావాసి మహమ్మద్ వాజిద్(28) మృతి చెందాడు. ఇతడు ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లి, చదువు పూర్తి కాగా పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు. చికాగో నుంచి 500 కి.మీ. దూరంలో ఉన్న టాంగో వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా ఐవా వద్ద ఓ భారీ ట్రక్కు ఇతడు ప్రయాణిస్తున్న కారును ఢీకొనడంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 4 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఇతడి తండ్రి మహమ్మద్ ఐజాజ్ జలమండలి ఉద్యోగి కాగా తల్లి షమీం బేగం గృహిణి. ఖైరతాబాద్ యూత్ కాంగ్రెస్ నాయకుడిగా పనిచేసిన వాజిద్ మృతితో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఆయన ఇంటి వద్దకు వచ్చి కుటుంబసభ్యులను పరామర్శించారు. వాజిద్ ప్రస్తుతం ఎన్ఆర్ఐ కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం సభ్యుడిగా ఉన్నాడు.

వికటించిన మధ్యాహ్న భోజనం

నారాయణపేట, కామారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో 47 మంది విద్యార్థులకు అస్వస్థత

» వెంటనే ఆస్పత్రుల్లో చికిత్స..

ప్రమాదం లేదన్న వైద్యులు



సూర్యాపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ధన్వాడ/ ఎల్లారెడ్డి/ భానుపురి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం వికటించి నారాయణపేట, కామారెడ్డి జిల్లాల్లో 39 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నారాయణపేట జిల్లా ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం మెనూ ప్రకారం భోజనంలో ఆలుగడ్డ, వంకా య కూరలు వడ్డించారు. భోజనం చేసిన తరువాత 25 మంది విద్యార్థులకు కడుపునొప్పి వచ్చింది. వారిలో కొందరు ఇళ్లకు వెళ్లగా తల్లిదండ్రులు వారిని తిరిగి పాఠశాలకు తీసుకొచ్చారు. అక్కడ ప్రస్తుతం విధుల్లో ఉన్న ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయుడు నరసింహాచారి వెంటనే స్పందించి ప్రాథమిక ఆరోగ్య సిబ్బందికి సమాచారం అందించడంతో వారు పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు అక్కడే చికిత్స అందించారు. భయపడాల్సిందేమీ లేద ని విద్యార్థుల పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్య సిబ్బంది చెప్పారు. మరో ఘటనలో కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో 113 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా బుధవారం 90 మంది మధ్యా హ్న భోజనం చేశారు. వీరిలో 14 మంది విద్యార్థులు కడుపు నొప్పితో వాంతులు చేసుకున్నారు. గమనించిన ఉపాధ్యాయులు వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. 10 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడడంతో వారిని ఇంటికి పంపించారు. మరో నలుగురు విద్యార్థులు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. మరో ఘటనలో సూర్యాపేట గిరినగర్‌లోని ప్రభుత్వ గిరిజన వసతి గృహంలో కలుషిత ఆహారం తిని 8 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఉపాధ్యాయులు వీరందరినీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. భోజనం సరిగ్గా లేకపోవడం వల్లే తమ పిల్లలు అస్వస్థతకు గురైనట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా నాణ్యమైన ఆహారాన్ని మధ్యాహ్న భోజనంలో పెట్టాలని వారు అధికారులను కోరుతున్నారు.

వరుస ఘటనలు సిగ్గుచేటు: హరీశ్ రావు

మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు ఆసుపత్రిపాలు కావడం సర్కారు నిర్లక్ష్యానికి నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలు.. నిత్యకృత్యమవుతున్నా ప్రభుత్వం లో చలనం లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా కనీస చర్యలు చేపట్టడం లేదని, విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలయ్యాయని హరీశ్ రావు విమర్శించారు.

'ఇంటర్ విద్యార్థిని' తండ్రిపై హత్యాయత్నం, అట్రాసిటీ కేసు

» కత్తిగాటుతో చికిత్స పొందుతున్న యువకుడు

» అతనిపై పోక్సో, ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు కేసు

వరంగల్ క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ గోపాల్‌పూర్‌లో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య ఘటనలో.. ఆమెను కలిసేందుకు వచ్చిన యువకుడిపై హత్యాయత్నం జరిగినట్లు తెలుస్తోంది. విద్యార్థిని తండ్రి చేతిలో యువకుడు కూతాటి భరత్‌కు కత్తిగాట్లు కావడంతో.. అతడు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం విద్యార్థిని ఇంటికి వచ్చిన భరత్‌ను ఆమె తండ్రితోపాటు మేనమామ బంధించి చితకబాదుతుండగా.. ఆందోళన చెందిన విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. అయితే యువకుడిపై దాడి సమయంలోనే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మృతి చెందిన విద్యార్థినిని ఎంజీఎం మార్చురీకి తరలించి, యువకుడిని అదుపులోకి తీసుకొని ఆస్పత్రికి తరలించారు. భరత్ కోలుకుంటున్నట్లుగా తెలుస్తోంది. కాగా, తన కుమారుడిని కులం పేరుతో దూషిస్తూ, కత్తితో గొంతు కోసి చంపడానికి ప్రయత్నించారంటూ భరత్ తల్లి విజయ కేయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థిని తండ్రి వెంకటరమణ, మేనమామ లక్ష్మారెడ్డిపై పోలీసులు హత్యాయత్నంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అయితే తన కుమార్తెను లైంగికంగా వేధిస్తూ, ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించాడని విద్యార్థిని తండ్రి వెంకటరమణ చేసిన ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సోతోపాటు ఆత్మహత్యకు ప్రేరేపించాడనే సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవిందర్ తెలిపారు.

ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాల ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

» తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల అసోసియేషన్ డిమాండ్

రాంనగర్, జనవరి29(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలంటూ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరి సతీష్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఫిబ్రవరి 3 నుంచి జరిగే ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలకు తమ కళాశాలల సెంటర్లను ఇవ్వబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాలను వేధిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి శ్రీకృష్ణఆదిత్య, సీఎంవోలోని ఐఏఎస్ అధికారి మాణిక్యరాజును వెంటనే బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాల రాష్ట్ర సదస్సు జరిగింది.

భార్య కుటుంబంపై విష ప్రయోగం..

» బ్రిటన్‌లో నిందితుడి అరెస్టు

» నేరస్థుల అప్పగింత ఒప్పందం ద్వారా రప్పించే యత్నం

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): భార్య మీద ద్వేషంతో ఆమెతో పాటు ఆమె కుటుంబాన్ని అంతం చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిని బ్రిటన్‌లో అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు రెండేళ్ల క్రితం వినయాపూర్‌లో వెలుగుచూసిన ఈ కేసులో నిందితుడు ముప్పరపు అజిత్ బ్రిటన్‌లో తలదాచుకున్నాడు. డాక్టర్ అయిన తన భార్య శిరీషను ఆమె కుటుంబాన్ని విష ప్రయోగం ద్వారా హత్య చేయించడానికి అజిత్ పలు ఎత్తులు వేశాడు. ఒక ముఠానే ఏర్పాటు చేశాడు. భార్య కుటుంబానికి పంపించిన మసాల పొడుల్లో పాదరసాన్ని కలిపించాడు. దాన్ని ఆహారంలో వాడుకున్న శిరీష తల్లి ఉమా మహేశ్వరి చికిత్స పొందుతూ 2023లో మరణించింది. శిరీష సోదరుడు అస్వస్థతకు గురయ్యారు. దీంతో భర్తను అనుమానించిన శిరీష పోలీసులను ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో నిందితుడికి సహకరించిన ఆరుగురిని అరెస్టు చేశారు. బ్రిటన్‌లో తలదాచుకున్న అజిత్‌ను ఈ నెల 17న ఇంటర్‌పోల్ సాయంతో అక్కడి అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ క్రమంలో నిందితుడిని నేరస్థుల అప్పగింతలో భాగంగా హైదరాబాద్‌కు రప్పించడానికి కావాల్సిన చట్టపరమైన చర్యలను సైబరాబాద్ పోలీసులు ప్రారంభించారు.

ఏసీబీ వలలో ఎస్సై, పశువైద్యాధికారి

» కేసు నమోదు చేయకుండా ఉండేందుకు, ఎన్‌వోసీ ఇచ్చేందుకు లంచాలు.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



ఎస్సై సుధాకర్, రాథోడ్ రమేశ్

ఖిల్లా (నిజామాబాద్)/ ఉట్నూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యవహారంలో కేసు నమోదు చేయకుండా ఉండేందుకు, మరో ఉదంతంలో ఎన్‌వోసీ ఇచ్చేందుకు లంచాలు తీసుకుంటూ ఎస్సై, పశువైద్యాధికారి ఏసీబీ అధికారులు దొరికిపోయారు. కామారెడ్డి జిల్లా లింగంపేటకు చెందిన వ్యాపారి కొండేశ్ తన కారును నిజామాబాద్‌కు చెందిన స్వామి అనే వ్యక్తికి 2022లో విక్రయించారు. విక్రయం సమయంలో ఆ కారుపై ఉన్న వాయిదాలను కొన్నవారే చెల్లించాలని ఒప్పందం కుదిరింది. అయితే స్వామి ఆ వాయిదాలను చెల్లించకపోవడంతో అసలు యజమాని కొండేశ్‌కు బ్యాంకు అధికారులు ఇటీవల నోటీసులు పంపారు. దీంతో స్వామిపై కొండేశ్ లింగంపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో లింగంపేట ఎస్సై సుధాకర్ కారుతో సహా స్టేషన్‌కు రావాలని స్వామికి సూచించారు. స్వామి కారు తీసుకుని స్టేషన్‌కు వెళ్లగా కేసు నమోదు చేయకుండా ఉండేందుకు రూ. 20 వేలు ఇవ్వాలని ఎస్సై డిమాండ్ చేశారు. తాను అంతివ్వలేనని రూ.12,500 ఇస్తానని ఎస్సైతో చెప్పిన స్వామి అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు నిజామాబాద్‌లోని రుక్మిణి చాంబర్ సమీపంలో స్వామి.. రూ. 12,500 నగదును ఎస్సైకు ఇస్తుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా ఆయన్ను పట్టుకున్నారు. మరో ఉదంతంలో.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం సాంపూర్ గ్రామ పశువైద్యాధికారి రాథోడ్ రమేశ్ తనతో పాటు ఆసుపత్రిలో పనిచేసిన ఉద్యోగికి ఎన్‌వోసీ ఇచ్చేందుకు రూ.25 వేలు డిమాండ్ చేశారు. చివరకు ఇద్దరి మధ్య రూ. 15 వేలకు ఒప్పందం కుదిరింది. అనంతరం ఉద్యోగి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం పశువైద్యాధికారి రాథోడ్ రమేశ్ కార్యాలయంలో సదరు ఉద్యోగి నుంచి రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు అరెస్టు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విషాదం

కోట్లాదిమంది పుణ్యస్నానాలు ఆచరిస్తున్న ఆధ్యాత్మిక వేడుకలో తొక్కిసలాట జరిగి, ముప్పైమంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధకలిగిస్తున్నది. ఇటువంటి భారీఉత్సవాల నిర్వహణలో చిన్న తప్పిదం జరిగినా వందలమంది ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. ఊహకు అందని ఉపద్రవాలను, ప్రమాదాల సంభావ్యతను అంచనావేసుకొని సంసిద్ధంగా ఉండాల్సిన సందర్భాలు ఇవి.

ఇప్పటికే కొనసాగుతున్న రద్దీకి తోడు, మౌని అమావాస్య నాడు కోట్లాదిమంది అదనంగా వచ్చిచేరతారని సదరు మంచిరోజులకు విశేష ప్రాచుర్యం కల్పిస్తున్న నిర్వాహకులకు తెలియనిదేమీకాదు. తొక్కిసలాటకు పురిగొల్పిన పరిస్థితులమీద విభిన్నమైన కథనాలు వినబడుతున్నాయి. ఘాట్ల వద్ద ఏర్పాటుచేసిన చెత్తడబ్బాలు చీకట్లో కనబడక కొందరు తన్నుకొనిపడిపోయారనీ, వెనక ఉన్న వారు నెత్తిమీద పెద్దపెద్దబ్యాగులతో సహా వీరిమీద పడ్డారని, పవిత్రస్నానాలకు సమయం ఆసన్నమైందన్న ప్రకటనలు మరోపక్క వినబడుతున్న హడావుడిలో ఈ మరణాలు సంభవించాయని కొన్ని కథనాలు చెబుతున్నాయి. బ్రహ్మముహూర్తానికి ముందు భక్తులు పెద్దసంఖ్యలో ఒక్కసారిగా వచ్చిపడి, కట్టుతప్పి, బారికేడ్లు ధ్వంసం చేసి, మరోదారిపట్టడంతో ఈ దారుణం జరిగిపోయిందని యూపీ పోలీసు ఉన్నతాధికారి చెబుతున్నారు. రెండునెలలకాలంలో 40కోట్ల మంది పుణ్యస్నానాలు చేస్తారని, ఆరు పవిత్రదినాల్లో పదికోట్లమందితో ఘాట్లు కిటకిటలాడతాయని ముందుగానే అంచనాలు ఉండగా, పెద్దపెద్ద ఘోరాలకు ఇలా చిన్నచిన్న కారణాలు చెబుతూంటే ఆశ్చర్యం కలుగుతుంది. భక్తజనం ఇంత భారీగా ఉన్నప్పుడు వారిని నియంత్రించడం, నిలువరించడం సులభమేమీ కాదు. కానీ, తగిన సదుపాయాలు, ఏర్పాట్లు చేశామంటూ విస్తృత ప్రచారంతో ప్రజలు పెద్ద ఎత్తున వచ్చేట్టుగా ప్రభుత్వాలే కృషి చేస్తున్నప్పుడు, ఆ పవిత్ర కార్యం క్షేమంగా పూర్తిచేయాల్సిన బాధ్యత మరింత ఉంది.

రాష్ట్రపతి, ప్రధాని, యూపీ ముఖ్యమంత్రి ఈ సంఘటనకు తీవ్రంగా చలించిపోయారు. ఘటన జరిగిన అనేకగంటలపాటు ఫోన్ సిగ్నల్స్ అందుబాటులో లేకుండాపోయాయని, వదంతుల వ్యాప్తిని నిరోధించడానికి ఇది జరిగివుంటుందని వార్తలు వచ్చాయి. కానీ, వాస్తవంగా జరిగిందేమిటో తెలియకపోవడం కూడా ఇటువంటి సందర్భాల్లో మరింత గందరగోళానికి, భయాలకు అవకాశం ఇస్తుంది. జరిగిన ఘటనమీద బాధను వ్యక్తపరుస్తూనే విపక్షాలు పలురకాల విమర్శలు చేస్తున్నాయి. అందులో రాజకీయం లేకపోలేదు కానీ, సామాన్యభక్త జనానికి అందుబాటులో ఉండాల్సిన ఘాట్ల సంఖ్యను కుదించడం, వీఐపీలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి విమర్శలు పూర్తిగా కొట్టిపారేయలేనివి. మౌని అమావాస్యనాడు సంగమఘాట్‌లో అమృత స్నానాలకు సామాన్య భక్తులు పోటెత్తడం సహజం. భక్తులు సంగమ ముఖద్వారం వద్దకు రావద్దనీ, సమీపంలో ఉన్న ఘాట్లలోనే స్నానాలు చేసి వెనక్కుపోవాలని సీఎంతో సహా అందరూ ఘటన అనంతరం చేస్తున్న సూచన ముందుగానే ప్రజలకు విస్తృతంగా చేరివుంటే ఈ ప్రమాదం జరిగివుండేది కాదేమో. వీఐపీలను అనుమతించలేదని పోలీసు అధికారి చెబుతున్నప్పటికీ, అధిక పాంటూన్ బ్రిడ్జీలను, మార్గాలను ముందుగానే మూసివేసి, సామాన్యజనానికి దారీతెన్నూ లేకుండా చేశారన్న విమర్శలున్నాయి. ఘటన నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే మార్గాలన్నీ మూసివేయడంతో అంతిమంగా అత్యధికసంఖ్యలో భక్తులు రోడ్లమీదే గంటలతరబడి నిలిచిపోవాల్సి వచ్చింది. తొక్కిసలాట బీభత్స దృశ్యాలు మనసును కలచివేస్తున్నాయి. ఆప్తులను కోల్పోయినవారు, అవయవాలు ఛిద్రమై ఆస్పత్రులపాలైనవారి వేదన తీర్చలేనిది. లక్షల్లోనూ, కోట్లలోనూ జనం చేరినప్పుడు తొక్కిసలాటలు సహజమేనని, స్వాతంత్ర్యానంతర తొలికుంభమేళా సహా పలు సందర్భాల్లో ఇంతకంటే ఎక్కువసంఖ్యలో జనం మరణించారని కొందరు వాదిస్తున్నారు. గతకాలపు విషాదాలను ఎవరు ఎందుకు ఇప్పుడు గుర్తుచేస్తారో తెలియనిదేమీకాదు. కానీ, ఈ మారు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, ప్రపంచస్థాయి నిర్వహణ పద్ధతులను అమలుచేశామని చెబుతున్నందున ఇటువంటివి జరగవన్న నమ్మకం, నిర్వహణా వ్యవస్థల పట్ల విశ్వాసం ప్రజల్లో హెచ్చుతుంది. మరో మూడు పవిత్రస్నానాలతో సహా మహాకుంభమేళా అత్యంత భద్రంగా, సవ్యంగా పూర్తి కావాలని కోరుకుందాం.


దేశ ఖనిజ భవిష్యత్తుకు 'సప్తపది'

గనులు, ఖనిజాలు దేశ సంపద సృష్టికి మూలం. వేలాది సంవత్సరాలుగా భారతదేశ ఆర్థికాభివృద్ధి, ప్రజల సంక్షేమం, దేశ భద్రతల్లో ఖనిజాల పాత్ర అత్యంత కీలకం. ప్రఖ్యాత తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు, ఆర్థికవేత్త అయిన చాణక్యుడు కూడా తన అర్థశాస్త్రంలో దేశాభివృద్ధిలో ఖనిజాలు, గనుల పాత్ర ఎంత కీలకమో వివరించారు. 2500 ఏళ్ల క్రితం రాజస్థాన్‌లోని జావర్‌లో జింక్ మైనింగ్ జరిగిందని చారిత్రక ఆధారాలున్నాయి. కోహినూర్ వంటి విలువైన వజ్రాలు మన గనుల తవ్వకాల సందర్భంగా బయటపడ్డవే.

భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం ఖనిజ సంపదపై ప్రత్యేకమైన దృష్టి సారించలేదు. కానీ గత పదేళ్లుగా ఈ రంగానికి పునరుత్తేజం కల్పించేందుకు వివిధ చర్యలు చేపట్టాం. గనుల వేలంలో పారదర్శకతను తీసుకువచ్చి 440కు పైగా బ్లాక్స్‌ను వేలం వేశాం. దీని వల్ల దాదాపు రూ.2.7 లక్షల కోట్ల లబ్ధి రాష్ట్రాలకు చేకూరింది. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ ట్రస్ట్ (NMET) ద్వారా రూ.6వేల కోట్లు జమ అయ్యాయి. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (DMF)లో లక్ష కోట్లకు పైగా నిధులు జమ అయ్యాయి. అదే సమయంలో, ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో, కీలకమైన ఖనిజాలు (క్రిటికల్ మినరల్స్) దేశ భద్రతలోనూ కీలకపాత్ర పోషించనున్నాయి. ఈ సందర్భంలో మన స్వాతంత్ర్యానికి వందేళ్లు పూర్తయ్యేనాటికి అంటే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం జరగాలనేది ప్రధానమంత్రి మోదీ ఉక్కు సంకల్పం. ఇందుకోసం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' నినాదంతో అభివృద్ధి, సంక్షేమంతో పాటుగా భద్రమైన దేశ భవిష్యత్తుకు సమ ప్రాధాన్యతనిస్తోంది. క్రిటికల్ మినరల్ రంగంలో ప్రపంచ దేశాలతో పోటీపడుతూ, ఈ రంగంలో దేశ భవిష్యత్తును నిర్దేశించేందుకు 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను (NCMM) ప్రారంభించింది.

వికసిత భారత లక్ష్యాలను చేరుకోవడంలో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ అత్యంత కీలకం. దేశ సుస్థిరాభివృద్ధితో పాటు, రవాణా, వ్యవసాయం, వైద్యం, ఇంధన భద్రత, సాంకేతిక పురోగతి, టెలికమ్యూనికేషన్స్, క్లీన్ ఎనర్జీ, తయారీ రంగంలో అడ్వాన్స్‌మెంట్, రక్షణ తదితర రంగాలకు క్రిటికల్ మినరల్స్ తగినంతగా పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

మరీ ముఖ్యంగా ప్రపంచదేశాలన్నీ క్లీన్ ఎనర్జీ వైపు, ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేస్తున్న తరుణంలో క్రిటికల్ మినరల్స్ ఒక 'న్యూ ఆయిల్' (ప్రత్యామ్నాయం)గా కనబడుతున్నాయి. లిథియం, కోబాల్ట్, నికెల్ వంటివి ఎలక్ట్రిక్ వాహనాల్లో, పునరుత్పాదక విద్యుత్ వ్యవస్థలో, సెమీకండక్టర్స్‌లో కీలకం. అదే ఫాస్ఫేట్, పొటాష్, గ్లకొనైట్ మొదలైనవి వ్యవసాయ రంగానికి అవసరం. టైటానియం, బెరీలియం వంటి ఖనిజాలు వైమానిక రంగం, రక్షణ రంగంలో చాలా కీలకం. ఇలా క్రిటికల్ మినరల్స్.. దేశ భద్రత, ఇంధన భద్రత, ఆహార భద్రత, ఆర్థికాభివృద్ధిలో అత్యంత ప్రముఖమైన పాత్ర పోషించనున్నాయి.



భారతదేశం క్రిటికల్ మినరల్స్ కోసం పెద్ద మొత్తంలో దిగుమతులపై ఆధారపడుతోంది. దీన్ని తగ్గించుకుని, ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు, దేశీయంగా ఉత్పత్తిని పెంచడం, విదేశాల్లో క్రిటికల్ మినరల్స్ గనులను తీసుకుని అక్కడి నుంచి ఉత్పత్తిని పెంచుకోవడం వంటివి చాలా అవసరం. అందుకే 24 క్రిటికల్ మినరల్స్ జాబితాను నిర్దేశించుకుని, దేశీయంగా వెలికితీత, విదేశాల్లోని గనుల నుంచి సేకరణ, రీసైక్లింగ్ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని, వ్యూహాత్మకంగా 'సప్తపది' నినాదంతో మోదీ ప్రభుత్వం ముందుకెళ్తోంది.



భారతదేశం క్రిటికల్ మినరల్స్ కోసం పెద్దమొత్తంలో దిగుమతులపై ఆధారపడుతోంది. దీన్ని తగ్గించుకుని, ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు, దేశీయంగా ఉత్పత్తిని పెంచడం, విదేశాల్లో క్రిటికల్ మినరల్స్ గనులను తీసుకుని అక్కడి నుంచి ఉత్పత్తిని పెంచుకోవడం వంటివి చాలా అవసరం. అందుకే 24 క్రిటికల్ మినరల్స్ జాబితాను నిర్దేశించుకుని, దేశీయంగా వెలికితీత, విదేశాల్లోని గనుల నుంచి సేకరణ, రీసైక్లింగ్ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని, వ్యూహాత్మకంగా 'సప్తపది' నినాదంతో మోదీ ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందులోని పలు అంశాలపై ఇప్పటికే పనిచేస్తున్నప్పటికీ, ఈ వేగాన్ని టాప్ గేర్‌లో ముందుకు తీసుకెళ్లేందుకు ఏడు అంశాలను నిర్దేశించుకుని పని మొదలుపెట్టనుంది.

ఈ సప్తపదిలో మొదటిది– దేశీయంగా క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తిని పెంచడం. దిగుమతులను తగ్గించుకునేందుకు ఇదొక కీలకమైన ప్రక్రియ. భారతదేశంలోనూ గణనీయమైన ఖనిజ సంపద ఉంది. దీన్ని వెలికి తీసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (GSI) ఎక్స్‌ప్లొరేషన్ ప్రయత్నాలను వేగవంతం చేసింది. 2020–21లో GSI చేతిలో 65 ప్రాజెక్టులు మాత్రమే ఉంటే, 2025–26 నాటికి 227 ప్రాజెక్టుల్లో ఎక్స్‌ప్లొరేషన్ పనులు చేపట్టింది. దీంతోపాటుగా NMET ద్వారా ప్రైవేటు ఏజెన్సీలకు కూడా ఐదు విడతల క్రిటికల్ మినరల్స్ గనులను వేలం విషయంలోనూ ఊహించని స్పందన కనిపించింది. 10 రాష్ట్రాల్లోని 23 క్రిటికల్ మినరల్ బ్లాక్స్ కేటాయింపులు పూర్తయ్యాయి. ఇలా దేశీయంగా క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తికి బాటలు పడటం, మన వనరులను వెలికితీయడంతోపాటుగా గ్లోబల్ సప్లయ్ చైన్స్‌పై ఆధారపడాల్సిన అవసరాన్ని తగ్గిస్తాయి.

రెండో కీలకమైన అడుగు– విదేశాల్లోని కీలకమైన ఖనిజాల గనుల్లో నుంచి క్రిటికల్ మినరల్స్‌ను సేకరించడం. భారతదేశంలో లిథియం, నికెల్, కోబాల్ట్ మొదలైన కొన్ని మినరల్స్ లభ్యత తక్కువగా ఉంది. అందుకోసం ఈ ఖనిజాల లభ్యత ఎక్కువగా ఉన్న దేశాలతో ఒప్పందాలు చేసుకుని అక్కడినుంచి వీటిని సేకరించేందుకు 'కాబిల్' (ఖనిజ్ బిదేశ్ ఇండియా లిమిటెడ్) అనే ప్రభుత్వ రంగ సంస్థ 2019లో ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఇప్పటికే అర్జెంటీనాతో పాటుగా వివిధ దేశాలతో ఆ దేశాల్లోని ఖనిజాల సేకరణకు ఒప్పందాలు చేసుకుని ముందడుగు కూడా వేశాం. అర్జెంటీనాలో 15,500 హెక్టార్ల పరిధిలో 5 లిథియం బ్లాక్స్‌లో ఎక్స్‌ప్లొరేషన్ ఒప్పందం జరిగింది. ఇతర దేశాల్లోనూ ఇదే విధంగా క్రిటికల్ మినరల్ బ్లాక్స్‌ను చేజిక్కించుకునేందుకు ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్తున్నాం. ఇందులో ప్రైవేటు సంస్థల సహకారం చాలా కీలకం. అందుకే ఆయా సంస్థలకు కూడా పెద్దపీట వేస్తున్నాం.

మూడోది– క్రిటికల్ మినరల్స్‌ను దేశీయంగా ఉత్పత్తి చేయడమూ, విదేశాల నుంచి సేకరించడమూ ఒక ఎత్తయితే.. వినియోగం పూర్తయిన వాటిని రీసైక్లింగ్ (శుద్ధి చేసిన తర్వాత పునర్వినియోగం) చేయడం మరో కీలకమైన అంశం. రీసైక్లింగ్ పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునే దిశగా చేస్తున్న ప్రయత్నాలను మరో అడుగు ముందుకు తీసుకెళ్లినట్లవుతుంది.

నాలుగోది– క్రిటికల్ మినరల్స్ వినియోగానికి సంబంధించి దేశీయంగా మార్కెట్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం. దీనికి సంబంధించిన పెట్టుబడులను ఆహ్వానిస్తూ పోటీ తత్వాన్ని పెంచేందుకు NCMM దోహదపడుతుంది.

దీంతోపాటుగా క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్, రీసైక్లింగ్‌పై విస్తృతంగా పరిశోధనలు జరపడంతో పాటుగా సాంకేతికత పురోగతి కోసం 2031 నాటికి మూడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటుచేయడం క్రిటికల్ మినరల్ మిషన్‌లో ఐదవది. ఈ మిషన్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో నిపుణత కలిగిన మానవ వనరుల అభివృద్ధి చేస్తాం. ఇంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన నిధుల విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం పూర్తి స్పష్టతతో ఉంది. మొత్తం 16,300 కోట్లను కేంద్ర ప్రభుత్వం వెచ్చించనుంది. ఇది కాకుండా ప్రైవేటు రంగం, ప్రభుత్వ రంగ సంస్థలను భాగస్వాములు చేస్తూ వారి ద్వారా మరో రూ.18 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. ఇది కాకుండా క్రిటికల్ మినరల్స్‌ను తీసుకొచ్చేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి ఫండింగ్, ఫైనాన్సింగ్, ఇన్సెంటివ్స్ (టాక్స్ క్రెడిట్, సాఫ్ట్ లోన్స్ వంటి వాటి ద్వారా క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తికి ప్రోత్సాహం కల్పించడం) వ్యవస్థను కూడా అభివృద్ధి చేస్తాం.

ఇదంతా వచ్చే ఆరేళ్ల కోసం నిర్దేశించుకున్న ప్రణాళిక మాత్రమే. ఆ తర్వాత దీన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తూ 2047 నాటికి 'వికసిత భారత లక్ష్యా'న్ని సాకారం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఆలోచిస్తోంది. వివిధ రంగాల్లో ఆధునికతను తీసుకురావడంతోపాటుగా, భవిష్యత్తులో దేశభద్రతను సునిశ్చితం చేసే ఈ క్రిటికల్ మినరల్స్ విషయంలో కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం అత్యంత కీలకం. ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా, ఆత్మనిర్భరతను చాటుకునేందుకు, భారతదేశ ఆకాంక్షల సాకారానికి క్రిటికల్ మినరల్ మిషన్ ఓ మైలురాయిగా నిలవనుంది.

◆ కిషన్ రెడ్డి
కేంద్ర మంత్రి

మన డేటా ప్రభుత్వం చేతుల్లో క్షేమమేనా?

బ్రిటిష్ గణిత శాస్త్రజ్ఞుడు క్లైవ్ హమ్‌బీ 2006లో "డేటా కొత్త చమురు" (Data is the new oil) అనే ప్రసిద్ధ వ్యాఖ్య చేశారు. ఆ మాట ఇప్పటికీ నిజమే. ఈ డిజిటల్ యుగంలో డేటాకు గల శక్తి, ఆర్థిక విలువ ఏమిటో క్రమంగా అందరికీ అర్థమవుతున్నది. సామాజిక సంక్షేమం, ఆరోగ్యం, బ్యాంకింగ్, వాణిజ్యం, వినోదం తదితర రంగాలలో డేటా కీలక పాత్ర పోషిస్తున్నది. అయితే సేవల పేరుతో ప్రభుత్వాలు, కంపెనీలు ప్రజల అనుమతి లేకుండానే వారి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. పాశ్చాత్య దేశాల్లోలా భారత్‌లో డేటా దుర్వినియోగాన్ని నివారించే బలమైన చట్టాలు లేవు. ఈ లోటును పూడ్చేందుకు, పౌర సమాజం డిమాండ్‌కు తలొగ్గి, కేంద్ర ప్రభుత్వం 2023లో డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ చట్టాన్ని (డీపీడీపీ చట్టం) తీసుకొచ్చింది. ఈ చట్టం 2023 ఆగస్టు 11న పార్లమెంటు ఆమోదం పొందింది.



కొత్తగా అమలులోకి రానున్న డేటా ప్రొటెక్షన్ నియమాలు గోప్యతకు సంబంధించిన సమస్యలను మరింత ఆందోళనకరంగా మారుస్తున్నాయి. అస్పష్టమైన పదజాలం, డేటా ప్రొటెక్షన్ బోర్డుకు స్వతంత్రత లేకపోవడం వంటివి ఇందులో ఉన్నాయి. సరైన సంస్కరణలు లేకుండా అమలులోకి వస్తే ఈ నియమాలు ప్రజల గోప్యతను హరించడంతో పాటు డిజిటల్ గవర్నెన్స్‌పై నమ్మకాన్ని దెబ్బతీయగలవు.

2025 జనవరి 3న సాంకేతిక – సమాచార మంత్రిత్వ శాఖ 'ది డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) రూల్స్ – 2025' పేరుతో నియమావళిని విడుదల చేసింది. ఈ నియమాలపై ప్రజలు తమ అభిప్రాయాలను ఫిబ్రవరి 18 లోపల తెలియజేయవచ్చు. అయితే ఈ డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ నియమాలను చదివినప్పుడు అవి కావాలనే ఉద్దేశపూర్వకంగా అస్పష్టంగా ఉన్నాయి అనిపిస్తుంది. ఇది అనేక అనుమానాలకు దారి తీస్తోంది.

నిజానికి డీపీడీపీ మూల చట్టంలోనే ఈ ఉద్దేశపూర్వక అస్పష్టత కనిపిస్తుంది. అందులో "కేంద్ర ప్రభుత్వం నిర్ణయించవచ్చు" వంటి పదజాలం తరచుగా వాడారు. చట్టంలో ఉన్న ఈ అస్పష్టత నియమావళి రూపొందాక తొలగుతుందని ఆశిస్తే– ఇప్పుడు అలా జరగలేదు.

డీపీడీపీ నియమాలు ముఖ్యమైన విధాన నిర్ణయాలను పార్లమెంట్ నుంచి ప్రభుత్వానికి బదిలీ చేస్తాయి. వేగంగా మారుతున్న డిజిటల్ ప్రపంచంలో ఈ సౌలభ్యం అవసరమని ప్రభుత్వం సమర్థించుకుంటున్నది. కేసు వారీగా నిర్ణయాలను తీసుకోవడానికి ఇది అనుకూలమని చెబుతోంది. డీపీడీపీ చట్టంలోని సెక్షన్ 36, రూల్ 22తో అనుసంధానించి చదివితే ఈ నియమం తాలూకు సౌలభ్యం స్పష్టంగా కనిపిస్తుంది. దీని ప్రకారం ప్రభుత్వం సందర్భాన్ని అనుసరించి వేర్వేరు విధాలుగా నియమాలను అమలు చేయవచ్చు. కానీ దీనివల్ల సమానత్వ భావనకు విఘాతం కలగడమే గాక, ఇది అన్యాయమైన వ్యవహారాలకు దారితీసే అవకాశాలు కూడా ఉన్నాయి.

డీపీడీపీ చట్టాన్ని అనుసరించి– కేంద్ర ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత డేటాను సేకరించగల అధికారాన్ని పొందింది. సెక్షన్ 36, రూల్ 22 ప్రకారం ప్రభుత్వం 'జాతీయ భద్రత', 'దేశ సమగ్రత', 'ప్రజా ప్రయోజనాలు' వంటి కారణాలను చూపి ప్రజల సమాచారాన్ని సేకరించవచ్చు. సరిగా నిర్వచించకుండా 'జాతీయ భద్రత' వంటి పదాలను ఉపయోగించడం వల్ల, ఈ నిబంధనను సాకుగా చూపి పౌరుల అనుమతి లేకుండానే వారి వ్యక్తిగత డేటా సేకరణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగలదు. పైగా ఇలా సేకరించమని ఇచ్చే ఆదేశాలను గోప్యంగా ఉంచే హక్కు కూడా ప్రభుత్వానికి ఉంది. దీని వల్ల పౌరులకు తమ డేటా ఎలా వాడబడుతుందో తెలిసే అవకాశం ఉండదు. ఈ సూత్రం ప్రజల గోప్యతపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. ఎందుకంటే ప్రభుత్వం పెద్ద మొత్తంలో డేటాను సేకరిస్తూ, సామూహిక నిఘా కార్యక్రమాలను అమలు చేయగలదు. ఈ నిబంధనల కారణంగా సంక్షేమ పథకాల అమలులో కూడా పౌరుల డేటా సేకరణ తప్పనిసరి అవుతోంది. ఇది పౌరుల వ్యక్తిగత గోప్యత హక్కులపై ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఇలా గోప్యతను ఉల్లంఘించే నిబంధనలు సుప్రీం కోర్టు గతంలో వెలువరించిన కె.ఎస్. పుట్టస్వామి తీర్పు (2018) స్ఫూర్తికి విరుద్ధం.

డీపీడీపీ చట్టం, నియమాల ప్రకారం చట్ట ఉల్లంఘనలపై ప్రజల ఫిర్యాదులను పరిష్కరించేందుకు, డేటా రక్షణను పర్యవేక్షించేందుకు 'డేటా ప్రొటెక్షన్ బోర్డు' ఏర్పాటు చెయ్యాలి. అయితే, బోర్డు సభ్యుల నియామక ప్రక్రియలో స్వతంత్ర పర్యవేక్షణ యంత్రాగం ఏదీ లేదు. ఈ నియామక ప్రక్రియ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ అధికారుల ఆధీనంలో ఉంటుంది. అలాగే బోర్డు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ 'ఎలక్ట్రానిక్స్ – ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ' ఆధీనంలో పనిచేయడం కూడా బోర్డు స్వతంత్రతపై సందేహాన్ని రేకెత్తిస్తుంది. దీనివల్ల బోర్డు నిర్ణయాలు ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే అవకాశాలు ఎక్కువ. అంతేగాక, డేటా ప్రొటెక్షన్ బోర్డుకు ప్రత్యేకంగా ఒక ఆఫీసు లేకుండా పని చేస్తుంది. ఫిర్యాదులు కేవలం ఆన్లైన్ ద్వారా చేయాలి. ఈ కారణంగా అట్టడుగు వర్గాల ప్రజలకు ఇది అందుబాటులో ఉండదు.

డీపీడీపీ నియమాలపై ప్రస్తుతం ప్రజల అభిప్రాయాలను కోరుతూ చేపట్టిన సంప్రదింపు ప్రక్రియ కూడా పారదర్శకత విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్నది. ఈ నియమాలను కేవలం ఇంగ్లీష్, హిందీలో అందుబాటులో ఉంచారు. అంతేగాక, అభిప్రాయాలను సమర్పించాలంటే ఒక ప్రభుత్వ పోర్టల్‌లో ఖాతా నమోదు చేసుకోవాలి. పైగా, ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను 'గోప్య సమాచారం'గా వర్గీకరించడం వల్ల వాటి గురించి తెలుసుకునే అవకాశం లేకపోయింది. వ్యతిరేక అభిప్రాయాలపై చర్చకు అవకాశమే లేకుండా పోయింది. ఇటువంటి వ్యవహారం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తుంది, పౌరుల నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తుంది.

డేటా లోకలైజేషన్ నిబంధనలలోనూ స్పష్టత లేదు. సేకరించిన ప్రజల డేటాను పూర్తిగా దేశంలోనే నిల్వ చేయాలా? లేక విదేశాలకు బదిలీ చేయొచ్చా? ఒకవేళ చేయొచ్చు అంటే ఏ మేరకు, ఏ అంశాలలో చేయవచ్చు? అనే విషయాలపై స్పష్టత లేదు. ఫలితంగా గూగుల్, ఫేస్బుక్ వంటి పెద్ద డేటా కంపెనీలు తీవ్ర ప్రతిఘటనలను ఎదుర్కొనే అవకాశం ఉంది.

ప్రభుత్వాలకు, పౌరులకు డేటా అత్యంత కీలకం. ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే విధానపరమైన నిర్ణయాలకు సహాయపడుతుంది. అంతేగాక, ప్రభుత్వం తీసుకున్న చర్యల పురోగతిని అంచనా వేయడంలోనూ, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలోనూ డేటా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కానీ ప్రస్తుత డేటా ప్రొటెక్షన్ నియమాలు ప్రజలకు సంబంధించిన డేటాపై కేంద్ర ప్రభుత్వానికి అవాంఛనీయమైన పెత్తనాన్ని కట్టబెడతాయని, ప్రజలకు మాత్రం వ్యక్తిగత డేటా రక్షణ పేరుతో సమాచారాన్ని అందకుండా చేస్తాయని ఆందోళన వ్యక్తమవుతున్నది.

స్థూలంగా చెప్పాలంటే డీపీడీపీ నియమాలు డేటా గోప్యతకు సంబంధించి ఉన్న సమస్యలను మరింత ఆందోళనకరంగా మారుస్తున్నాయి. అస్పష్టమైన పదజాలం, డేటా ప్రొటెక్షన్ బోర్డుకు స్వతంత్రత లేకపోవడం వంటి ఆందోళనకరమైన అంశాలు ఇందులో ఉన్నాయి. సరైన సంస్కరణలు లేకుండా అమలులోకి వస్తే ఈ నియమాలు ప్రజల గోప్యతను హరించడంతో పాటు డిజిటల్ గవర్నెన్స్‌పై నమ్మకాన్ని దెబ్బతీయగలవు. కాబట్టి డేటా ప్రొటెక్షన్ చట్టం ప్రజల గోప్యతను కాపాడగలదని, సార్వజనిక ప్రయోజనానికి దారి తీయగలదని నమ్మకాన్ని కల్పించాలి. డేటా ప్రొటెక్షన్ బోర్డు స్వతంత్ర ప్రతిపత్తిని నిర్ధారించే మార్పులు అవసరం. అలాగే, అన్ని భాషల్లో నియమాలను అందుబాటులోకి తెచ్చి విస్తృత చర్చలు నిర్వహించాలి. అలాగే సామాజిక తనిఖీలకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి.

● చక్రధర్ బుద్ధ
సీనియర్ పరిశోధకులు, లిబ్‌టెక్ ఇండియా

కాసుల గలగలలే వృద్ధికి ఉద్దీపన

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ శనివారం 2025–26 ఆర్థిక సంవత్సరానికి కొత్త బడ్జెట్ పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. గత కొన్నేళ్లుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ ఏదో ఒక రకమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ మన ఆర్థిక వ్యవస్థ మాత్రం స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోంది. ఈ వృద్ధిని నిలబెట్టుకుంటూ దాని ఫలాలు అందరికీ అందేలా చేయడం ఆర్థికమంత్రికి కత్తిమీద సాముగానే భావించాలి. గత కొన్నేళ్లుగా ఉన్న సానుకూలతలు కొంతమేరకు క్షీణించి ప్రతికూలతలు పెరిగిన నేపథ్యంలో ఈ ఏడాది బడ్జెట్ ఎలా ఉండబోతోంది అన్న ఉత్కంఠ ప్రతీ ఒక్కరిలోనూ ఉంది. ప్రస్తుత వాతావరణంలో బడ్జెట్ రూపకల్పన విషయంలో ఆర్థికమంత్రి ముందు సానుకూలతలెంతగా ఉన్నాయో సవాళ్లు కూడా అంతగానే ఉన్నాయి.

ప్రపంచంలోని ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోల్చితే మన దేశంలో వృద్ధిరేటు ప్రోత్సాహకరంగా ఉండడం తొలి సానుకూలాంశం. ప్రస్తుత ప్రతికూలతల కారణంగా ఈ ఏడాది ఆశించిన స్థాయిలో 7 శాతం వృద్ధిరేటు సాధించడం కొంచెం కష్టంగానే కనిపిస్తున్నప్పటికీ 6.5 శాతం వృద్ధి నమోదవుతుందని ఖాయంగానే చెప్పవచ్చు. రుతుపవనాలు సానుకూలంగా ఉన్నందువల్ల గ్రామీణ వినియోగం పెరిగింది. సేవల రంగం కూడా మంచి వృద్ధిని కొనసాగిస్తోంది. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్ వంటి అధిక విలువ గల వస్తువుల ఎగుమతులు కూడా ప్రోత్సాహకరంగానే ఉన్నాయి. సీజన్లవారీగా ఏర్పడే పరిణామాల్లో భాగంగా ఆహార వస్తువుల ధరలు అధికంగానే ఉన్నప్పటికీ సాధారణ ద్రవ్యోల్బణం మాత్రం ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన 4 శాతం పరిధికి సమీపంలోనే ఉంది. దేశంలో పొదుపు రేటు 30 శాతంగా ఉంది. జీడీపీలో రుణాల నిష్పత్తి కూడా అదుపులోనే ఉంది. పన్ను వసూళ్లు కూడా అత్యంత సానుకూలంగా ఉన్నాయి. నవంబరు నాటికే బడ్జెట్‌లో నిర్దేశించిన లక్ష్యంలో 60 శాతం మేరకు పన్ను వసూళ్లుండడం ఆదాయపు పన్ను, జీఎస్‌టీల్లో మంచి వృద్ధి నమోదవుతోందనేందుకు సంకేతం. ప్రజల్లో కూడా నిజాయతీగా పన్నులు చెల్లించే వైఖరి పెరిగింది. అందుకే గత రెండు మూడేళ్లుగా బడ్జెట్ లక్ష్యాన్ని మించి పన్నులు వసూలవుతున్నాయి.

సమాంతరంగా ఆర్థికమంత్రి ముందు కొన్ని పెను సవాళ్లు కూడా ఉన్నాయి. అధిక విలువ గల వస్తువుల ఎగుమతులు పెరిగినా, స్థూల ఎగుమతులు మాత్రం గణనీయంగా తగ్గాయి. ఫలితంగా దేశంలో పారిశ్రామికోత్పత్తి తగ్గింది. ప్రపంచ దేశాల్లో డిమాండు తగ్గడంతో గత ఏడాది 3.0 శాతం ఉన్న ఎగుమతుల వృద్ధిరేటు ఈ ఏడాది 2.8 శాతానికి క్షీణించింది. వారం రోజుల క్రితం గద్దెనెక్కిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆత్మరక్షణ చర్యలకు దిగుతున్నారు. తమ దేశంతో వాణిజ్య మిగులు ఉన్న దేశాల నుంచి దిగుమతులు అదుపు చేయడానికి ఆయన సిద్ధమవుతున్నారు. ఆ జాబితాలో చైనాతో పాటు మన దేశం కూడా ఉంది. ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దుతామని మన దేశం హామీ ఇచ్చినందువల్ల అందుకు అనుగుణంగా జరిగే సర్దుబాట్లలో అమెరికాకు ఎగుమతులు తగ్గవచ్చు. చైనా దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించినట్టయితే ఆ వస్తువులన్నింటినీ మన దేశంలో డంప్ చేయడానికి చైనా ప్రయత్నించవచ్చు. ఈ కారణంగా ఒక పక్క అమెరికాతో వాణిజ్య బంధాన్ని దృష్టిలో ఉంచుకుని సుంకాల్లో సర్దుబాటు చేసుకుంటూనే, చైనా డంపింగ్‌ను అడ్డుకునేందుకు కూడా చర్యలు చేపట్టాలి. ఇతర ప్రతికూలతల విషయానికి వస్తే బ్యాంకింగ్ రంగంలో డిపాజిట్, రుణ వృద్ధిరేటు తగ్గింది. ఈక్విటీల్లో విదేశీ పెట్టుబడులు నిరంతరం తరలిపోతూ ఉండడం వల్ల స్టాక్‌మార్కెట్ తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. ప్రభుత్వ పెట్టుబడులు కూడా గతంతో పోల్చితే తగ్గాయి. 2023–24 సంవత్సరంలో రూ.10 లక్షల కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే 7–8 లక్షల కోట్లు మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేయగలిగింది. అలాగే 2024–25 సంవత్సరంలో రూ.11 లక్షల కోట్లు లక్ష్యం అయితే చివరి లెక్క ఎంత తేలుతుందో వేచి చూడాలి. స్థూల దేశీయ పెట్టుబడుల (జీసీఎఫ్) వృద్ధిరేటు కూడా గణనీయంగా తగ్గింది. ఉదాహరణకి 8 శాతం వృద్ధిరేటు రావాలంటే జీసీఎఫ్ 40 నుంచి 50 శాతం ఉండాలి. గత ఏడాది జీసీఎఫ్ వృద్ధిరేటు 49 శాతం ఉంటే ఈ ఏడాది ఇప్పటివరకు 5.4 శాతం మాత్రమే ఉంది. నగరజీవులపై ద్రవ్యోల్బణ ప్రభావం, పన్ను భారం కారణంగా వారు చేసే వ్యయాలు గణనీయంగా తగ్గాయి.

ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఆర్థిక మంత్రి కొత్త బడ్జెట్‌లో పట్టణ వినియోగాన్ని పెంచడంపై ప్రప్రథమంగా దృష్టి సారించవచ్చు. ఎగుమతులు తగ్గిన నేపథ్యంలో దేశీయ వినియోగాన్ని పెంచడం అత్యంత అవసరం. వినియోగం పెరగాలంటే ప్రజల చేతిలో ఖర్చు చేయడానికి అవసరమైన వనరులు పుష్కలంగా ఉండాలి. ఇందుకోసం సగటు మనిషికి కొంత ఊరట కల్పించే చర్యలకు ఆర్థికమంత్రి పెద్దపీట వేయవచ్చు. ఇందులో భాగంగా ఆదాయపు పన్ను (ఐటీ) శ్లాబ్‌లలో కొన్ని సర్దుబాట్లు చేసే ఆస్కారం ఉంది. ప్రస్తుతం ఉన్న శ్లాబ్‌లకు అదనంగా మరో శ్లాబ్ పెట్టే ఆస్కారం ఉన్నదని వినిపిస్తోంది. ప్రస్తుతం 20 లక్షలు దాటితే తదుపరి శ్లాబ్ 30 లక్షలుగా ఉంది. ఈ రెండింటికీ మధ్య 25 శాతం శ్లాబ్ ఒకటి ప్రవేశపెట్టవచ్చు. దీనికి తోడు స్టాండర్డ్ డిడక్షన్స్ కూడా పెంచవచ్చు. అలాగే అన్ని రకాల బీమా పాలసీలపై మినహాయింపు పరిమితులు పెంచాలని దీర్ఘకాలికంగా డిమాండు చేస్తున్నారు. ఈ బడ్జెట్‌లో ఇందుకు కూడా చర్యలు తీసుకునే ఆస్కారం ఉంది. అలాగే బీమాపై జీఎస్‌టీ రేటు తగ్గించాలనే డిమాండు కొన్నేళ్లుగా వస్తోంది. దీనికి కేంద్రం సానుకూలంగానే ఉన్నా రాష్ట్రాల నుంచి వస్తున్న వ్యతిరేకతల కారణంగా ఈ ప్రతిపాదన జీఎస్‌టీ కౌన్సిల్ వరకు వెళ్లి వాపసు వస్తోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో దానిపై ఒక విధాన నిర్ణయం ప్రకటించవచ్చు. ఈ చర్యలతో ప్రజల చేతిలో ఖర్చు చేయదగిన నగదు నిల్వ పెరుగుతుంది.

ఆర్థిక మంత్రి కొత్త బడ్జెట్‌లో పట్టణ వినియోగాన్ని పెంచడంపై ప్రప్రథమంగా దృష్టి సారించవచ్చు. ఎగుమతులు తగ్గిన నేపథ్యంలో దేశీయ వినియోగాన్ని పెంచడం అత్యంత అవసరం. వినియోగం పెరగాలంటే ప్రజల చేతిలో ఖర్చు చేయడానికి అవసరమైన వనరులు పుష్కలంగా ఉండాలి. ఇందుకోసం సగటు మనిషికి కొంత ఊరట కల్పించే చర్యలకు ఆర్థికమంత్రి పెద్దపీట వేయవచ్చు. దీంతో పాటు దేశీయ ఉత్పత్తి, డిమాండ్‌ను ఉద్దీపింపచేయడం, పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహకాలందించడం వంటి అంశాలపై ఎక్కువగా దృష్టి సారించే ఆస్కారం ఉంది.



అలాగే ప్రస్తుతం ఈక్విటీ మార్కెట్లలో ఆటుపోట్లను దీటుగా ఎదుర్కొనే లక్ష్యంతో ఈక్విటీ మార్కెట్ పెట్టుబడులపై దీర్ఘకాలిక లాభాల పన్ను (ఎల్‌టీసీజీ), సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) తగ్గించవచ్చు. కొవిడ్ అనంతర కాలంలో దేశీయంగా రిటైల్ ఇన్వెస్టర్ల సంఖ్య పెరిగింది. విదేశీ పెట్టుబడులు తరలిపోతున్నప్పటికీ మార్కెట్ నిలదొక్కుకోవడానికి ఇది సహాయకారి అయింది. అందువల్ల వీరిని ప్రోత్సహించే చర్యలు బడ్జెట్‌లో తీసుకోవడం తప్పనిసరి. నానాటికీ తీసికట్టుగా ఉన్న రూపాయి విలువను కాపాడేందుకు మరిన్ని ఎగుమతి ప్రోత్సాహకాలు కూడా కల్పించవచ్చు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం మౌలిక వసతులపై పెట్టుబడులు పెంచుతూ వస్తోంది. ఇదే వరుసలో ఈసారి కూడా మౌలిక వసతులపై పెట్టుబడులు పెంచవచ్చు. దేశంలో పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో పట్టణ మౌలిక వసతులకు ఈ ఏడాది ప్రాధాన్యం ఇవ్వవచ్చు. పారిశ్రామికోత్పత్తిని పెంచడం లక్ష్యంగా కొత్తగా ఉత్పత్తి ప్రారంభించే కంపెనీలకు ఆదాయపు పన్ను ప్రోత్సాహకాలు తిరిగి ప్రవేశపెట్టే ఆస్కారం ఉంది. గతంలో ఇలాంటి కంపెనీలకు 80(ఐ), 80(జె) వంటి సెక్షన్ల కింద ప్రోత్సాహకాలిచ్చేవారు. దేశీయంగా వస్తూత్పత్తిని పెంచి పారిశ్రామిక రంగాన్ని ఉత్తేజితం చేసే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల పథకం (పీఎల్ఐ) 14 రంగాలకు వర్తిస్తోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో మరిన్ని రంగాలకు పీఎల్ఐని విస్తరించవచ్చు. పీఎల్ఐ అమలు గడువును కూడా పెంచవచ్చు.

శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించి విలువైన విదేశీమారక ద్రవ్యం ఆదా చేసే లక్ష్యంతో గత కొన్నేళ్లుగా విద్యుత్ వాహనాలు, సోలార్ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇందుకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించే ఆస్కారం ఉంది. ద్విచక్ర వాహనాల్లో ఇథనాల్ మిశ్రమ ఇంధనం వినియోగించేందుకు కూడా ప్రోత్సాహకాలు ప్రకటించవచ్చు. ఇందుకోసం ద్విచక్ర వాహనాల ఇంజన్‌లో మార్పులు చేయాల్సి ఉంటుంది. ఇలా ఇంజన్‌లో మార్పులు చేసే కంపెనీలకు ప్రోత్సాహకాలందించే ప్రకటన బడ్జెట్‌లో ఉండవచ్చు. అంతే కాదు, వివిధ వస్తువులపై కస్టమ్స్ సుంకాలు ఎలా ఉన్నాయి అన్నది సమీక్షించి బడ్జెట్‌లో వాటిని హేతుబద్ధం చేయవచ్చు.

ప్రస్తుతం ఏఐ (కృత్రిమ మేధ) అనేది అందరి నోళ్లలో నానుతున్న పదం. ఏఐ ఆధారిత హెల్త్‌కేర్, భిన్న రంగాల్లో ఏఐ వినియోగం వంటివి ప్రోత్సహించడం కోసం ఏఐ ఆధారిత పెట్టుబడులపై ప్రోత్సాహకాలు కల్పించే విధానం కూడా బడ్జెట్‌లో ప్రకటించవచ్చు. భారతీయ రైల్వేలు, లాజిస్టిక్స్ వంటి విభాగాలపై కూడా పెట్టుబడులు పెంచే ఆస్కారం ఉంది. లాజిస్టిక్స్ రంగంలో మన దేశ పోటీ సామర్థ్యం పెంచడం అత్యంత అవసరం. అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న మరో కీలక రంగం రియల్ ఎస్టేట్. ఈ రంగంలో కొద్దికాలంగా స్తబ్దత ఆవరించి ఉంది. ఇటీవల కాలంలో మధ్యతరగతి ఇళ్లకు డిమాండు గణనీయంగా పెరిగింది. ఇప్పుడిప్పుడే లగ్జరీ ఇళ్ల కొనుగోళ్లు కూడా వేగం అందుకుంటున్నాయి. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని రియల్టీ రంగానికి కూడా కొన్ని ప్రోత్సాహకాలు ప్రకటించవచ్చు. గత మూడు, నాలుగు సంవత్సరాల బడ్జెట్లు చూసినట్టయితే వ్యవసాయం, డ్రోన్ల వినియోగం, పంటల అనంతర నష్టాల అదుపు వంటి వాటిపై అధికంగా విధాన నిర్ణయాలు ప్రకటిస్తున్నారన్న విషయం అర్థమవుతుంది. అలాగే సహకార రంగాన్ని కూడా ప్రోత్సహించే చర్యలుండవచ్చు. మొత్తం మీద కొత్త బడ్జెట్‌లో ప్రభుత్వం సగటు జీవికి ఊరట కల్పించే చర్యలతో పాటు దేశీయ ఉత్పత్తి, డిమాండ్‌ను ఉద్దీపింపచేయడం, పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహకాలందించడం వంటి అంశాలపై ఎక్కువగా దృష్టి సారించే ఆస్కారం ఉంది.



■ కె. నరసింహమూర్తి
ఆర్థికవేత్త, బ్యాంకింగ్ నిపుణుడు





మోగిన టీచర్ ఎమ్మెల్సీ నగారా..

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక

- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్.. 27న పోలింగ్.. మార్చి 3న లెక్కింపు..
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10,960 మంది ఓటర్లు, 76 పోలింగ్ కేంద్రాలు
- బీజేపీతో పాటు అభ్యర్థులను ప్రకటించిన ఉపాధ్యాయ సంఘాలు
- పోటీనా..? మద్దతా..? తేల్చుకోలేకపోతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు
- ఎన్నికల కోడ్‌తో మూడు ఉమ్మడి జిల్లాల్లో అభివృద్ధి పనులకు బ్రేక్

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ఇలా..

- ఫిబ్రవరి 3వ తేదీ - నోటిఫికేషన్
- ఫిబ్రవరి 10వ తేదీ - నామినేషన్లకు చివరి రోజు
- ఫిబ్రవరి 11వ తేదీ - నామినేషన్ల పరిశీలన
- ఫిబ్రవరి 13వ తేదీ - నామినేషన్ల విత్‌డ్రా
- ఫిబ్రవరి 27వ తేదీ - పోలింగ్ (ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు)
- మార్చి 3వ తేదీ - ఎన్నికల ఓట్ల లెక్కింపు
- మార్చి 8వ తేదీ - ఎన్నికల ప్రక్రియ పూర్తి

7

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి స్థానానికి ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఫిబ్రవరి 27వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో ఉపాధ్యాయ వర్గాల్లో సందడి నెలకొంది. ఇప్పటికే ఎమ్మెల్సీ స్థానానికి పలువురు పోటీలో నిల్చున్నారు. ప్రధానంగా బీజేపీ అభ్యర్థిని బరిలో నిలపగా, అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఇంకా ఖరారు చేయలేదు. అభ్యర్థిని నిలపాలా..? లేక ఎవరికైనా మద్దతు తెలపాలా..? అనే సందిగ్ధంలో ఉంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కూడా తమ అభ్యర్థి విషయంలో ఏం నిర్ణయం తీసుకోలేదు. ఈ ఎన్నికల్లో దూరంగా ఉండాలని భావిస్తున్నట్లు సమాచారం. కాగా, రాష్ట్రంలో సుమారు 55కు పైగా ఉపాధ్యాయ సంఘాలు ఉన్నప్పటికీ ప్రధానంగా టీజీయూటీఎఫ్, పీఆర్‌టీయూ, తపస్ మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. టీజీయూటీఎఫ్ సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని బరిలో దించుతుండగా, పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి బరిలో దిగుతున్నారు. తపస్ మద్దతుతో బీజేపీ నుంచి మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తంరెడ్డి పోటీకి దిగుతున్నారు. ఇంకా.. పలువురు స్వతంత్రులుగా పోటీలో దిగుతుండగా.. ఎమ్మెల్సీ ఎన్నికలు ఉత్కంఠగా మారనున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



ఏకశిలాపార్కు నుంచి హరితహోటల్ వరకు ర్యాలీగా వస్తున్న సీపీఐ శ్రేణులు

కమ్యూనిస్టులకు అంతం లేదు..

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి
- ఘనంగా సీపీఐ వందేళ్ల వార్షికోత్సవాలు

న్యూశాయంపేట, జనవరి29 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కమ్యూనిస్టులను అంతం చేయాలనే ఆలోచనలో ఉందని, ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టులకు అంతం లేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐ వందేళ్ల వార్షికోత్సవం సందర్భంగా బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలాపార్కు నుంచి నక్కలగుట్టలోని హరితకాకతీయ హోటల్ వరకు సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం హరితకాకతీయ హోటల్‌లో పార్టీ వందేళ్ల వార్షికోత్సవ సభ సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగింది. చాడా వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం నక్సలైట్ల పేరుతో ఎన్‌కౌంటర్లు చేస్తూ కమ్యూనిస్టులను అంతం చేయాలని చూస్తోందని ఆరోపించారు. నక్సలైట్లను చంపడం దుర్మార్గమైన చర్య అని, ఇప్పటికైనా ఎన్‌కౌంటర్లను ఆపాలన్నారు. మతతత్వ రాజకీయాలతో ప్రజలను రెచ్చగొడితే సహించేది లేదన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూనే ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలని, పేదల కాలనీలలో మౌలిక వసతులు, రోడ్లు, కరెంట్, మంచినీళ్లు వచ్చేంత వరకు పోరాట స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. పేదలకు పట్టాలు ఇచ్చేంత వరకు ఎర్రజెండా పేదలకు అండగా ఉంటుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, అందువల్లనే ప్రజలు మార్పుకోరుకుని కాంగ్రెస్ పార్టీని గద్దెనెక్కించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, లేదంటే పోరాటాలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీపీఐ జిల్లా నాయకులు కరుణాకర్, శ్రీనివాస్, రమేష్, ఓదెలు, లింగారెడ్డి, ఎల్లేష్, రాజిరెడ్డి, రాజుగౌడ్, దీనా, సారంగపాణి, వెంకటరమణ, నేదునూరి రాజమౌళితోపాటు పెద్ద సంఖ్యలో సీపీఐ శ్రేణులు పాల్గొన్నారు.

గందరగోళం మధ్య బల్దియా కౌన్సిల్ సమావేశం

- రూ.65కోట్లకు 15వ ఆర్థిక సంఘం నిధులకు ఆమోదం
- ప్రతిపక్షాలకు అవకాశం కల్పించలేదని నిరసన
- టౌన్‌ప్లానింగ్ సీపీపై ఎమ్మెల్సీ బస్వరాజు ఫైర్
- విలీన గ్రామాలకు ఆత్మీయ భరోసా కల్పించాలని వినతి
- కౌన్సిల్ జరుగుతుండగానే కూసిన ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్
- అర్ధాంతరంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

6



బల్దియా కౌన్సిల్ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు

నిరసనలు.. నిలదీతలు..



కౌన్సిల్ సమావేశంలో మేయర్ గుండు సుధారాణి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య

వేగం కన్నా.. ప్రాణం మిన్న..

- ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలి..
- హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జనవరి29(ఆంధ్రజ్యోతి): వేగం కన్నా.. ప్రాణం మిన్న.. అనే విషయాన్ని ప్రతీ పౌరుడు గుర్తుంచుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ వలంటీర్లకు, స్వయం సహాయక సంఘాలకు జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. చిన్న చిన్న తప్పిదాల కారణంగా యేటా ఎన్నో కుటుంబాలు రోడ్డు ప్రమాదాల కారణంగా విలువైన ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. పట్టణ ప్రాంతంతో పాటు గ్రామీణ ప్రజలలో ట్రాఫిక్ నిబంధనల అవగాహన లోపం వలన తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాలలో యువతతో పాటు స్వచ్ఛంద సంస్థలు, మహిళా స్వయం సహాయక సంఘాలు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపొద్దన్నారు. ఈ సమావేశంలో నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్, ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, జిల్లా ట్రెజరీ అధికారి శ్రీనివాస్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఏర్పాటైన పాలకవర్గం

- ఏనుమాముల మార్కెట్‌కు కమిటీ నియామకం
- చైర్‌పర్సన్‌గా ఎర్ర ప్రియాంక, వైస్ చైర్మన్‌గా బండి జనార్దన్
- కోడ్‌తో ప్రమాణ స్వీకారం జరిగేనా?

7



చైర్‌పర్సన్‌గా నియమితులైన ఎర్ర ప్రియాంక



వైస్ చైర్మన్‌గా నియమితులైన బండి జనార్దన్

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

విద్యాసంస్థల సమీపంలో షాపులు ఉండొద్దు : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు గురి కాకుండా చూడాలన్నారు. విద్యా సంస్థల సమీపంలో 100 మీటర్ల మేరకు ఎలాంటి కిరాణ షాపులు ఉండకూడదనే నిబంధనను అమలు చేయాలన్నారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తరుచూ పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లను టీములుగా ఏర్పాటు చేసి కాలేజీ విద్యార్థుల ప్రవర్తనను పసిగడుతూ ఏదైనా అనుమానం వచ్చినట్లయితే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ రవీందర్, ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద



లబ్ధిదారులకు 'అభయం'

- అభయ హస్తం పథకం డబ్బులు ఇప్పించేందుకు సర్కారు ఆలోచన
- వడ్డీతో డబ్బులు కలిపి చెల్లించే యోచన
- ఈ నెలాఖరులోగా ఖాతాలో జమకు అవకాశం
- 1.92 లక్షల మందికి రావాల్సిన మొత్తం రూ.79.50 కోట్లు

7

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్

వరంగల్ మెడికల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ ఆదేశించారు. బుధవారం ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించేందుకు ఆయన వరంగల్‌కు విచ్చేశారు. ముందుగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద పూలమొక్కతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్‌తో కలిసి వికాస్‌రాజ్ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2011లో చేపట్టిన భవన నిర్మాణ పనులు ప్రస్తుత దశ, ఇంకా ఎలాంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. 56 ఎకరాల్లో 24 అంతస్తులతో నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజేశ్వర్‌రావు, సీఈ నాగేంద్రనాథ్, డీఈ జితేందర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలిస్తున్న వికాస్‌రాజ్, కలెక్టర్ సత్యశారద

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి.. అందుకు సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం.. అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస పీపుల్స్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌లో బుధవారం 'సుస్థిర వ్యాపారం - మహిళా వికాసం' అనే అంశంపై మూడు వేలమందితో రాష్ట్ర స్థాయి మహాసభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. మహిళలు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. పురుషులతో సమానంగా వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అంతకుముందు ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. మహిళా అభివృద్ధికి పూర్తిస్థాయి తోడ్పాటు అందిస్తున్న బాల వికాస సంస్థ అభినందనీయం అన్నారు. మహిళలు ఆర్థికంగానే కాకుండా ఆరోగ్యంగా కూడా అభివృద్ధి చెందినప్పుడు సంపూర్ణ అభివృద్ధి జరుగుతుం దన్నారు. అనంతరం బాలవికాస వ్యవస్థాపకురాలు బాల థెరిస్సా జింగ్రాస్ మహిళా సాధికారతపై ఆన్‌లైన్‌లో సందేశాన్ని అందించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి, అడిషినల్ డీఆర్‌డీఏ సుధీర్, డీపీఎం అనిల్, రజితలు మహిళా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జనవికాస అధ్యక్షులు లూర్దు మర్రెడ్డి, బోర్డు మెంబర్‌లు హరీష్, డైరెక్టర్ రాహుల్, సునితారెడ్డి తోపాటు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

నిరసనలు.. నిలదీతలు..

- గందరగోళం మధ్య బల్దియా కౌన్సిల్ సమావేశం
- రూ.65కోట్లకు 15వ ఆర్థిక సంఘం నిధులకు ఆమోదం
- కౌన్సిల్ జరుగుతుండగానే కూసిన ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్
- అర్ధాంతరంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్‌హాల్ ఎదుట సరదా సంభాషణలో ఎంపీ, ఎమ్మెల్యేలు మేయర్ తదితరులు



సభలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర అభివృద్ధిపై 15వ ఆర్థిక సంఘం మిగులు నిధుల నుంచి నీటి సరఫరా, పారిశుధ్యం, దోమల నివారణతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టడానికి బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. ఉదయం 11 గంటలకు బల్దియా సమావేశం ప్రారంభంకాగా, కార్పొరేటర్లు 11.30 కౌన్సిల్ హాల్‌లోకి చేరుకున్నారు. రాష్ట్ర దేవాదాయ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మేయర్ గుండు సుధారాణి కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ముందుగా ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా వరంగల్ ఎంపీ కడియం కావ్యతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎజెండా అంశాలను మేయర్ గుండు సుధారాణి కూలంకశంగా వెల్లడించారు. అయితే ఎజెండా అంశాలు చదువుతుండగానే బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు నిరసనలు తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో బల్దియా కౌన్సిల్‌హాల్‌లో కొంత సేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. మేయర్ గుండు సుధారాణి మేయర్ సీట్లో కూర్చుని 15వ ఆర్థిక సంఘం నిధులకు రూ.65.80కోట్లకు ప్రతిపాదించగా సభ్యులు ఆమోదం తెలిపారు.

కొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు వారి వారి డివిజన్‌లలో నెలకొన్న సమస్యలు, డివిజన్‌ల అభివృద్ధిపై ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని చెప్పుకునేందుకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కార్యక్రమానికి ముందు మాజీ ప్రధానమంత్రి మన్‌మోహన్‌సింగ్‌కు నివాళులర్పించాలనే కనీస మర్యాద కూడా లేదని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి గుర్తు చేశారు. అప్పుడు అందరూ లేచి నివాళులు అర్పించారు. బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లకు మాట్లాడే హక్కే కాకుండా కనీస మర్యాద ఇవ్వడం లేదని మడిపడ్డారు. ప్రతిపక్షాలకు మాట్లాడే హక్కు ఎందుకు ఇవ్వడం లేదని బీఆర్ఎస్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు మండిపడ్డారు. ఎన్ఐటీ నుంచి కాళోజీ జంక్షన్ వరకు ఇటికాల మధుసూదన్ రోడ్డుగా నామరకణం చేయాలని మంత్రిని కోరారు. కౌన్సిల్‌హాల్‌లో ప్రధానంగా టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు అధ్వాన్నంగా ఉందని కార్పొరేటర్ గుజ్జుల వసంత నిలదీస్తుండగా మేయర్ సుధారాణి అడ్డుపడ్డారు. బల్దియా అధికారులు, సిబ్బంది చేస్తున్న తప్పులను కార్పొరేటర్లు ఎండగట్టారు. మొత్తంగా 23 ఎజెండా అంశాలలో సభ్యులు అన్నీ ఆమోదించారు. కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా కొందరు ప్రతిపక్ష కార్పొరేటర్లు మేయర్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కలుగజేసుకుని కౌన్సిల్ సమావేశం అంటే టైంపాస్‌కు సమోసాలు తిని ఫొటోలు దిగడానికి కాదని అన్నాడు. వెంటనే ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితోపాటు కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు కలుగజేసుకుని కౌంటర్ ఇచ్చారు. తమ ప్రభుత్వం చేసిన పనులను మీ ప్రభుత్వం చేసినట్టు రంగులు పూసుకుని ప్రజలను నవిస్తోందని మండి పడ్డారు. తన డివిజన్‌లో ప్రొటోకాల్ ఉల్లంఘించి ఫ్లెక్సీపై తన ఫొటో లేకుండా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని 40 డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ మరుపల్లి రవి ప్లకార్డుతో నిరసనకు దిగాడు. తోటి కార్పొరేటర్లు సర్దిచెప్పడంతో సమస్య సద్దుమనిగింది.

ఎమ్మెల్సీ సారయ్య ఫైర్

టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ఇన్‌చార్జ్ తీరు సరిగా లేదని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అజంజాహీ మిల్లు స్థలం గురించి టౌన్‌ప్లానింగ్ సీపీకి రెండు మాసాలుగా ఫోన్‌చేస్తున్నా ఫోన్ ఎత్తడం చేయడం లేదని అధికారిపై ఫైర్ అయ్యారు. ఇకపై ఇదే విధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని సారయ్య హెచ్చరించారు. వెంటనే మేయర్ కలుగజేసుకుని అధికారుల వైపు మరోమారు నిర్లక్ష్యం జరుగకుండా చూస్తామని వివరణ ఇచ్చారు. దీంతో సమస్య సద్దుమణిగింది. టౌన్‌ప్లానింగ్ అధికారులు అడ్డదారిలో అనుమతులు ఇస్తూ అడ్డగోలుగా డబ్బులు సంపాదిస్తున్నారని కొందరు కార్పొరేటర్లు మంత్రికి ఫిర్యాదు చేశారు. అజంజాహి మిల్లు కమ్యూనిటీ హాల్ అనుమతుల గురించి కార్పొరేటర్ గుండేటి నరేందర్ టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్ సీపీని నిలదీయగా 2022లో అనుమతులు ఇచ్చారని, తనకు పూర్తిగా అవగాహన లేదని చెప్పినట్టు తెలిసింది.

ఆత్మీయ భరోసా అందించండి..

బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు మంత్రి కొండా సురేఖను కలిసి విలీన గ్రామాలలోని దినసరి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అవకాశం కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. గ్రామీణ ప్రాంతాలలో వంద రోజుల పని మాదిరిగా విలీన గ్రామాల ప్రజలకు ఇందిరమ్మ భరోసా వర్తింపజేస్తే వారి కుటుంబాలు ఆర్థికంగా బలపడుతాయని కోరారు. కార్పొరేటర్ల విజ్ఞప్తి మంత్రి సానుకూలంగా స్పందించారు.

కోడ్ కూసింది

బల్దియా కౌన్సిల్ హాల్‌లో సమావేశం జరుగుతుండగా మధ్యలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కూసింది. ఎజెండా అంశాలు ఆమోదంతో పాటు ఇంకా నగరాన్ని అభివృద్ధి చేసే దిశలో చర్చలు జరుగుతుండగా.. మధ్యాహ్నం 1.20 నిమిషాలకు ఎన్నికల కోడ్ వచ్చిందని బల్దియా సెక్రెటరీ మేయర్‌కు చిట్టీ రాసి పంపించారు. వెంటనే మేయర్ సుధారాణి ఎమ్మెల్సీ కోడ్ వచ్చిందని, వెంటనే సమావేశం ముగించాలని వెల్లడించడంతో కౌన్సిల్ సమావేశం అర్థాంతరంగా ముగిసింది. వెంటనే కౌన్సిల్ హాల్ నుంచి మంత్రితో సహా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు బయటకు వచ్చారు.

పోలీసు పహారా

వరంగల్ బల్దియా కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో మేయర్ గుండు సుధారాణిని కొందరు కాంగ్రెస్ బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు అడ్డుకుంటారని ఇంటెలిజెన్స్, ఎస్‌బీ నిఘా వర్గాలు సమాచారం నేపథ్యంలో సీపీ అంబర్ కిశోర్ ఝూ ఆదేశాల మేరకు పోలీసులను రంగంలోకి దింపారు. వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ నేతృత్వంలో ఉదయం 8 గంటలకే బల్దియా వద్దకు సుమారు 100 మంది పోలీసులు చేరుకున్నారు. ఎంజీఎం రెండో గేటు నుంచి కౌన్సిల్ హాల్ వరకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కౌన్సిల్ హాల్‌లో గొడవను నియంత్రించేందుకు కొందరు పోలీసులను ఎవరికీ అనుమానం రాకుండా కార్పొరేటర్ల మధ్య కూర్చోబెట్టారు. మహిళా, పురుష పోలీసు కానిస్టేబుళ్లు హాల్‌లో కూర్చున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్ల మధ్య జరిగిన మాటల యుద్ధం అక్కడ ఉన్న పోలీసులు ఎప్పటికప్పుడు బయట ఉన్న ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

వరంగల్‌పై సీఎం వరాల జల్లు

వరంగల్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపిస్తున్నారు. ఇప్పటికే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.4,170 కోట్లు కేటాయించారు. అంతేకాకుండా రూ.270కోట్ల ప్రత్యేక నిధులు ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలవి అన్నీ అబద్ధాలు. గతంలో నేను కొబ్బరికాయ కొట్టిన పనులు గత ప్రభుత్వ చేయక పోవడంతో నేనే తిరిగి అదే పనులకు కొబ్బరికాయలు కొట్టి చేయాల్సి వస్తోంది.

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి

వరంగల్ నగరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతోంది. కాళోజీ కళాక్షేత్రం, నయీంనగర్ నాలా బ్రిడ్జి పనులు పూర్తి కాగా, ఇంకా చాలా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. గతంలో శంకుస్థాపనలు చేసిన పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కానీ తమ ప్రభుత్వంలో వెంటనే పనులు ప్రారంభం అవుతున్నాయి.

- నాయిని రాజేందర్‌రెడ్డి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే

మాజీ ప్రధానికి నివాళులు అర్పించలేదు..

బల్దియా కౌన్సిల్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు తాము చెప్పే వరకు పాలకవర్గం నివాళులు అర్పించలేని పరిస్థితిలో ఉంది. కౌన్సిల్ సమావేశంలో ప్రజల ఎజెండా కాకుండా పర్సనల్ ఎజెండాగా సాగిపోయింది. ప్రతిపక్షాల మాట వినకుండానే ఎజెండా అంశాలను చదివి మేయర్ ముగించారు. ఈ పద్ధతి తము ఏ మాత్రం నచ్చలేదు.

-పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ

అజంజాహి మిల్లు కోసం ఎంత దూరమైనా వెళతా

అజంజాహి మిల్లు స్థలం విషయంలో ఎంత దూరమైనా వెళ్తా. మిల్లు కమ్యూనిటీ హాల్ స్థలం కార్మికుల నుంచి కొందరు కబ్జాదారులు చేజిక్కించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మిల్లు స్థలం కార్మికుల రక్తం, చెమట చుక్కలతో ఉంది. మాజీ ఎమ్మెల్యే సహకారంతో నకిలీ పత్రాలు సృష్టించి కొందరు దక్కించుకునే కుట్ర చేస్తున్నారు. దీనిపై కౌన్సిల్‌లో అధికారులను నిలదీశాను.

- బస్వరాజు సారయ్య, ఎమ్మెల్సీ

దూరవిద్య బీఎల్ఐఎస్సీ పరీక్ష ఫీజు గడువు 15

కేయూ క్యాంపస్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూర విద్య కేంద్రం బీఎల్ఐఎస్సీ ఎక్స్ అభ్యర్థులు 2023-24 మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజులు ఫిబ్రవరి 15 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పేపర్లకు రూ.700, రెండు పేపర్ల వరకు రూ.600 చెల్లించుకోవాలని, ఇంప్రూమెంట్ ఒక్కో పేపర్‌కు రూ. 300 చొప్పున చెల్లించుకోవాలని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు 0870-2461480, 2461490 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిట్‌లో స్కాలర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ

పది రోజుల పాటు కొనసాగనున్న టోర్నమెంట్

హనుమకొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో బుధవారం బుధవారం స్కాలర్స్ ప్రీమియర్ లీగ్-2025 కన్నుల పండువగా ప్రారంభమైంది. ఈ పరిశోధక విద్యార్థుల అంతర్గత క్రికెట్ టోర్నమెంట్‌ను నిట్ క్యాంపస్‌లోని స్టేడియంలో వరంగల్ నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధి ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌ను నిట్‌లోని పరిశోధక విద్యార్థులు, స్టూడెంట్ అక్టివిటీ సెంటర్ (ఎస్ఏసీ) సంయుక్తంగా నిర్వహిస్తోంది. మొత్తం పది జట్లు ఇందులో పాల్గొంటున్నాయి. పది రోజుల పాటు ఈ క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ విద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. నిట్ క్యాంపస్‌లో 13 ఏళ్లుగా స్కాలర్ ప్రీమియర్ లీక్ నిర్వహిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. లీగ్ నిర్వాహకులను పాల్గొంటున్న జట్లను అభినందించారు.

విద్యతోపాటు ఫిట్‌నెస్ ఉండడం విద్యార్థులకు ముఖ్యం అన్నారు. అందరూ 'స్టే ఫిట్, స్టే హెల్దీ' అనే నినాదాన్ని పాటించి శారీరకంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డైరెక్టర్ పిలుపుఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య, సీనియర్ ప్రొఫెసర్, స్పోర్ట్స్ సెంటర్ అధిపతి ప్రొఫెసర్ పి.రవికుమార్, సీనియర్ సాక్ అధికారి డాక్టర్ పి.ప్రశాంత్, సాక్ అధికారి డి.హరి తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ సమన్వయకర్తలుగా పరిశోధక విద్యార్థులు బాలాజీ చౌహాన్ (మెకానికల్ ఇంజనీరింగ్), హరి ప్రసాద్ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్) కిశోర్‌బాబు (మెకానికల్ ఇంజనీరింగ్), ఓలివ్ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్) గణేశ్ గుగులోతు (సివిల్ ఇంజనీరింగ్) వ్యవహరిస్తున్నారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20ఏళ్ల జైలు

రూ.3లక్షలు బాధితురాలికి చెల్లించాలని ఆదేశం

వరంగల్ లీగల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.20వేలు జరిమానా విధిస్తూ వరంగల్ ప్రత్యేక పోక్సో కోర్టు కమ్ 2వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నమ్ బుధవారం తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.3లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని ప్రభుత్వాన్ని న్యాయమూర్తి తీర్పులో ఆదేశించారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 2021 జనవరి 12న మధ్యాహ్నం 1.30 గంటలకు బాధితురాలి అమ్మ తన ఇంట్లోకి వెళ్లగా గొర్రెకుంట శివారు కీర్తినగర్ గ్రామానికి చెందిన మహ్మద్ అజీముద్దీన్ ఇంట్లో నుంచి పారిపోతూ కనిపించాడు. విషయం తెలుసుకోగా 9 రోజులుగా మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో బాలికను బెదిరించి అత్యాచారం చేసినట్లు ఏడుస్తూ తల్లికి చెప్పింది. జరిగిన సంఘటన విషయంలో నిందితుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. నిందితుడు అజీముద్దీన్‌పై పోక్సోచట్టం నమోదు చేసి కేసు దర్యాప్తు చేశారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ బి.యుగంధర్, లైజన్ అధికారి హరికృష్ణ సాక్షులను ప్రవేశపెట్టారు. భరోసా లీగల్ అడ్వయిజర్ సీహెచ్. నీరజ కేసు విచారణలో సహకరించారు. దర్యాప్తు అధికారులుగా ఎస్సై బి.రాజు, నరేష్‌కుమార్, మహేందర్‌ల వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వాసుదేవరెడ్డి కేసు వాదించారు.

విద్యార్థిని ఆత్మహత్యలో ఇరువర్గాలపై కేసులు

వరంగల్ క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : తండ్రికి ఇంట్లో యువకుడితో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడి అవమానభారంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు యువకుడితో పాటు విద్యార్థి కుటుంబ సభ్యులపై కేయూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బొజ్జ రవీందర్ వివరాల ప్రకారం.. కేయూ పీఎస్ పరిధిలోని గోపాలపూర్‌లో మంగళవారం ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని యేడాదిగా తనతో పరిచయం ఉన్న బీటెక్ చదువుతున్న విద్యార్థి కుతాటి భరత్ (19)ను ఇంటికి పిలిపించుకుంది. విషయం తెలుసుకున్న విద్యార్థిని తండ్రి కుదుల వెంకటరమణ, మేనమామ లక్ష్మారెడ్డి ఇంటి తలుపులు తెరిచి ఇంట్లోకి వెళ్లగా గమనించిన భరత్ పారిపోతుండగా ఆదుపులోకి తీసుకొని దాడి చేయగా గొంతుకు గాయాలయ్యాయి. దీంతో అవమానభారంతో విద్యార్థిని ఉరి వేసుకొని మరణించింది. కాగా, విద్యార్థిని తండ్రి కుదుల వెంకటరమణ ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సోతో పాటు ఆత్మహత్యకు ప్రేరేపించిన సెక్షన్‌ల కింద కేసు నమోదు చేయగా, యువకుడి తల్లి కూతాటి విజయ ఫిర్యాదు మేరకు విద్యార్థిని తండ్రితో పాటు మేనమామ లక్ష్మా రెడ్డిపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. కాగా, విద్యార్థిని బంధువుల దాడిలో గాయపడ్డ భరత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

పద్మశాలీలకు ప్రభుత్వ పథకాలు దక్కాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈగ మల్లేశం

వర్ధన్నపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాలు పద్మశాలీలకు దక్కాలని, అందుకు తన వంతు కృషి చేస్తానని అఖిల భారత పద్మశాల సంఘం జాతీయ పూర్వ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలోని భారతీయ నాటక కళాసమితి ప్రాంగణంలో పద్మశాలి సంఘం మండలస్థాయి ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దూరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఈగ మల్లేశం హజరై మాట్లాడుతూ.. పద్మశాలీలు సంఘటితమై అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జనాభా ప్రకారం రాజ్యాంగబద్ధమైన పదవులను కేటాయించాలని డిమాండ్ చేశారు. వర్ధన్నపేట మండలంలో పద్మశాలీ ఫంక్షన్ హాలు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సవరణ బోర్డు సభ్యుడిగా చంద్రప్రకాష్‌ను నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 2న నిర్వహించనున్న బీసీ యుద్ధభేరి బహిరంగసభకు జిల్లాలోని పద్మశాలీల జనసమీకరణ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అలాగే స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ సాధించాలన్నారు. అనంతరం వర్ధన్నపేట మండల పద్మశాల సంఘం అధ్యక్షుడిగా పాశికంటి రాంచందర్, పట్టణ అధ్యక్షుడుగా పెద్దురు రాజ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోని వారిని ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పద్మశాలీ సంఘం నాయకులు బాసని చంద్రప్రకాష్, దుస్స శివశంకర్, బాల్నే శరత్‌బాబు, చంద మల్లయ్య, కందగట్ల నరహరి, మార్త సారంగపాణి, వలుపదాస్ శ్యాంసుందర్, బిట్ల రవి, గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, కందగట్ల సంజీవ, సిద్ధం లక్ష్మీనారాయణలతో పాటు పలు గ్రామాలను నుంచి అధిక సంఖ్యలో పద్మశాలిలు పాల్గొన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్ కిశోర్‌కు ఎఫ్ఏసీ బాధ్యతలు



వరంగల్ మెడికల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ కిశోర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద సీల్డ్ కవర్‌ను ఎంజీఎం కార్యాలయానికి బుధవారం పంపారు. గత నవంబరు 15వ తేదీ నుంచి డాక్టర్ కిశోర్ ఇన్‌చార్జి హోదాలో 66 రోజులుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎవరికి బాధ్యతలు అప్పగించకపోవడంతో పరిపాలన కుంటుపడిపోయింది. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు, పరిపాలన పనులన్నీ నిలిచిపోయాయి. కాగా, ఈ నెల 31న వరంగల్ సెంట్రల్ జైలు ప్రాంగణంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై సమీక్ష నిర్వహించనున్నారు. ఈ ఆస్పత్రికి కూడా ఎంజీఎం సూపరిం టెండెంట్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ప్రగతి నివేదిక సమీక్షకు ఎఫ్ఏసీ లేకపోవడం అడ్డంకిగా మారింది. డాక్టర్ కిశోర్‌కు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ సత్యశారద ఉత్తర్వులు జారీ చేశారు.

సీపీఎం రాష్ట్ర సభ్యుడిగా గాదె ప్రభాకర్‌రెడ్డి



హనుమకొండ చౌరస్తా, జనవరి 29.(ఆంధ్రజ్యోతి) : సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా హనుమకొండకు చెందిన గాదె ప్రభాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 25నుంచి 28వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీపీఎం తెలంగాణ నాలుగో రాష్ట్ర మహాసభల్లో హనుమకొండ జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్న ప్రభాకర్ రెడ్డిని రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తానని తెలిపారు.

విద్యుత్ సమస్యలన్నీ పరిష్కరించాలి



వరంగల్ సర్కిల్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి రాజు చౌహాన్

రాంనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వేసవి కాలంలో వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించేందుకు సమస్యలన్నింటినీ ఫిబ్రవరి నెలాఖరు వరకు పరిష్కరించాలని హనుమకొండ, వరంగల్ జిల్లా ఎస్ఈలను నోడల్ అధికారులు మధుసూదన్, రాజు చౌహాన్‌లు ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వరంగల్ సర్కిల్ అధికారులతో నోడల్ అధికారి రాజు చౌహాన్ బుధవారం సర్కిల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు చౌహాన్ మాట్లాడుతూ.. వరంగల్ సర్కిల్‌లోని వరంగల్ టౌన్, వరంగల్ రూరల్, నర్సంపేట డివిజన్ పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్‌లకు ప్రత్యామ్నాయంగా 33 కేవీ, 11 కేవీ లైన్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోచమ్మమైదాన్, ఎలుకుర్తి సబ్‌స్టేషన్, మూడు చెక్కలపల్లి సబ్‌స్టేషన్‌లల్లో వేసవికి తగ్గట్లు ఏర్పాట్లు చేయగా, పెండింగ్‌లో ఉన్న మిగతా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 11 కేవీ ఫీడర్ లైన్‌లో ఓవర్‌లోడ్‌ను అధిగమించేందుకు అవసరమైన పనులను చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా 11 కేవీ ఫీడర్‌లపై జరుగుతున్న పనులను సమీక్షించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లపై అదనపు భారం అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 474 ట్రాన్స్‌ఫార్మర్‌లపై ఓవర్ లోడ్ ఉందని, ఇప్పటికే 104 ట్రాన్స్‌ఫార్మర్‌లపై ఓవర్ లోడ్ తగ్గించేందుకు పనులు పూర్తి చేశామని, మిగతా 340 పనులకు ప్రతిపాదనలు ఆమోదించారని, ఫిబవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. సుమారు రూ.15కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులు చేపడతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ మధుసూదన్‌రావు, ట్రాన్స్ కో ఇన్ చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్, డీఈలు ఆనందం, మల్లికార్జున్, భిక్షపతి, తిరుపతి, హర్జి, ఏడీఈలు పాల్గొన్నారు.

హనుమకొండలో..

హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో నోడల్ అధికారి మధుసూదన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముధుసూదన్ మాట్లాడుతూ.. 33 బై 11 సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను ఇప్పటికే అదనపు కెపాసిటీలకు మార్చడం జరిగిందన్నారు. నక్కలగుట్ట, యాదవనగర్, కేయూ, నిట్ సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ డిమాండ్, ఓవర్‌లోడ్‌కు తగ్గట్లుగా మార్పు చేయడం జరిగిందని, ఎల్కతుర్తి మండలంలోని దామెర సబ్‌స్టేషన్‌లో అదనపు 5 యంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక ఆమోదించడం జరిగిందన్నారు. వచ్చే నెల చివరివారం వరకు ఈ పనులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 397 ట్రాన్స్‌ఫార్మర్‌లపై ఓవర్‌లోడ్ ఉండగా 39 టాన్స్‌ఫార్మర్‌లపై భారం తగ్గించడం జరిగిందని మిగతా 358 వాటికి ప్రతిపాదనలు ఆమోదించడం జరిగిందని వచ్చే నెలాఖరు వరకు పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ వెంకటరమణ, ట్రాన్స్ కో- ఎస్ఈ రవీంద్ర, డీఈలు విజేందర్‌రెడ్డి, సామ్యానాయక్, సాంబరెడ్డి, దర్శన్‌కుమార్, ఏడీఈలు పాల్గొన్నారు.

మోగిన టీచర్ ఎమ్మెల్సీ నగారా

ఫిబ్రవరి 3న నోటిఫికేషన్.. 27న పోలింగ్.. మార్చి 3న లెక్కింపు

- వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక
- బీజేపీతో పాటు అభ్యర్థులను ప్రకటించిన ఉపాధ్యాయ సంఘాలు
- పోటీనా ? మద్దతా ? తేల్చుకోలేకపోతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు
- ఎన్నికల కోడ్‌తో మూడు ఉమ్మడి జిల్లాల్లో అభివృద్ధి పనులకు బ్రేక్





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికకు నగారా మోగింది. ఈ మేరకు బుధవారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 27వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీకాలం మార్చి 29వ తేదీతో పూర్తి కానుంది. ఈలోగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. మరోవైపు ఉపాధ్యాయ సంఘాలతో పాటు రాజకీయ పార్టీలు కూడా టీచర్ ఎమ్మెల్సీ స్థానంపై దృష్టి సారించాయి. ఇప్పటికే బీజేపీ.. తన అభ్యర్థిని ప్రకటించగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని బరిలో దించటమా? లేక ఏదైనా ఉపాధ్యాయ సంఘం అభ్యర్థికి మద్దతు ఇవ్వాలా? అనే ఆలోచనలో ఉంది. ఇక బీఆర్ఎస్ మాత్రం పోటీకి సుముఖంగా లేనట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే పీఆర్‌టీయూ, టీజీయూటీఎఫ్ సంఘాలు మాత్రం ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండటంతోపాటు ఉపాధ్యాయ సంఘాల్లో కీలక నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగేం దుకు ఏర్పాట్లు చేసుకుంటుండటంతో ఎమ్మెల్సీ ఎన్నిక ఉత్కంఠగా మారా యి. ఎన్నికల కోడ్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది.

ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నిక

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. 10వ తేదీ నామినేషన్లకు చివరి రోజుగా పేర్కొన్నారు. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణలకు అవకాశం ఇచ్చారు. ఫిబ్రవరి 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్ర 4గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3వ తేదీన ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి, 8వ తేదీన మొత్తం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. గత అక్టోబరు, డిసెంబరు నెలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. జనవరి మొదటి వారంలో తుది ఓటరు జాబితాను ప్రకటించింది. ఉపాధ్యాయ నియోజకవర్గంలో మొత్తం 24,905 మంది ఓటర్లుగా తమ పేరును నమోదు చేసుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 10,960మంది ఓటర్లు ఉండగా, 76 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 8,041 మంది ఓటర్లు ఉండగా, 77 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 5,904 మంది ఓటర్లు ఉండగా, 47 పోలింగ్ కేం ద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 24,905 మందిలో 14,940 మంది పురుషులు, 9,965 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. 2019 మార్చిలో జరిగిన ఎమ్మె ల్సీ ఎన్నికల్లో 20, 888 మంది ఓటర్లు మాత్రమే ఉండగా, ఈసారి అదనంగా 4,0 17మంది ఓటర్లు నమోదయ్యారు. మొత్తంగా 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి బూత్ లెవల్ అధికారులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోటీకి బీఆర్ఎస్ దూరమే ?

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ నేతలతో చర్చలు కూడా జరపటం లేదు. దీంతో పార్టీ నుంచి పోటీ చేయాలనే ఆలోచన ఉన్న నేతలు సైతం ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ సైతం పార్టీ నుంచి పోటీ చేసే అవకాశాలు లేకపోవటం వల్ల ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా బీఆర్ఎస్ నేరుగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దిగలేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. 2019లో మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్‌కు బీఆర్ఎస్ బయట నుంచి మద్దతు ఇచ్చింది. ఆఎన్నికల్లో పూల రవీందర్‌పై టీజీయూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి విజయం సాధించారు. ప్రస్తుతం కూడా పోటీలోకి దిగకుండా ఎవరికైనా మద్దతు ఇవ్వొచ్చని గులాబీ పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

సమరానికి సై

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జరిగే ఎన్నికల్లో తేల్చుకునేందుకు ఉపాధ్యాయ సంఘాలు సిద్ధమవుతున్నాయి. తెలంగాణలో సుమారు 55కు పైగా ఉపాధ్యాయ సంఘాలు ఉన్నప్పటికీ ప్రధానంగా టీజీయూటీఎఫ్, పీఆర్‌టీయూ, తపస్ మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి బరిలో దింపుతున్నట్లుగా టీజీయూటీఎఫ్ ప్రకటించింది. అలాగే పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి బరిలో దిగుతున్నారు. తపస్ మద్దతుతో బీజేపీ నుంచి మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తంరెడ్డి పోటీకి దిగుతున్నారు. టీచర్స్ జాక్ పేరుతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సీపీఎస్ సంఘం నుంచి ఎం.వెంకటస్వామి పోటీకి సై అంటున్నారు. వీరితో పాటు మాజీ కూడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సమరానికి సై అంటు న్నారు. మరోవైపు బీజేపీ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవటం చర్చనీయాంశంగా మారింది.

మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తంరెడ్డిని తమ అభ్యర్థిగా బరిలో దించటంతో ఉపాధ్యాయుల ఎన్నికల్లో వార్ మొదలైంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికపై ఆచీతూచి వ్యవహరిస్తోంది. పార్టీ నుంచి అభ్యర్థిని బరిలోకి దించటమా? లేక ఏదైనా ఉపాధ్యాయ సంఘం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థికి లేదా స్వతంత్రంగా పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎవరికైనా మద్దతు ఇవ్వడమా? అనే అంశంపై చర్చలు జరుపుతోంది. గతంలో మాదిరిగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉంటూ, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీపై ఫోకస్ చేయాలని కాంగ్రెస్‌లోని ఓ వర్గం నేతలు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో కాంగ్రెస్ ఏ నిర్ణయం తీసుకుంటుందో అనే ఉత్కంఠ ఉపాధ్యాయ సంఘాల్లో నెలకొంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
వరంగల్	13	2,225
హనుమకొండ	15	5,098
మహబూబాబాద్	16	1,618
జనగామ	12	921
భూపాలపల్లి	07	323
ములుగు	09	612
సిద్దిపేట (పూర్వ వరంగల్)	04	163
మొత్తం	76	10,960

కోడ్ ఎఫెక్ట్

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించటంతో వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఈ మూడు జిల్లాల్లో ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా బ్రేక్ పడింది. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం జరుగుతుండగానే ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో అర్ధాంతరంగా సమావేశాన్ని ముగించారు.

అలాగే పరకాల నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలకు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి షెడ్యూల్ ఖరారైనప్పటికీ, ఎన్నికల కోడ్‌తో అన్ని రద్దు చేసుకున్నారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా తమ నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలను నిలిపివేశారు. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. బ్యాలెట్ పత్రాల లెక్కింపు కావటంతో ఫలితం వచ్చే వరకు రెండు మూడు రోజులు పట్టే అవకాశం ఉంది. మొత్తంగా మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. అప్పటి వరకు ప్రభుత్వం పరంగా వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాలతో పాటు టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలో కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది.

అమెరికాలో ఉన్న వారికి ఇక్కడ ఎఫ్ఏసీ ఎంఈవో ?

చర్చనీయాంశంగా మారిన డీఈవో, ఆర్జేడీ చర్యలు

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండల విద్యాశాఖాధికారి అకాల మరణంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసే ప్రక్రియలో డీఈవో వాసంతి చర్యలు సక్రమంగా లేవంటూ ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. సెలవుపై వెళ్లి అమెరికాలో ఉన్న హెడ్మాస్టర్‌కు హసన్‌పర్తి ఎఫ్ఏసీ ఎంఈవోగా బాధ్యతలు కట్టబెట్టేందుకు డీఈవో వాసంతి, ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి ఆగమేఘాల మీద చేపడుతున్న చర్యలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ నెల 24న హసన్‌పర్తి ఎంఈవో ఇ.రవీందర్ అకాల మృతి చెందారు. ఈ స్థానంలో అమెరికాలో ఉన్న హెడ్మాస్టర్ జి.రాజిరెడ్డికి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించేందుకు వేగంగా చర్యలు చేపట్టడం పట్ల ఉపాధ్యాయ వర్గాలు తప్పుబడుతున్నారు. ఎవరైనా ఎంఈవో అకాల మృతి చెందితే అక్కడున్న సీనియర్ హెడ్మాస్టర్‌కు ఎఫ్ఏసీ బాధ్యలు అప్పగించడం అనేది నిబంధన. ఎవరు సానుకూలంగా లేకుంటే పక్క మండలంలోని ఎంఈవోకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలి. అయితే ఇదంతా పక్కన బెట్టి ఫిబ్రవరి మూడో తేదీ విధుల్లో చేరుతానని అమెరికా నుంచి ఒక అండర్ టేకింగ్ లెటర్ ఇచ్చిన రాజిరెడ్డికే ఎఫ్ఏసీ ఎంఈవో బాధ్యలు అప్పగించే చర్యలు చేపట్టడాన్ని తప్పుబడుతున్నారు. ఇటీవలే జరిగిన ఎఫ్ఏసీ ఎంఈవోల నియమాకాల్లో ఇదే జిల్లాలోని వేలేరు మండలం నోడల్ ఆఫీసర్‌గా ఉన్న మల్లికుదురు జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ జయసాగర్ ఆ సమయంలో విదేశాల్లో ఉండటం వల్ల అదే మండలంలోని ఎర్రబెల్లి జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ చంద్రమౌళికి ఎఫ్ఏసీ ఎంఈవో బాధ్యతలను అప్పగించారు. అయితే హసన్‌పర్తి ఎఫ్ఏసీ ఎంఈవో విషయంలో మాత్రం పది రోజుల తర్వాత విదేశం నుంచి స్వదేశానికి వచ్చే హెడ్మాస్టర్‌కు ఎఫ్ఏసీ కట్టబెట్టేందుకు డీఈవో చూపిస్తున్న ఉత్సాహాన్ని ఉపాధ్యాయ వర్గాలు విమర్శిస్తున్నాయి. కాగా, విదేశాల్లో ఉన్న రాజిరెడ్డికే బాధ్యతలు కట్టబెట్టాలని హనుమకొండ జిల్లా హెడ్మాస్టర్ల అసోసియేషన్ వినతి పత్రం ఇవ్వడాన్ని సైతం ఉపాధ్యాయులు తప్పుబడుతున్నారు. విదేశాల నుంచి ఇక్కడకు వచ్చి విధుల్లో చేరిన తర్వాతనే డీఎస్సీకి ఫైల్ పంపించాల్సిన ఆర్జేడీ సైతం డీఈవో చర్యలకు వంతపాడటాన్ని ఉపాధ్యాయ వర్గాలు వ్యతిరేకిస్తున్నారు.

లబ్ధిదారులకు అభయ హస్తం

- పథకం డబ్బులు ఇప్పించేందుకు సర్కారు ఆలోచన
- వడ్డీతో డబ్బులు కలిపి చెల్లించే యోచన
- ఈ నెలాఖరులోగా ఖాతాలో జమకు అవకాశం
- 1.92 లక్షల మందికి రావాల్సిన మొత్తం రూ.79.50 కోట్లు



హనుమకొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అభయ హస్తం పథకం డబ్బుల ను తిరిగి ఇచ్చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ డబ్బును వడ్డీతో కలిపి నెలాఖరులోగా మహిళల ఖాతాల్లో జమ చేయాలని యోచి స్తోంది. ఈ మేరకు అభయ హస్తం లబ్ధిదారుల వివరాలను సేకరించను న్నారు. గతంలోనే ఉమ్మడి జిల్లాలోని అధికారులు వివరాలను సేకరించి ప్రభు త్వానికి అందచేశారు. అయితే ఈ సారి గ్రామాలవారీగా జాబితాలను రూపొందించనున్నారు. ఇందులో భాగంగా జీవించి ఉన్న, మరణించిన వారి వివరాలను సేకరిస్తారు. లబ్ధిదారులు మరణిస్తే వారి వారి వారసుల సమా చారాన్ని సేకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే అధికారులు ప్రభు త్వం నుంచి మార్గదర్శకాల కోసం ఎదురుచూస్తున్నారు.

రూ.79.50 కోట్లు

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాలు హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లిలతో పాటు వరంగల్ మహానగర పాలక సంస్థ, అప్పటి మూడు పురపాలక సంఘాలు జనగామ, నర్సంపేట, మహబూబాబాద్ పరిధిలోని 1,92,823 మంది స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు అభయ హస్తంలో చేరారు. 2013వరకు వార్షిక ప్రీమియంగా డబ్బులు చెల్లిస్తూ వచ్చారు. ఐదేళ్ల చెల్లించిన మొత్తం రూ.79.50 కోట్లు అయింది. అప్పటి నుంచి వడ్డీకూడా లెక్కిస్తే రెండింతలు అవుతోంది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం అభయ హస్తం బీమా పథకాన్ని రద్దు చేసి ప్రీమియం వసూళ్లను నిలిపివేసింది. మార్పులు, చేర్పులతో మరింత మెరుగైన రీతిలో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని మళ్లీ అమలు చేస్తుందని మహిళ లు భావించారు. కానీ పథకాన్ని కొనసాగించకపోగా కట్టిన ప్రీమియం సొమ్ములు కూడా వెనక్కి ఇవ్వలేదు. అభయ హస్తం పథకం లబ్ధిదారుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడాన్ని గమనించిన ప్రభుత్వం.. ప్రీమియం సొమ్ము తిరిగి చెల్లిస్తామని ప్రకటించింది. గత ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లోని సెర్ప్ సిబ్బంది మహిళల బ్యాంకు ఖాతాలు, ఇతర వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. వారం, పది రోజుల్లో ప్రభుత్వం వడ్డీతో సహా ప్రీమియం డబ్బులు ఖాతాల్లో జమ చేస్తుందని భరోసా ఇచ్చారు. అయినా డబ్బులు ఖాతాల్లో జమకాక మహిళలు నిరాశకులోనయ్యారు. ఒక దశలో ఈ డబ్బులపై ఆశలు వదులుకున్నారు.

నీరుగారిన లక్ష్యం

అభయ హస్తం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రవేశపెట్టింది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రవేశపెట్టిన ఒక మంచి పథకం ఇది. దీనిని కొనసాగించడంతో పాటు అవసరమనుకుంటే కొన్ని సవరణలు చేసి మరింత మెరుగ్గా అమలు చేయాల్సి ఉంది. స్వయం సహాయక సంఘాల మహిళలకు మరింత ఆర్థిక భద్రత, ప్రయోజనాలను కల్పించాలనుకుంటే ఈ పథకం ద్వారా చెల్లించే పింఛన్‌ను, పరిహారాలను పెంచితే బాగుండేది. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదేమీ చేయకుండా కేవలం కాంగ్రెస్ హయాం లో అమలులోకి వచ్చిందన్న ఒకే ఒక కారణంతో దీనిని అర్ధాంతరంగా రద్దు చేసిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్ర ప్రభుత్వం అసరా పింఛన్ కింద నెలకు రూ.2016 చెల్లిస్తున్నందువల్ల అభయ హస్తం అవసరం లేదని ప్రభుత్వం భావించినట్లు తెలిసింది. దీనికితోడు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధాన మంత్రి జీవన్ బీమా యోజన (పీఎంజేబీవై), ప్రధాన మంత్రి సురక్ష యోజన (పీఎంఎస్‌కేవై) పథకాలు అభయ హస్తం తరహాలోనే ఉన్నాయి. కనుక అభయ హస్తం కొనసాగించాల్సిన అవసరం లేదని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం భావించింది. రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని రద్దు చేసినప్పుడు దీని కింద తమకు రావలసిన డబ్బులను తిరిగి చెల్లించాలని ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లు చాలాకాలంగా డిమాండ్ చేశాయి. వారి డిమాండ్ అంగీకరించిన గత ప్రభుత్వం సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్)లో ఉన్న డిపాజిట్ సొమ్మును పంపిణీ చేయడానికి నిర్ణయించింది. కానీ ఆ తర్వాత చేతులెత్తేసింది. గతంలో ఈ అంశం అసెంబ్లీలో కూడా చర్చకు వచ్చింది. రెండు మూడు రోజుల్లో మహిళా వ్యక్తిగత ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలోకి మాత్రం రాలేదు.

15 ఏళ్ల కిందట..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉండగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2009లో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల కోసం ఎల్ఐసీ అనుసంధానంతో అభయ హస్తం పేరిట బీమా పాలసీని ప్రవేశపెట్టింది. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు వయస్సు కలిగిన మహిళలు అభయ హస్తం బీమా పథకంలో చేరే అవకాశం కల్పించారు. పాలసీ తీసుకున్న సభ్యులు ఏడాదికి రూ.365 చొప్పున ప్రీమియం చెల్లించారు. ఇలా 59 ఏళ్ల నిండే వరకు వాయిదాలు చెల్లించాల్సి ఉంది. దీంతో వారి పిల్లలు చదువుతుంటే ఉపకార వేతనం మంజూరు చేసేలా, 60 ఏళ్ల నుంచి చివరి మజిలీ వరకు నెలకు రూ.500 చొప్పున పింఛను చెల్లించేలా, చనిపోతే రూ. 30వేలు, ఆర్థిక సాయం నామినీకి అందజేసేలా ఈ పథకంలో అవకాశం కల్పించారు.

రెంటికి చెడి..

అభయ హస్తం పథకాన్ని మొత్తానికి ఎత్తివేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఈ పథకం కింద నమోదైన ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులకు ఆసరా పథకం వర్తింప చేయాలనే నిశ్చయించింది. 2009లో అభయహస్తం పథకం ప్రారంభమైనప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1.92లక్షల మంది సభ్యులుగా ఉండగా వీరిలో 50శాతం మందికి ఆసరా పెన్షన్ రావడం లేదని గుర్తించారు. ఈ మేరకు అభయ హస్తం పథకం వివరాలను క్షేత్ర స్థాయిలో సేకరించాలని అధికారులను ఆదేశించింది. అభయ హస్తంలోని సభ్యుల్లో ఆసరా పెన్షన్ అందనివారిని గుర్తించి అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది. ఈమేరకు అప్పట్లో ప్రకటనలు కూడా వెలువడ్డాయి. కానీ ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ కాలేదు. పెన్షనూ ఇవ్వలేదు. అభయ హస్తం ఎత్తివేయడం వల్ల చాలామంది మహిళలకు ఈ పథకం కింద పెన్షన్ రాకుండాపోయింది. అటు ఆసరా పెన్షనూ రావడం లేదు. దీనితో వీరి పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిగా మారింది. వారు ప్రీమియంగా చెల్లించిన సొమ్ము మాత్రం సెర్ప్ వద్ద ఇన్నాళ్లు మూలుగుతూ వచ్చింది. అభయ హస్తం కాంగ్రెస్ హయాంలోనే అమలులోకి వచ్చింది కనుక ఈ పథకం కింద మహిళలు ప్రీమియంగా చెల్లించిన మొత్తాన్ని వడ్డీతో కలిసి తిరిగి ఇచ్చివేయాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. 15 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు తమ డబ్బులు తిరిగి వస్తున్నందుకు మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎట్టకేలకు ఏర్పాటైన పాలకవర్గం

- ఏనుమాముల మార్కెట్‌కు కమిటీ నియామకం
- చైర్‌పర్సన్‌గా ఎర్ర ప్రియాంక, వైస్ చైర్మన్‌గా బండి జనార్దన్

వరంగల్ వ్యవసాయం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్‌కు ఎట్టకేలకు పాలకవర్గం ఏర్పాటైంది. ఆసియాలోనే రెండో అతిపెద్దదిగా చెప్పుకునే మార్కెట్‌కు 18 నెలలుగా పాలకవర్గం లేదు. దీంతో సమస్యలు పరిష్కరించడంలో జాప్యం జరిగిందనే విమర్శలున్నాయి. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ అనేక మార్లు ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలను ప్రచురించింది. దీంతో ప్రభుత్వం స్పందించి మంగళవారం అర్ధరాత్రి పాలకవర్గాన్ని నియమిస్తూ జీవో విడుదల చేసింది. వారం రోజుల్లో వారు బాధ్యతలు చేపట్టేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులతో పెద్దఎత్తున ఈ కార్యక్రమం నిర్వహించేందుకు నూతన కమిటీ సమాయత్తమవుతోంది.

చైర్‌పర్సన్‌గా ఎర్ర ప్రియాంక, వైస్ చైర్మన్‌గా బండి జనార్దన్

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా విద్యావంతురాలు ఎర్ర ప్రియాంక, వ్యాపారవర్గాల నుంచి వైస్‌చైర్మన్‌గా బండి జనార్దన్‌తో పాటు కమిటీ సభ్యులుగా గాదరబోయిన రాజు, ధనికుల రాంబాబు, చల్లా వాసుదేవరెడ్డి, గొడుగు భిక్షపతి, భదవత్ నర్సింహనాయక్, ఆకుల రుద్రప్రసాద్, బొడ్డు ప్రదీప్‌కుమార్, కత్తి సంపత్, మహ్మద్ సబేరా, అచ్చ నాగరాజు, దుగ్యాల గోపాలరావు, గజ్జెల శ్యామ్ సుందర్‌లతో పాటు జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, ఖిలా వరంగల్ పీఏసీఎస్ చైర్మన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వరంగల్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌లతో కూడిన పాలకవర్గాన్ని నియమించారు.

మహిళలే మహారాణులు

తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ, మార్కెట్ కమిటీలలో మహిళలే కీలక పదవిలో ఉంటున్నారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం చైర్‌పర్సన్‌గా నూతనంగా ఎంపికైన ఎర్ర ప్రియాంకతో పాటు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పోలెపాక నిర్మల, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్‌గా సురేఖ, వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్‌గా పద్మావతి, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి కూడా మహిలళే. అంతేగాకుండా వరంగల్ కలెక్టర్ సత్యశారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయశాఖాధికారి అనురాధ ఇలా అందరూ మహిళలే కావడం యాదృచ్ఛికమే అయినప్పటికీ మహిళలే మహరాణులు అన్నట్లు ఆదేశాలు జారీ చేసే స్థాయిలో ఉన్నారు.

మార్కెట్‌కు మంచి పేరు తెచ్చేలా చేస్తా

ఏనుమాముల మార్కెట్ చైర్ పర్సన్‌గా నాకంటూ ఓ గుర్తింపు దక్కేలా పని చేస్తా. మార్కెట్ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా. వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు పాలకవర్గం సహకారం తీసుకుంటా. అవసరమైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తా.

ప్రియాంక, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్

పాలనపై అనుమానాలెన్నో..

రాష్ట్రంలోనే అతి పెద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ కావడంతో నిత్యం అనేక సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. గతంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా చేసిన వారు అనేక ఇబ్బందులు పడ్డారు. సమస్యలను పరిష్కరించలేక, వేదికలపై మాట్లాడలేక, అధికారులతో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేయలేక, సమస్యలపై అవగాహన లేక చాల ఇబ్బందులు పడ్డ విషయం అదరికీ తెలిసిందే. ఈ నేపథ్యలో ప్రియాంక పాలనపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి కోడ్ అడ్డు?



ఏనుమాముల వ్యవసాయ మార్కెట్

ఏనుమాముల (వరంగల్) వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ మంగళవారం రాత్రి వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎట్టకేలకు 18 నెలల తరువాత పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు రైతులు, కార్మికులు, వ్యాపారవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అయితే బుధవారం మధ్యాహ్నం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణపై అనుమానాలు వస్తున్నాయి. మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉండడంతో పాలకవర్గం తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. మార్కెటింగ్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసిన దానినే పరిగణలోకి తీసుకుంటారా..? లేక మార్కెట్ కమిటీకి వెళ్లి చైర్‌పర్సన్‌గా సంతకం చేస్తేనే బాధ్యతలు చేపట్టినట్లు భావిస్తారా? అన్నది ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది.

మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నేపథ్యం

మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా నియమితులైన ఎర్ర ప్రియాంక కాజీపేట ప్రాంతానికి చెందిన వారు. తల్లి స్వర్ణకిరీటి గృహిణి (చనిపోయారు). తండ్రి సుందర్ రైల్వే ఉద్యోగి. ప్రియాంక ఎస్ఆర్ యూనివర్సిటీలో బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ చేశారు. గోపాలపూర్‌కు చెందిన పులి అనిల్‌ను ఆమె వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం గోపాలపూర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త అనిల్ వైద్యుడు. అంతేగాకుండా పదేళ్లుగా అఖిలభారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) నేషనల్ కో ఆర్డినేటర్‌గా, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీకి అఫీషియల్ అనువాదకుడిగా ఉన్నారు. విద్యార్థి దశలోనే నాయకుడిగా ఎదిగారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏనుమాముల మార్కెట్ కమిటీ ఎస్సీకి రిజర్వుడ్ కావడంతో తన భార్య ప్రియాంకకు అవకాశాన్ని కల్పించుకున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఐఓ ప్రకాశ్

పీపీ యూనిట్‌ను పరిశీలించిన డీఐఓ

వరంగల్ మెడికల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ (పీపీ యూనిట్)ను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ ఐ.ప్రకాశ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంజీఎంలో వ్యాధి నిరోధక టీకాలు నిల్వ చేసిన కోల్డ్ చైన్ సిస్టంను, రికార్డులను పరిశీలించారు. అనంతరం డాక్టర్ ప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, జ్వరాల పట్ల ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందుకు ఆరుబయట తిరగడం మంచిది కాదని తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విద్యాసాగర్, నర్సింగ్ ఆఫీసర్ ఆర్.భాగ్యలక్ష్మీ, ఏఎన్ఎం లక్ష్మీబాయి, రామ రాజేష్‌ఖన్నా పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడమే లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వడ్డెపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడమే తమ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం టీయూడబ్ల్యూజే (హెచ్-143) హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గం వారిని క్యాంపు కార్యాలయాలలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచనలతో వరంగల్ నగర జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ మరో రూపంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే (హెచ్-143) జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, ప్రధాన కార్యదర్శి అర్షం రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు చింతల సత్యనారాయణ, సిరిమల్ల సదానందం, గోకారపు శ్యామ్, బొడిగె శ్రీనివాస్, దొమ్మటి శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులు బొమ్మగాని ఆదర్శ్‌గౌడ్, పొడిశెట్టి కరుణాకర్‌లు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్లతో పోచంపల్లి సమావేశం



కార్పొరేటర్లతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లతో వరంగల్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డిల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్‌లోని పలు డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కౌన్సిల్‌లో చర్చించాల్సిన తీరుపై బీఆర్ఎస్ కార్పొరేటర్లతో దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

స్పెషల్ చీఫ్ సెక్రెటరీను కలిసిన కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): టీట్రాన్స్‌పోర్ట్, ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్‌రాజ్ బుధవారం హనుమకొండ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు రాగా, హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య మర్యాదపూర్వకం గా కలిసి పూలమొక్క అందజేశా రు. కలెక్టర్ వెంట రహదారులు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.



వికాస్‌రాజ్‌కు పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

బీసీలు పాలకులుగా ఎదగాలి

వడ్డెపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : బీసీలు పాలితులుగా కాకుండా పాలకులుగా ఎదగాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ కూరపాటి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతోపాటు చీఫ్ కోఆర్డినేటర్లు కొండ వీరస్వామి, మండల పరశురాములు మాట్లాడారు. బీసీలు బానిసలుగానే బతుకుతూ రాజ్యాధికారానికి దూరంగా మగ్గుతున్నారని అన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందు కోసం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వంలో ఫిబ్రవరి 2న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధ భేరి భారీ బహిరంగసభకు రాజకీయాలకు అతీతంగా అన్ని బీసీ కులాలు లక్షలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రతినిధులు రాజగోవింద్, కుసుమ సూర్యకిరణ్, పాము సత్యనారాయణ, రాము పాల్గొన్నారు.

బీసీ రాజకీయ యుద్ధభేరికి తరలిరావాలి

హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2న మధ్యాహ్నం 2 గంటలకు బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు రజకులు తరలిరావాలని వరంగల్ ఉమ్మడి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిట్యాల భిక్షపతి, ప్రధాన కార్యదర్శి సాంబరాజు అంకయ్య, కార్యదర్శి నల్లతీగల ఎల్లయ్య పిలుపునిచ్చారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కూరపాటి రమేష్

సమావేశంలో వారితో పాటు జిల్లా ప్రతినిధులు తంగెళ్లపెల్లి అరుణ రమేష్, చీకటి వీరస్వామిలు మాట్లాడారు. త్వరలో జరుగబోయే మంత్రి వర్గ విస్తరణలో రజక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలలో ఒకరికి క్యాబినెట్ హోదా గల మంత్రి పదవిని కేటాయించాలని డిమాండ్ చేశారు.

బీసీల సభకు తరలిరావాలి

కేయూ క్యాంపస్: ఫిబ్రవరి 2న హనుమకొండ ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో జరిగే బీసీ యుద్ధభేరి సభకు తరలిరావాలని బీసీ విద్యావంతుల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిర్రా రాజుగౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం కేయూ మొదటి గేటు వద్ద గల తుపాకుల ప్లాజాలో యుద్ధ భేరి గోడపత్రికను ముదిరాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అశోక్ ముదిరాజ్, పులి రజనీకాంత్, గౌడ సంఘం నేతలు నాగపురి రమేశ్‌గౌడ్



హనుమకొండలో బీసీ యుద్ధభేరి సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

లతో కలిసి ఆవిష్కరించారు.

సభను విజయవంతం చేయాలి

హనుమకొండ టౌన్: ఫిబ్రవరి 2న హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే బీసీ యుద్ధభేరి సభను బీసీ కుల సంఘాలు లక్షలాదిగా కదలి వచ్చి విజయవంతం చేయాలని ముదిరాజ్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల రవి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని తుపాకుల ప్లాజాలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. చట్టసభల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయాలను ఎలుగెత్తి చాటడం కోసం ఇంటికో బీసీ తరలివచ్చి బీసీల యుద్ధభేరి సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు డాక్టర్ చిర్ర రాజుగౌడ్, ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అశోక్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు పులి రజనీకాంత్, గౌడ సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు నాగపురి రమేష్‌గౌడ్, సమ్మెట హరీష్‌గౌడ్, బీసీ సంఘాల నాయకులు రవికుమార్, తిలక్, ఎంజాల మల్లేశం, బింగి లక్ష్మీనారాయణ, బి.నాగరాజు, సతీష్, చెన్న ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

నేవీ సైనికుడికి ఘన నివాళి

సైనిక లాంఛనాలతో ర్యాలీ

హసన్‌పర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన హసన్‌పర్తికి చెందిన నేవీ కోస్టుగార్డు ఆకుల వంశీక్రిష్ణ అంత్యక్రియలు బుధవారం హసన్‌పర్తిలో ఘనంగా జరిగాయి. మృతుడికి భార్య రవళి, ఇద్దరు సంతానం, కుమారుడు అభిషిక్త్ (3), కుమార్తె అద్విక (2) ఉన్నారు. గుజరాత్ నుంచి విమానంలో మృతదేహం హైదరాబాద్‌కు చేరుకోగా అక్కడి నుంచి అంబులెన్స్ వాహనంలో చింతగట్టు క్యాంపునకు చేరుకుంది. అక్కడి నుంచి నేవీ సైనికులు, యువత సైనిక లాంఛనాలతో ర్యాలీ ద్వారా స్వగ్రామం హసన్‌పర్తికి చేరుకుంది. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు పర్యవేక్షణలో నేవీ కోస్టు గార్డు కమాండెంట్ వీవీ రెడ్డి, ప్రధాన అధికారి తడుస్, ప్రదాన్ యాంత్రిక్ నీలి సంపత్, అంబాడ్కన్ సమక్షంలో స్థానిక పోలీసులు వంశీక్రిష్ణ పార్థీవదేహానికి సైనిక వందనాలు తెలిపి జాతీయ జెండాను కప్పి నివాళులర్పించారు. అనంతరం గౌరవ సూచకంగా మూడు రౌండ్లు గాలిలోకి తుపాకీ పేల్చి సెల్యూట్ చేశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ లాంఛనాలతో వంశీకృష్ణ పార్థీవదేహాన్ని, అతని దస్తులు, సర్టిఫికెట్ అందజేశారు.

ఎమ్మెల్యే నాగరాజు పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోస్టుగార్డు వంశీకృష్ణ కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముందుగా వంశీకృష్ణ పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వంశీకృష్ణ పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పెన్షన్ పెంపుపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలి

వడ్డెపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కోల్ మైన్స్ పెన్షనర్ల పెన్షన్ పెంపుపై పార్లమెంట్ లో ప్రస్తావించి న్యాయం చేయాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కడార్ల ప్రకాష్‌చారి, ప్రధాన కార్యదర్శి చిదురాల సత్యనారాయణ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను కోరారు. బుధవారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని కనకదుర్గా కాలనీలో క్యాంపు కార్యాలయంలో ఎంపీ కావ్యను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 27 ఏళ్ల నుంచి కోల్‌మైన్స్ పెన్షన్ రివైజ్ కాలేదని అన్నారు. మూడేళ్ల కోసారి రివైజ్ కావాల్సి ఉండగా చేపట్టకపోవడంతో తమకు ఎలాంటి పెన్షన్ పెరగలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఎంపీ కడియం కావ్య స్పందిస్తూ పార్లమెంట్ సెషన్‌లో చర్చించి పెన్షన్ పెంపు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో సింగరేణి పెన్షనర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వీరమనేని రవీందర్‌రావు, ఆర్థిక కార్యదర్శి నలుబాల దామోదర్, ఉపాధ్యక్షులు సీహెచ్. మాధవ రావు, షేక్ హసన్, కార్యదర్శులు పి. సాంబయ్య, ఎం. రాయమల్లు ఉన్నారు.

రోడ్డు సేఫ్టీ కోసం రోడ్డుకు మరమ్మతులు

హనుమకొండ టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలాపార్కు సమీపంలో రోడ్డుపై గుంతలు పడడంతో ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతు పనులు చేసినట్లు ప్రేరణ ఫౌండేషన్ ఫౌండర్ పెండ్లి ఉపేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. 30, 31వ డివిజన్‌లో ఏకశిలా పార్కు ఇతర ప్రాంతాలలో పాడై పోయిన రోడ్లపై ఎక్కువకాలం మన్నికగా ఉండే విధంగా సిమెంటు లేకుండా ఫ్లైయాష్, రీసైక్లింగ్ మెటీరియల్ మున్సిపాలిటీ సహకారంతో రోడ్డుపై గుంతలను పూడ్చివేసినట్లు తెలిపారు. రోడ్డు సేఫ్టీ రోడ్డు నిర్వహణపై వాకర్స్ వివిధ సామాజిక వేత్తలతో కార్యక్రమం చేపట్టినట్లు ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

కేయూకు పూర్వ విద్యార్థుల సహకారం గొప్పది

కేయూ క్యాంపస్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో గొప్పదని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పునరుద్ఘాటించారు. బుధవారం కేయూ రాజనీతిశాస్త్ర విభాగంలోని నూతనంగా నిర్మించిన అల్యూమినీ హాల్‌లో బహూకరించిన ఏసీని స్విచ్ ఆన్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వల్లూరి రామచంద్రం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, బీఓఎస్ చైర్మన్ డాక్టర్ జి.కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ వి.సత్యనారాయణ, డాక్టర్ వి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారమే తప్ప.. పనులు పట్టవు..

ఓ డివిజన్‌లో ప్రజాప్రతినిధిపై ప్రజల అసంతృప్తి

రెడ్డికాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆ డివిజన్‌లో ప్రజాప్రతినిధి వ్యవహార శైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డివిజన్‌లో డ్రెయినేజీ, మంచినీటి, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలు అనేకం ఉన్నప్పటికీ ఏనాడూ ఆ ప్రజాప్రతినిధి కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎవరైనా వెళితే 'నేను ప్రభుత్వ ఉద్యోగి కాదు..' అంటూ అవహేళనగా మాట్లాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూ ఆక్రమణలు

ప్రజాప్రతినిధి కబ్జా పర్వంపై డివిజన్ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి భూములపై పడడాన్ని విమర్శిస్తున్నారు. ఆయన తీరుపై సొంత పార్టీ నేతలే అసంతృప్తితో ఉన్నట్లు బహిర్గతమవుతోంది. ఇటీవల లోటస్ కాలనీలో సుమారు ఒక కోటి రూపాయల విలువ గల భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో నకిలీ పత్రాలు సృష్టించినట్లు తెలుస్తోంది. ప్రయివేట్ వ్యక్తులతో సర్వేలు చేస్తూ దందా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అయితే ఏకంగా తన అనుచరుల భూములపైనే కన్నేయడంతో వారు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. డివిజన్‌లోని యాదవనగర్, విజయలక్ష్మీ కాలనీ, కృష్ణకాలనీ, జ్యోతిరావుఫూలే కాలనీలో సదరు నేత పేరు మీద ఎలాంటి భూమి లేకున్నా.. తన వారసత్వ భూమి అని చెప్పుకుంటూ ఇతరులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని భూ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల యాదవనగర్‌లో జరిగిన ఫ్లెక్సీ లొల్లి వెనుక కూడా భూ వివాదమే ఉన్నట్లు స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి సదరు భూబకాసూరుడి నుంచి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మోసపూరిత ఫోన్‌కాల్స్ నమ్మొద్దు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రాత పరీక్ష రాసిన అభ్యర్థులకు ఫోన్ కాల్స్ వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి ఫోన్‌కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య సూచించారు. ఈ విషయాన్ని రాష్ట్ర అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఇటీ వల రాష్ట్రస్థాయిలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులకు రాత పరీక్ష నిర్వహించిన విష యం తెలిసిందేనని, దీనిని ఆసరాగా చేసుకొని కొందరు ఫేక్ ఫోన్‌కాల్స్ చేస్తున్నారని పేర్కొన్నారు. మోసపూరిత ఫోన్‌కాల్స్ వచ్చినట్లయితే సమీపంలోని పోలీసు స్టేషన్‌లో లేదా సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని డీఎంహెచ్‌ఓ సూచించారు.

విద్యార్థులకు సమర్థవంతమైన సేవలందించాలి

కేయూ క్యాంపస్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులందరికీ ఉద్యోగులందరూ సమర్థవంతమైన సేవలందించాలని కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఓ.సారయ్య అన్నారు. బుధవారం కేయూ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ల సమావేశంలో సారయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ విద్యార్థుల కోసమే ఉన్నారని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతంగా పనిచేసి అందరి మన్ననలు పొందాలని కోరారు. ఈ సందర్భంగా సారయ్య దంపతులను గెజిటెట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.సుజాత అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు సంఘం నేతలు డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, హబీబుద్దీన్, డాక్టర్ స్వర్ణలత, ప్రణయ్‌కుమార్, రాము, తోట రాజయ్య, సుజాత, నర్సయ్య, నేతాజీ, రాము, జావీద్, సునీల్, శ్యాం, అశోక్‌బాబు, సరళా దేవి తదితరులు పాల్గొన్నారు.

బల్దియా ఎదుట ఆజంజాహి మిల్లు కార్మికుల ధర్నా

వరంగల్ కార్పొరేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అజంజాహిమిల్లు కార్మికుల కమ్యూనిటీ హాల్ స్థలం కబ్జాపై బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం వద్ద కార్మికులు నిరసనకు దిగారు. బ్యానర్లు పట్టుకుని ధర్నా చేశారు. వీరికి ప్రజాసంఘాల నాయకులు మద్దతు పలికారు. అనంతరం కౌన్సిల్ సమావేశానికి వచ్చిన మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం సమర్పించారు.

కబడ్డీ విజేతగా వర్సిటీ మ్యాథ్స్ జట్టు

కేయూ క్యాంపస్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఖేలో భారత్ క్రీడోత్సవాలను పురస్కరించుకుని కేయూ క్రీడామైదానంలో ఏబీవీపీ నేతృత్వంలో నిర్వహిస్తున్న కబడ్డీ క్రీడాపోటీల్లో విజేతగా కేయూ మ్యాథ్స్ విభాగం జట్టు నిలువగా రన్నర్‌గా కేయూ సేవలాల్ టీం నిలిచింది. మూడు రోజులుగా వర్సిటీలో క్రీడాపోటీలు జరుగుతున్నాయి. కాగా, బుధవారం క్రీడాపోటీలను కేయూ గణిత శాస్త్ర విభాధిపతి డాక్టర్ భారవిశర్మ, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల రాంబాబులు హాజరై టాస్ వేసి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఏబీవీపీ కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, రాష్ట్ర నాయకులు అంబాల కిరణ్, కేయూ అధ్యక్షుడు సాయి, గేమ్స్ కన్వీనర్ గట్టు ప్రశాంత్, కో కన్వీనర్ సంయుక్త, అఖిల, తదితరులు పాల్గొన్నారు.

నాయిని సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

హనుమకొండ సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హనుమకొండ 59వ డివిజన్‌లోని బీఆర్ఎస్‌కు చెందిన పలువురు యువజన విభాగం నాయకులు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్ కార్యాలయంలో చేరికల కార్యక్రమం జరిగింది. జిల్లా కాంగ్రెస్ ఐటీ సెల్ చైర్మన్ కేతిడి దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. కాంగ్రెస్ కండువాలతో నాయిని రాజేందర్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

జిల్లా స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

వడ్డెపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్ వద్దగల అన్సార్ హైస్కూల్‌లో అన్సార్ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రీడలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను అన్సార్ పాఠశాల చైర్మన్ అబ్దుల్ హన్నాన్, సెక్రటరీ ముజాహిద్ ఇర్ఫాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిరంజీవి, పీఈటీ సోహైల్‌ఖాన్, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు కేయూలో అమరవీరుల దినోత్సవం

కేయూ క్యాంపస్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి):అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కేయూ పరిపాలన భవనంలో స్వాతంత్ర పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు నివాళులర్పిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేయిస్తంభాల ఆలయంలో సీపీ దంపతుల పూజలు

హనుమకొండ కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వర ఆలయంలో మౌని అమావాస్య సందర్భంగా ప్రత్యేక పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం ప్రదోషకాల సమయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించి రుద్రేశ్వరుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా మౌని అమావాస్యను పురస్కరించుకొని సీపీ దంపతులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక దీపాలు వెలిగించుకున్నారు. స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించి గంగు ఉపేంద్రశర్మ మహదాశీర్వచనం నిర్వహించారు. ప్రదోషకాల పూజల్లో భాగంగా బుధవారం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో తొక్కిసలాటలో మృతి చెందిన భక్తులందరికీ పరమేశ్వరుడి అనుగ్రహ స్వర్గప్రాప్తి లభించాలని స్వామివారికి ప్రత్యేక రుద్రాభిషేకం నిర్వహించారు.



రుద్రేశ్వరాయలంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సీపీ

ముసాయిదా నిబంధనలు విరమించుకోవాలి

కేయూ క్యాంపస్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వర్సిటీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, యూజీసీ రూపొందించిన వర్సిటీల వ్యతిరేక నిబంధనల ముసాయిదాను ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కేయూ పరిపాలన భవనం ఎదుట ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో యూజీసీ ముసాయిదాను నిరసిస్తూ ప్రచురించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయా కరపత్రాలను వర్సిటీలోని ప్రొఫెసర్లకు, విద్యార్థులకు తిరిగి పంచారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, కేయూ అధ్యక్షుడు సాయి కిరణ్, జిల్లా కమిటీ సభ్యుడు అరుణ్, అఖిల్, మంగీలాల్, సాయి, ప్రవీణ్, పృథ్వీ, రత్నం, వేణు, రాజ్‌కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో కాంట్రాక్టు అధ్యాపకుల బైక్ ర్యాలీ

కేయూ క్యాంపస్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూలో కాంట్రాక్టు అధ్యాపకులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. వర్సిటీలోని మొదటి గేటు, రెండో గేటు, పరిపాలన భవనం వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు శ్రీధర్‌కుమార్‌లోథ్, సతీశ్, రాజేశ్, సత్య నాగేశ్వర్‌రావు, మధుకర్, నాగయ్య, సంగీత్, సూర్యనారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు' విజయవంతం చేయాలి



మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కాజీపేటలో మాదిగల భారీ డప్పుల ప్రదర్శన

కాజీపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) ఎస్సీ వర్గీకరణ డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం కాజీపేట చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ డప్పుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బండారు సురేందర్ మాదిగ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసునూరి మనోహర్, సందెల విజయ్ కుమార్‌లు మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహించే లక్షడప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమంలో మాదిగ జాతి బిడ్డలు హైదరాబాద్ మార్మోగేలా డప్పులు మోగించి తీరుతామన్నారు. మాదిగ జాతికోసం నిరంతర కృషిచేస్తున్న మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంపై ఎంతో గర్వంగా ఉందన్నారు. అనంతరం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి మాదిగలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాదిగ సంఘ నాయకులు పిల్లి క్రిస్టఫర్, రాజక క్రాంతి, మాతంగి కిరణ్, మాచర్ల శేఖర్, కాంపల్లి లక్ష్మణ్, కె.వంశీ, పి.గోపి, పి.జార్జ్, బొడ్డు దేవయ్య, ఆర్. శ్రీనివాస్‌తోపాటు స్థానికులు పెద్దఎత్తున హాజరయ్యారు.

మెట్టుగుట్టను సందర్శించిన స్థపతి వల్లి నాయగం

మడికొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని దేవాదాయ శాఖ స్థపతి వల్లినాయగం బుధవారం సందర్శించారు. దేవస్థాన ప్రాంగణంలోని వీరభద్రస్వామి ఆలయాన్ని పరిశీలించి ఆలయ పునర్నిర్మాణ విషయమై ఈవోకు పలు సూచనలు చేశారు. త్వరలో దేవాదాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన అనుమతులు మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు బైరి రాజు, బోగి కేదారి, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు

యూఆర్ఎస్‌లో దుప్పట్ల పంపిణీ



యూఆర్ఎస్‌లో దుప్పట్లను పంపిణీ చేస్తున్న డీఈవో వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ఎస్)లో డీఈవో డెడ్రే వాసంతి దుప్పట్లు పంపిణీ చేశారు. బుధవారం యూఆర్ఎస్‌ను సందర్శించిన ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తున్నందున విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతుందో లేదో పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాస్, ఎస్‌వో దీప తదితరులు పాల్గొన్నారు.



ఖఫ్తాన్ శారీతో కొత్తగా...

ఫ్యాషన్ డ్రెస్‌లు సౌకర్యానికి పెద్ద పీట వేస్తాయి. అలాగని సంప్రదాయాన్ని వదిలిపెట్టవు. అందుకే అవంటే అందరూ మోజు పడుతుంటారు. ఇలాంటి ఫ్యాషన్ ప్రపంచంలోకి 'ఖఫ్తాన్ శారీస్' మేమున్నామంటూ వచ్చేశాయి. మహిళలకు విపరీతంగా నచ్చేశాయి. ఒకవైపు చీరలా కనిపిస్తూ మరోవైపు అందమైన కుర్తీని గుర్తుకు తెస్తూ ఇండో వెస్ట్రన్ లుక్‌తో అందరినీ ఆకట్టుకుంటున్నాయి. చీర అంటే ఇష్టం ఉన్నప్పటికీ కట్టుకోవడానికి ఇబ్బంది పడే యువతులకు ఈ ఖఫ్తాన్ శారీ వరం లాంటిది.

- ఖఫ్తాన్ శారీని కాటన్, పట్టు, చందేరీ సిల్క్, జార్జెట్, టస్సర్... ఇలా ఏ రకం ఫ్యాబ్రిక్ చీరతోనైనా రూపొందించవచ్చు.
- వీటి తయారీ విషయానికి వస్తే... చక్కని చీరకు కుచ్చిళ్లు సెట్ చేసి... లెహంగా మాదిరి కుట్టేస్తారు. కొంగులో కొంత భాగాన్ని కుర్తీలా కుట్టి, మిగిలిన దాన్ని భుజాలమీదుగా వేలాడేలా జతచేస్తారు. చీర కొంగుకు ఉన్నట్టే కుర్తీని కూడా స్టెప్స్‌తో రూపొందిస్తున్నారు! ఇలాంటివి చిన్న పార్టీల్లో వేసుకోవడానికి బాగుంటాయి.
- కుర్తీకి కాలర్, స్టార్, వి, రౌండ్ నెక్ డిజైన్‌లను అమరుస్తున్నారు. నెక్ డిజైన్‌ను అనుసరించి బటన్స్ కూడా అమరుస్తున్నారు. వీటితోపాటు చక్కని ఎంబ్రాయిడరీ, సీక్వెన్స్, జర్దోసీ వర్క్‌లు చేసిన ఖఫ్తాన్ శారీలను మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.
- కుర్తీ పొట్టిగా ఉన్నపుడు నడుము భాగంలో బెల్ట్ పెట్టుకుంటే చీర కట్టుకున్నట్టే కనిపిస్తుంది. అదే పొడవుగా ఉంటే లాంగ్ గౌన్ లుక్ వస్తుంది.
- ఖఫ్తాన్ శారీ ధరించినపుడు ఎక్కువగా ఆభరణాల అవసరం ఉండదు. చిన్న గొలుసు, ఒక ఉంగరం, చక్కని స్టడ్స్ ఉంటే చాలు. అలాగే ప్రత్యేకమైన హెయిర్ స్టయిల్ కూడా అక్కర్లేదు. ఎంత సాధారణంగా ఉంటే అంత హుందాగా కనిపిస్తారు. కేవలం ఈ డ్రెస్ స్టయిల్ ఒక్కటే అందరినీ చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది.



ఇలా చేద్దాం

ఇంట్లోనే కుంకుమ తయారీ ఇలా...

మహిళలు రోజూ నుదుటిమీద కుంకుమ బొట్టు పెట్టుకుంటూ ఉంటారు. కొంతమంది పాపిడి మధ్యలో సిందూరం దిద్దుకుంటారు. బజార్లో కొనుక్కున్న కుంకుమ వల్ల ఒక్కోసారి చర్మం మీద నల్లని మచ్చలు, కురుపులు ఏర్పడుతుంటాయి. అలాకాకుండా ఇంట్లోనే ఎర్రని కుంకుమ ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం!

కుంకుమ తయారీ

- ముందుగా మిక్సీ గిన్నెల్లో చిన్నదాన్ని తీసుకొని లోపల నీళ్ల చుక్కలు లేకుండా శుభ్రంగా తుడవాలి. అందులో నాలుగు చెంచాల పసుపు పొడి, ఒక చెంచా నెయ్యి వేసి రెండూ కలిసేలా చెంచాతో కలపాలి. తరవాత ఒక చెంచా నిమ్మరసం, చిటికెడు సున్నం వేసి కలపాలి. ఒక చెంచా గులాబీ నీళ్లు కూడా వేసి ఉండలు రాకుండా కలపాలి. ఈ గిన్నెను గ్రైండర్‌కు అమర్చి ఒక నిమిషం



గ్రైండ్ చేయాలి. మిక్సీ గిన్నెలో ఎర్రని కుంకుమ తయారవుతుంది. దాన్ని ఒక పళ్లెంలోకి తీసి అరగంటసేపు ఆరనివ్వాలి. తరవాత అందమైన కుంకుమ భరిణెలో దాన్ని నిల్వ చేసుకోవచ్చు.

ఆమె గురించే అందరి ఆరా!

దివా జైమిన్ షా..... గౌతమ్ అదానీకి కాబోయే చిన్న కోడలిగా ఒక్కసారిగా వార్తల్లో నిలిచారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభ్‌లో పాల్గొన్న అదానీ కుటుంబం .. ఫిబ్రవరి 7న జీత్ అదానీ, దివాల వివాహాన్ని సంప్రదాయ రీతిలో జరిపిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఈమె గురించి నెట్టింట తెగ వెతికేస్తున్నారు.

ఎవరీ దివా జైమిన్ షా?

దేశంలో ప్రముఖ వజ్రాల వ్యాపారి జైమిన్ షా కూతురే దివా. వజ్రాల తయారీ సంస్థల్లో పేరుగాంచిన 'సి. దినేష్ అండ్ కో ప్రైవేట్ లిమిటెడ్ సహ యజమాని కూడా. సూరత్, ముంబైలలో పలు కేంద్రాలను నెలకొల్పి వజ్రాల వ్యాపారంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్నారు. అంతేకాదు తండ్రి మార్గనిర్దేశకత్వంతోపాటు జిగర్ దోషి, అమిత్ దోషి, యోమేష్ షా వంటి బృంద సభ్యుల సహకారంతో వ్యాపారాన్ని గ్లోబల్ డైమండ్ మార్కెట్ స్థాయికి చేర్చారు. నెదర్లాండ్స్ హాంకాంగ్‌లలోనూ కార్యాలయాలు స్థాపించారు. సామాజిక మాధ్యమాల్లో దివా యాక్టివ్‌గా ఉండరు. అయితే ఫైనాన్స్ వ్యాపార రంగాలకు సంబంధించి పలు అంశాల్లో ఆమెకు మంచి పట్టు ఉంది. ఇదే అదానీ కుటుంబాన్ని బాగా ఆకర్షించింది.



సాదాసీదాగా పెళ్లి!

ఇరు కుటుంబాలు ధనిక వర్గానికి చెందినవే కావడంతో వివాహం చాలా గ్రాండ్‌గా జరుగుతుందనీ, దేశ విదేశాల నుంచి ప్రముఖులు వస్తారనీ ఊహాగానాలు వినిపించాయి. కానీ పెళ్లి సాదాసీదాగా సంప్రదాయ పద్ధతిలో జరుగుతుందని గౌతమ్ అదానీ చెప్పారు. 2023 మార్చి 14న జీత్, దివాల నిశ్చితార్థం కాగా గత డిసెంబరులో ఉదయ్‌పూర్‌లో ప్రీ వెడ్డింగ్ ఫంక్షన్ జరిగింది. జీత్ అదానీ ప్రస్తుతం అదానీ గ్రూప్ ఫైనాన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. అదానీ ఎయిర్‌పోర్ట్స్, అదానీ డిజిటల్ ల్యాబ్స్ వ్యవహారాలు కూడా చూసుకుంటున్నారు.



సామాన్య కుటుంబంలో పుట్టిన ఆమె అసాధారణమైన మార్గాన్ని ఎంచుకున్నారు. ఏడు ఖండాల్లోని ఏడు పర్వతాల ఆరోహణ లక్ష్యంగా సాగుతున్న ఆమె ప్రయాణం... ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నాడు అయిదో శిఖరాగ్రాన్ని చేరుకుంది. అర్జెంటీనాలోని అకాంగోవా పర్వతంపై భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసి... 'భారత్‌మాతాకీ జై' అంటూ ఆమె చేసిన నినాదం కొండ కోనల్లో ప్రతిధ్వనించింది. రెట్టించిన ఉత్సాహంతో మరో రెండు పర్వతాల అధిరోహణకు సిద్ధమవుతున్న తెలుగు యువతి పడమటి అన్విత సాహసోపేతమైన కథ ఇది...

ఆమె లక్ష్యం, గమ్యం...

ఏడు ఖండాల్లో ఏడు శిఖరాలు


"పర్వతారోహణకు ధైర్య సాహసాలతోపాటు వాతావరణ పరిస్థితులను తట్టుకొనే దారుఢ్యం, ఓర్పు, సమయస్ఫూర్తి ఉండాలి. దాని కోసం నిరంతరమైన సాధన అవసరం అవుతుంది. దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాలో ఉన్న అకాంగోవా పర్వతారోహణ కూడా ఎన్నో సవాళ్లు విసిరింది. ఈ నెల (2025 జనవరి) 10వ తేదీన మన దేశంలో బయలుదేరి.. 12వ తేదీన అర్జెంటీనా చేరుకున్నాను. సముద్ర మట్టానికి 6,961 మీటర్ల ఎత్తులో ఉన్న అంకాగోవా పర్వతాన్ని ఎక్కడానికి అవసరమైన డాక్యుమెంటేషన్ పూర్తి చేశాను. మా బృందంలో మొత్తం తొమ్మిదిమంది ఉన్నాం. అయిదుగురు మహిళలం, నలుగురు పురుషులు. మేము 13వ తేదీన బేస్‌క్యాంప్ నుంచి పర్వతారోహణ ప్రారంభించాం. మైనస్ 25 నుంచి మైనస్ 30 డిగ్రీల అతి శీతలమైన వాతావరణంలో, తీవ్రమైన చలిగాలుల మధ్య మా యాత్ర సాగింది. బేస్‌క్యాంప్‌నకు, గమ్యానికి మధ్య 70 శాతం భాగం మంచుతో కప్పేసి ఉంది. మిగిలిన భాగమంతా జారుడుగా ఉన్న రాళ్ల మార్గం. దాదాపు 6 వేల మీటర్ల ఎత్తుకు చేరుకొనేసరికి... పరిస్థితులను భరించలేక ఆరుగురు వెనుతిరిగారు. ఇద్దరు పురుషులు, నేను మాత్రమే గమ్యాన్ని చేరుకోగలిగాం. 13 రోజులపాటు సాగిన మా ఆరోహణ... మన గణతంత్ర దినమైన జనవరి 26వ తేదీ ఉదయం అకాంగోవా శిఖరాగ్రం దగ్గర ముగిసింది. అక్కడ మన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాను. 'భారత్ మాతాకీ జై' అని నినదిస్తూ మన దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపాను. ఆ క్షణంలో... నాలో ఏదో మహత్తరమైన భావోద్వేగం.

భువనగిరి ఖిల్లా మీద...

మాది తెలంగాణలోని యాదాద్రి-భువనగిరి జిల్లా భువనగిరి. నాన్న పడమటి మధుసూదన్‌రెడ్డి వ్యవసాయం చేస్తారు. అమ్మ చంద్రకళ అంగన్వాడీ టీచర్. నాలుగేళ్ల క్రితం ఎంబీయే పూర్తి చేశాను. పర్వతారోహణ పట్ల నా ఆసక్తిని గమనించిన ట్రాన్సెండ్ అడ్వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డి. ఎవరెస్టర్ శేఖర్‌బాబు ఆ దిశగా ప్రోత్సహించారు. ఆయన పర్యవేక్షణలో భువనగిరి ఖిల్లా మీద నా ప్రాథమిక శిక్షణ సాగింది. అప్పుడే ఏడు ఖండాల్లోని ఏడు ఎత్తైన పర్వతాలను అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. దేశ, విదేశాల్లోని అనేక పర్వతాల ఆరోహణతో నా సామర్థ్యానికి మెరుగులు దిద్దుకున్నాను. ఆఫ్రికా ఖండంలో... సముద్రమట్టానికి 5,896 మీటర్ల ఎత్తులో ఉన్న ఖిలిమంజారోను 2020 జనవరిలో అధిరోహించడంతో నా సప్త ఖండాల పర్వతారోహణ మొదలయింది. 2021 డిసెంబరు 7న 5,642 మీటర్ల ఎత్తైన ఎల్‌బ్రస్ (యూరప్), 2022 మే 16న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 8,848.86 మీటర్ల ఎవరెస్ట్ శిఖరం (ఆసియా ఖండం), 2022 డిసెంబరు 17న సముద్రమట్టానికి 4,892 మీటర్ల ఎత్తులో ఉన్న విన్సన్ (అంటార్కిటికా) పర్వతాలను అధిరోహించాను. అయిదవదిగా... దక్షిణ అమెరికా ఖండంలోని అకాంగోవా కూడా పూర్తయింది. దీనికి హైదరాబాద్‌కు చెందిన అన్విత కన్‌స్ట్రక్షన్స్ ఆర్థిక సాయం చేసింది. ట్రాన్సెండ్ అడ్వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రమోటర్‌గా వ్యవహరించింది. ప్రస్తుతం అన్విత ట్రాన్సెండ్ అకాడమీ సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్నాను. ఇంకా... ఉత్తర అమెరికా ఖండంలోని అలస్కాలో... సముద్ర మట్టానికి 6,990 మీటర్ల ఎత్తులో ఉన్న డెనాలీ పర్వతాన్ని, ఆస్ట్రేలియాలో సముద్రమట్టానికి 2,228 మీటర్ల ఎత్తైన కోజిస్కో పర్వతాన్ని అధిరోహించాలి. త్వరలోనే వాటిని కూడా ఎక్కి... నా లక్ష్యాన్ని నెరవేర్చుకుంటాను."

• పోతంశెట్టి కరుణాకర్
భువనగిరి టౌన్

విజేత




గెలుపు ముంగిట తడబడిన ప్రతిసారీ... మరింత పట్టుదలగా ప్రయత్నించింది. బలహీనతలను అధిగమించి... నైపుణ్యాన్ని మెరుగులు అద్దుకొని... బలమైన ప్రత్యర్థిగా మారింది. గ్రాండ్‌స్లామ్ గెలవాలన్న చిన్ననాటి కలను... మూడు పదుల వయసులో నెరవేర్చుకుంది. మహామహులను మట్టికరిపించి... 'ఆస్ట్రేలియన్ ఓపెన్'లో సరికొత్త చాంపియన్‌గా అవతరించిన అమెరికా సంచలనం... మాడిసన్ కీస్ కథ ఇది.

పడిలేచిన కెరటం

దాదాపు ఏడాదిన్నర కిందట... యూఎస్ ఓపెన్ సెమీ ఫైనల్. అవతలివైపు రెండో సీడ్ అరినా సబలెంక. పదిహేడో సీడ్‌గా బరిలోకి దిగిన మాడిసన్ కీస్... అంచనాలను తలకిందులు చేస్తూ తొలి సెట్‌ను ఏకపక్షంగా గెలుచుకుంది. రెండో సెట్... ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనా తట్టుకొని... 5-4తో ముందుకు సాగింది. ఇంకొక్క గేమ్! గెలిస్తే ఫైనల్స్ బెర్త్. కీస్... సర్వీస్. స్టేడియం అంతా ఊపిరి బిగబట్టి వీక్షిస్తోంది. ఇంతలో ఊహించని మలుపు. సబలెంక మెరుపు దాడికి కీస్ కుదేలైంది. టైబ్రేకర్‌తో ఆ సెట్‌నే కాదు... తరువాతి సెట్‌ను కూడా ప్రత్యర్థికి కోల్పోయి... చేతులోకి వచ్చిన మ్యాచ్‌ను చేజార్చుకుంది కీస్. ఆటలో సరిజోడీగా పోటీపడినా... కీలక సమయంలో ఒత్తిడికి తల వంచింది. కానీ ఆ పరాజయం ఆమెలో మరింత కసి పెంచింది. విజయానికి దాన్ని ఒక సోపానంగా భావించింది. 'ఈ మ్యాచ్‌ను సానుకూలంగా తీసుకొంటే ఓటమిని గెలుపుగా మలచడం అసాధ్యమేమీ కాదు' అంటూ నాడు మ్యాచ్ అనంతరం భావోద్వేగానికి లోనైంది కీస్. చెప్పినట్టే సరిగ్గా 16 నెలలు తిరక్కుండానే ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలుచుకుంది. ఫైనల్లో డబుల్ డిఫెండింగ్ చాంపియన్, నెంబర్ వన్ సీడ్... సబలెంకాను ఓడించి కొత్త ఏడాది అద్భుత ఆరంభాన్ని అందుకుంది.

ఓటమి కొత్తకాదు...

వాస్తవానికి అంతిమ సమరంలో తడబడడం కీస్‌కు కొత్తేమీ కాదు. ఏడేళ్ల కిందట 2017లో కూడా యూఎస్ ఓపెన్ ఫైనల్ దాకా వచ్చి, టైటిల్ చేజార్చుకుంది. కెరీర్‌లో పది టైటిల్స్ సాధించిన ఆమె... గ్రాండ్‌స్లామ్ పోటీలకు వచ్చేసరికి తీవ్ర ఒత్తిడికి లోనవుతుంది. ఇదే ఆఖరి నిమిషంలో గెలుపును దూరం చేస్తోంది. దీని నుంచి బయటపడడానికి ఎంతోమంది మానసిక నిపుణులను సంప్రతించింది. వారి సూచనలతో ఎన్నో ప్రయత్నాలు చేసింది. కానీ అదే పరిస్థితి. భర్త, కోచ్ బిజోర్న్ ఫ్రాటాంజెలో నేతృత్వంలో పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకొని, శారీరకంగా, మానసికంగా తనను తాను మార్చుకోవాలని నిశ్చయించుకుంది. అప్పటివరకు పొట్టి హ్యాండిల్ ఉన్న విల్సన్ రాకెట్‌తో ఆడిన ఆమె... కాస్త పొడుగు హ్యాండిల్ గల యోనెక్స్ రాకెట్‌ను పట్టుకుంది. గత సీజన్‌లో సగానికిపైగా మ్యాచ్‌లను దానికి అవాటుపడటానికి కేటాయించింది. స్పోర్ట్స్ సైకాలజిస్టును కలిసి మానసికంగా తాను ఎదుర్కొంటున్న సమస్యలను అతడి ముందు పెట్టింది.



ఆత్మసమీక్ష చేసుకొని...

'గతంలో ఎన్నో స్పోర్ట్స్ థెరపీలు తీసుకున్నా. అవన్నీ ఆట నుంచి దృష్టి మరలకుండా మనల్ని మనం నియంత్రించుకోగలగడం గురించి. అయితే దానికన్నా ప్రస్తుతం అనుసరిస్తున్న థెరపీ మరింత మెరుగైన ఫలితాలను ఇస్తోంది. ఇందులో నా గురించి నేను ఏమనుకొంటున్నాను? నా పట్ల నేను ఎంత నిజాయతీగా ఉన్నాను? అనేది తెలుసుకోగలగడం ప్రధానం. నిజంగా ఇది చాలా కష్టం. ఎందుకంటే మానసిక ఆందోళనకు గురవుతున్నాననే విషయం నేను చాలా రోజులు అంగీకరించలేకపోయాను. నిజాయతీగా ఆత్మసమీక్ష చేసుకున్నాక నా దృక్పథంలో మార్పు వచ్చింది. సన్నిహితులతో కూడా ఈ విషయాలపై దాపరికం లేకుండా చర్చించడం మొదలు పెట్టాను' అంటున్న కీస్‌లో ఇప్పుడు మైదానంలో మును పెన్నడూ లేనంతగా ఆత్మవిశ్వాసంతో దూసుకుపోతోంది.

ఫెదరర్ స్ఫూర్తితో...

ఇలినాయిస్‌లోని రాక్ ఐలాండ్‌లో పుట్టిన కీస్... టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌కు వీరాభిమాని. అతడి స్ఫూర్తితోనే ప్రొఫెషనల్ క్రీడాకారిణిగా ఎదిగింది. టీవీలో వింబుల్డన్ చూస్తూ ఆటపై మక్కువ పెంచుకున్న ఆమె... నాలుగేళ్ల వయసులోనే టెన్నిస్ కోర్టులోకి అడుగుపెట్టింది. ఆమె తండ్రి రిక్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు. నలుగురు కూతుళ్లలో రెండో సంతానం కీస్. 'క్రిస్ ఎవర్ట్ టెన్నిస్ అకాడమీ'లో శిక్షణ పొందింది. ప్రొఫెషనల్ క్రీడాకారిణిగా 2009లో కెరీర్‌ను ప్రారంభించి, ఏడాది తిరక్కుండానే తొలి ఐటీఎఫ్ టైటిల్ సాధించింది. 2016 రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచింది. 2017 యూఎస్ గ్రాండ్‌స్లామ్‌లో ఫైనల్స్‌కు చేరి అందర్నీ ఆశ్చర్యపరిచింది. రెండేళ్ల తరువాత సిన్సినాటీ టైటిల్ నెగ్గిన ఆమె... ఆ తరువాత మరింత దూకుడు పెంచింది. 2023లో ప్రపంచ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి టాప్10లో స్థానం సంపాదించింది. అప్పటి నుంచీ అద్భుతమైన ఫామ్‌తో అదరగొడుతూ... ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అడుగుపెట్టింది. గతవారం ముగిసిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కీస్ ఆట మరో స్థాయిలో ఉందనేది మాజీల మాట. మూడో రౌండ్‌లో పదో సీడ్ కొలిన్స్‌ను ఇంటి దారి పట్టించిన ఆమె... నాలుగో రౌండ్‌లో ఆరో సీడ్ ఎలెనా రిబికినాను ఓడించింది. సెమీస్‌లో రెండో సీడ్, పోలండ్ స్టార్ ఇగా స్వియటెక్‌పై గెలిచి, తుది పోరులో టాప్‌సీడ్ సబలెంకాను ఓడించి, కెరీర్‌లో మొట్టమొదటి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ముద్దాడింది. తొలి, రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ మధ్య దాదాపు ఎనిమిదేళ్ల విరామం ఉంది. గ్రాండ్‌స్లామ్ చరిత్రలో ఇదే సుదీర్ఘ విరామం. అంతేకాదు... పెనెట్టా (49), బర్తోలి (47) తరువాత అత్యంత పెద్ద వయసులో గ్రాండ్‌స్లామ్ సాధించిన క్రీడాకారిణిగా నిలిచింది.

గాయాలు వేధించినా...

గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భుజం గాయంతో ఇబ్బంది పడిన కీస్, ఆ తరువాత తొడ కండరాల సమస్యతో వింబుల్డన్ నాలుగో రౌండ్ నుంచే నిష్క్రమించింది. ముఖ్యమైన టోర్నీల్లో గాయాలు వేధించినా, మధ్యలోనే తప్పుకోవాల్సిన పరిస్థితులు ఎదురైనా ఆమె దిగులు పడలేదు. అలాంటి క్లిష్ట సమయంలో భర్త అండతో... అతడి మార్గదర్శకత్వంలో గాయాల నుంచి కోలుకుంది. రెట్టించిన ఉత్సాహంతో తిరిగి బరిలోకి దిగింది. ఇప్పుడు టెన్నిస్ కోర్టులో పాదరసంలా కదులుతూ ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అత్యంత కీలక దశల్లో ఒత్తిడిని జయించి విజృంభిస్తోంది.

ఇల్లు శుభ్రంగా ఉండాలంటే...

ఇల్లు అద్దంలా మెరుస్తూ ఉండాలని అందరూ కోరుకుంటారు. ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవడమనేది నిరంతర ప్రక్రియ. ఇంట్లో గోడలు, తలుపులు, వస్తువులపై సాధారణంగా ఏర్పడే మరకలు ఇంటి అందాన్ని తగ్గిస్తుంటాయి. చిన్న చిట్కాలు పాటిస్తూ ఇంటిని ఆహ్లాదకరంగా ఎలా మార్చుకోవాలో తెలుసుకుందాం!

- వంటగదిలో స్టీల్ సింక్‌పైన, కుళాయిల చుట్టూ తెల్లని నీటి మరకలు ఏర్పడుతుంటాయి. వీటిని ఎంత రుద్ది కడిగినా పోవు. అలాంటప్పుడు ఒక చెంచా ఆలివ్ నూనెకి అరచెంచా ఉప్పు కలిపి ఈ మిశ్రమాన్ని మరకల మీద రాయాలి. గంటసేపు ఆరినతరవాత వేడినీళ్లతో కడిగేస్తే మరకలన్నీ పోతాయి.
- సాధారణంగా ఇంట్లో గోడలపై చిన్న పిల్లలు క్రేయాన్స్‌తో గీతలు గీస్తుంటారు. బొమ్మలు వేస్తుంటారు. వీటిని పోగొట్టడానికి చేసే ప్రయత్నాల వల్ల గోడలు పాడైపోతుంటాయి. అలాకాకుండా హెయిర్ డ్రైయర్‌తో వేడిగాలిని మరకలకు తగిలేలా చేయాలి. తరవాత సబ్బునీళ్లలో ముంచిన గుడ్డతో తుడిచేస్తే క్రేయాన్స్ మరకలతోపాటు చేతి గుర్తులు, ఇతర జిడ్డు మరకలు కూడా పోతాయి.
- ఓవెన్‌లో ఒక్కోసారి పదార్థాలు పడిపోతూ ఉంటాయి. లోపలి భాగం అంతా జిడ్డుగా మారుతుంది కూడా. అలాంటప్పుడు ఒక గిన్నెలో రెండు నిమ్మ చెక్కలు వేసి దాన్ని ఓవెన్‌లో పెట్టి అధిక ఉష్ణోగ్రత సెట్ చేసి అయిదు నిమిషాలు ఉంచాలి. తరవాత ఓ తడిగుడ్డతో లోపల తుడిచేస్తే చాలు. అలాగే.. ఓవెన్ తలుపు మీద కూడా చేతి గుర్తులు, ఇతర మరకలు ఏర్పడుతుంటాయి. ఒక చెంచా బేకింగ్ సోడాకు అర



చెంచా నీళ్లు కలిపి ఈ మిశ్రమాన్ని తలుపు మీద రాసి అరగంట తరవాత పొడిగుడ్డతో తుడిచేస్తే మరకలన్నీ పోయి ఓవెన్ తలుపు తళతళలాడుతుంది.

- వంట పూర్తయిన వెంటనే స్టవ్‌ను కాగితం లేదా పలుచని గుడ్డతో తుడిచేయాలి. దీనివల్ల స్టవ్ పరిశుభ్రంగా ఉండడమే కాకుండా ఎక్కువకాలం మన్నుతుంది. స్టవ్‌ను ఉంచిన గట్టును రెండు రోజులకోసారి సబ్బునీళ్లతో శుభ్రం చేయాలి.
- వాష్‌బేసిన్‌పై కూడా రకరకాల మరకలు ఏర్పడుతుంటాయి. వీటిపై టూత్‌పేస్ట్ రాసి అరగంట తరవాత నీళ్లతో తడిపిన స్పాంజ్‌తో తుడిచేస్తే చాలు.
- డ్రెస్సింగ్ మిర్రర్, కిటికీల అద్దాలను తరచూ కాగితంతో తుడవడం వల్ల అవి మెరుస్తుంటాయి. టీవీ స్క్రీన్, ఫ్రిజ్, సోఫాలను రోజుకు ఒకసారి పొడి గుడ్డతో తుడవాలి.
- ఇంట్లో ఉండే ఫ్యాన్‌లు, కిటికీలు, తలుపులను వారానికి ఒకసారి సబ్బునీళ్లతో శుభ్రం చేయాలి.
- బూజు, దుమ్ము, ధూళి లేకుండా ఇంటిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

సజ్జ రొట్టెలు మెత్తమెత్తగా...

సజ్జ పిండిలో జీర్ణవ్యవస్థకు హాని కలిగించే గ్లూటన్ ఉండదు. ఈ పిండి శరీరానికి వెచ్చదనాన్ని అందిస్తుంది. అందుకే సజ్జ రొట్టెలు తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. సజ్జ రొట్టెలు మెత్తగా రావాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం.

- స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి అరచెంచా ఉప్పు, ఒక చెంచా నెయ్యి వేసి అయిదు నిమిషాలు మరిగించి దించాలి. ఇందులో ఒక గ్లాసు సజ్జ పిండి వేసి మెల్లగా కలుపుతూ ముద్దలా చేయాలి. దీనిపై తడిగుడ్డ కప్పి పది నిమిషాలు నాననిస్తే పిండి ఉబ్బుతుంది. రొట్టెలు కూడా మెత్తగా వస్తాయి.
- సజ్జ పిండిని ఎక్కువసేపు కలపకూడదు. నీళ్లు కలిసి ముద్దలా అయితే చాలు. గోధుమపిండి మాదిరి ఒత్తుతూ కలిపితే సజ్జపిండి జిగురుగా మారుతుంది. రొట్టెలు చేయడం కష్టమవుతుంది.
- సజ్జ రొట్టెలను పలుచగా ఒత్తకూడదు. కొంచెం మందంగానే ఉండాలి. పొడి పిండి చల్లుకుంటూ పెద్దగా నొక్కకుండా తేలికగా ఒత్తాలి.
- స్టవ్ మీద ఇనప పెనం పెట్టి అది వేడెక్కాక సజ్జ రొట్టెను జాగ్రత్తగా వేయాలి. ఒకవైపు కాలిన తరవాతే రెండో వైపు తిప్పాలి.
- సజ్జ రొట్టెలు త్వరగా గట్టిపడతాయి. కాబట్టి ఎక్కువసేపు కాల్చకూడదు. రొట్టెమీద గోధుమ రంగుచుక్కలు కనిపించగానే రెండోవైపునకు తిప్పాలి. రెండు వైపులా దోరగా కాలిన తరవాత పళ్లెంలోకి తీసి కొద్దిగా నెయ్యి రాయాలి. రొట్టెలు ఆరిపోకుండా పలుచని గుడ్డ కప్పాలి. ఇలాచేస్తే చాలా సమయం వరకు రొట్టెలు మెత్తగా ఉంటాయి.



సైబర్ నేరాల్లో బ్యాంకు సిబ్బంది!

(మొదటిపేజీ తరువాయి)

డబ్బు దాచుకునేలా.. ఆ ఖాతాలనుంచి వేర్వేరు ఖాతాలకు బదిలీ చేయించుకునేలా అన్ని విధాలుగా సహకరిస్తున్నారు. ఇదంతా పెద్ద సంఖ్యలో సైబర్ నేరగాళ్ల అరెస్టు ద్వారా తేట తెల్లమైంది. తెలుగు రాష్ట్రాలు సహా గుజరాత్, కర్ణాటక, న్యూఢిల్లీ, యూపీ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బిహార్‌లో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించి 52 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. ఈ సైబర్ నేరగాళ్ల తెలంగాణలో 74 సైబర్ నేరాలు సహా దేశవ్యాప్తంగా 576 నేరాలకు పాల్పడి రూ.88.32 కోట్లు కొల్లగొట్టారని పోలీసులు తేల్చారు. ఒక్క హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే 33 సైబర్ నేరాలకు పాల్పడటం గమనార్హం. దర్యాప్తులో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న వేర్వేరు బ్యాంకులకు చెందిన నలుగురు ఉద్యోగులను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. ఈ నలుగురు నేపాల్, చైనాల్లోని ప్రధాన సైబర్ క్రిమినల్స్ ఖాతాలకు రూ.23కోట్లు తరలించినట్లు, దేశవ్యాప్తంగా 20 కేసుల్లో వీరి పాత్ర ఉన్నట్లు తేలింది. ఈ మేరకు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వివరాలు వెల్లడించారు. సైబర్ క్రిమినల్స్ వద్ద రూ.47.90 లక్షల నగదు, మరో రూ.40లక్షల విలువైన క్రిప్టో కరెన్సీ కలిపి మొత్తం రూ. 87.90లక్షలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నేరస్థుల ఖాతాల్లో రూ.2.87కోట్లు ఫ్రీజ్ చేశామన్నారు. ఈ నేరగాళ్ల నగరంలో చేసిన నేరాల్లో మూడు కేసులను వెల్లడించారు.

ఆ మూడు కేసులు ఇవీ..

హైదరాబాద్ గుడిమల్కాపూర్‌కు చెందిన ఓ ప్రముఖ వైద్యురాలు సైబర్ నేరగాళ్ల ముఠా బెదిరింపులకు భయపడి రూ.3 కోట్లు ఇచ్చుకుంది. వీడియో కాల్ చేసి మనీలాండరింగ్ కేసులో ఉన్నారని, డిజిటల్ అరెస్టు అయ్యారని ఆమెను బెదిరించారు. తమను తాము ఢిల్లీ క్రైం బ్రాంచ్ అధికారులమని చెప్పుకొన్నారు. బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బు మొత్తం ఆర్బీఐ చూపించిన ఖాతాల్లో జమ చేయాలని.. ఖాతాలన్నీ సక్రమంగా ఉన్నట్లు తేలితే డబ్బంతా తిరిగి జమచేస్తామని నమ్మించారు. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని.. లేదంటే భర్త, కుమారుడినీ అరెస్టు చేస్తామని హెచ్చరించారు. భయపడిపోయిన ఆమె, వారు సూచించిన ఖాతాల్లో రూ.3కోట్లు జమ చేసింది. ఆ తర్వాత అవలి వైపు వారు స్పందించకపోవడంతో మోసపోయానని గుర్తించి పోలీసులకు ఫోన్ చేసింది. ఈ మేరకు సాంకేతిక ఆధారాల ద్వారా గుజరాత్‌కు చెందిన సైబర్ ముఠాలో హరిపాల్ సింగ్, సయ్యద్ అజియుబ్ భాయ్‌ను అరెస్టు చేశారు. ఇక ట్రేడింగ్‌లో ఎక్కువ లాభాలొస్తాయంటూ నగరానికి చెందిన వ్యాపారి నుంచి రూ.2.06 కోట్లు కొల్లగొట్టిందో సైబర్ ముఠా. ఆ డబ్బును క్రిప్టో కరెన్సీగా దుబాయ్‌లో ఉన్న ప్రధాన నిందితులకు హవాలా రూపంలో పంపుతుంది. రంగంలోకి దిగిన పోలీసులు ఏపీ, తెలంగాణకు చెందిన ఐదుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో షాలిబండకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్, బహదూర్‌పురకు చెందిన మహ్మద్ జునైద్, మచిలీపట్నానికి చెందిన మాగంటి జయకిరణ్ ఉన్నారు. వారు నిర్వహిస్తున్న మ్యూల్ బ్యాంకు ఖాతాల్లో రూ.47.50లక్షల నగదు, రూ. 40లక్షల విలువైన క్రిప్టో కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. 33 చెక్‌బుక్స్, 26 డెబిట్ కార్డులు, రెండు ల్యాప్‌టాప్‌లను సీజ్ చేశారు.

సహకరించిన బ్యాంకు ఉద్యోగులు వీరే..

సీపీ వెల్లడించిన రెండో కేసు ఛేదించే క్రమంలో ఒక బ్యాంకు ఉద్యోగి ప్రమేయం, మూడో కేసు ఛేదించే క్రమంలో ముగ్గురు బ్యాంకు ఉద్యోగుల ప్రమేయం ఉన్నట్లు తేలింది. రూ.2.06 కోట్లను నగరానికి చెందిన ఓ వ్యాపారి నుంచి కొల్లగొట్టిన కేసు దర్యాప్తులో ఏపీలోని గుంటూరు జిల్లా ముప్పాళ్ల జేఎస్టీయూ కొటక్ మహీంద్రా బ్రాంచీలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న కాటా శ్రీనివాసరావును అరెస్టు చేశారు. ఇతడు.. దుబాయ్‌లో ఉండే సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలను సృష్టించి.. కోట్లలో అక్రమలావాదేవీలు జరగేందుకు సహకరించాడని నిర్ధారించారు. ఈ కేసులో అరెస్టయిన వారిలో ఏపీలోని పశ్చిమ గోదావరికి చెందిన రెడ్డి ప్రవీణ్ అనే వ్యక్తి కూడా ఉన్నాడు. ఇక మూడో కేసులో.. ట్రేడింగ్‌లో భారీ లాభాలొస్తాయని నమ్మించి నగరానికి చెందిన ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.93 లక్షలు కొల్లగొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులకు నేరంలో ముగ్గురు బ్యాంకు అధికారులూ ఉన్నట్లుగా తెలిసింది. ఇష్టానుసారంగా మ్యూల్ ఖాతాలకు సహకరించి, వారి వద్ద రూ.లక్షల్లో డబ్బులు దండుకుంటూ.. కొంత డబ్బును బ్యాంకు అధికారులే ఇతర ఖాతాలకు మళ్లిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు బెంగళూరులో ఆర్బీఎల్ బ్యాంకు విద్యారణ్యపుర బ్రాంచి డిప్యూటీ మేనేజర్ శుభం కుమార్ ఝా, బెంగళూరు యాక్సిస్ బ్యాంకు మల్లేశ్వరం బ్రాంచి అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ హరూన్ రషీద్ ఇమాముద్దీన్, మరో బ్యాంకు ఉద్యోగి మోహన్‌ను అరెస్టు చేశారు. వీరు బ్యాంకు ఖాతాలు తెరచి వాటి క్రెడెన్షియల్స్‌ను నేపాల్, చైనాలో ఉంటున్న ప్రధాన నేరగాళ్లకు చేరవేసి రూ.లక్షల్లో కమీషన్ తీసుకున్నారు. ప్రతి లావాదేవీకి 5-10శాతం కమీషన్ తీసుకున్నట్లు పోలీసులు తేల్చారు.



సైబర్ నేరగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను పరిశీలిస్తున్న సీపీ సీవీ ఆనంద్

క్రిమినల్స్‌కు సహకరిస్తే అరెస్టులే

సైబర్ నేరగాళ్లకు ప్రత్యక్షంగాను పరోక్షంగానూ కొందరు బ్యాంకు ఉద్యోగులు సహకరిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలడంతో సైబర్ సెక్యూరిటీ బ్యూరో బ్యాంకర్లకు కొన్ని సూచనలు చేసింది. సైబర్ క్రైం కేసుల్లో బ్యాంకు సిబ్బంది పాత్ర ఏ మాత్రం ఉన్నా అరెస్టులు తప్పవని హెచ్చరించింది. పెద్ద మొత్తంలో డబ్బు జమ చేసే వీలున్న కరెంటు ఖాతాల రూపంలోనే మ్యూల్ ఖాతాలు తెరుస్తున్నారు. ఏదైనా బ్యాంకులో కరెంట్ ఖాతా తెరవాలంటే జీఎస్టీఎన్ నంబర్, కంపెనీ అయితే రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ (ఆర్వోసీ) నంబర్ తప్పని సరి. ఈ వివరాలను బ్యాంకు సిబ్బంది వ్యక్తిగతంగా తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు సైబర్ ఫ్రాడ్స్‌లో బయటపడ్డ ఖాతాల్లో చాలావరకు బ్యాంక్ సిబ్బంది సహకారంతోనే ఫేక్ ఖాతాలు ఓపెన్ అయినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. దీంతో కొత్త కరెంట్ ఖాతాల విషయంలో బ్యాంకర్లు తొందర పడొద్దని సూచించారు. కాగా మంగళవారం వివిధ బ్యాంకుల ప్రధానాధికారులతో సమావేశం నిర్వహించినట్లు సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. సైబర్ క్రిమినల్స్‌కు సహకరించే ఉద్యోగులు ప్రతి బ్యాంకులోనూ ఉన్నారని అధికారులు ఒప్పుకొన్నారని తెలిపారు. సిబ్బందిలో కొందరు సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి, తప్పుడు పత్రాలతో ఖాతాలు సృష్టించి.. అందులో జరిగే ప్రతి లావాదేవీకి కమీషన్ తీసుకుంటున్నట్లు అధికారులు అంగీకరించారని చెప్పారు. ఇకపై ఇలాంటి సిబ్బందిని ఉపేక్షించేది లేదని.. అరెస్టు చేసి కటకటాల్లోకి నెడతామని సీపీ హెచ్చరించారు.

చిత్రజ్యోతి
SINCE 1965

'ఇంకా మేము బ్యాచిలర్సే'



సందీప్ కిషన్ కథానాయకుడిగా నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మజాకా'. రీతూ వర్మ కథానాయిక. రావు రమేశ్, అన్షు కీలకపాత్రలు పోషిస్తున్నారు. రాజేశ్ దండ, ఉమేశ్ కేఆర్ బన్సల్ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 21న విడుదలవుతోంది. తొలిగీతాన్ని చిత్ర బృందం బుధవారం విడుదల చేసింది. 'ఇంకా మేము బ్యాచిలర్సే' అంటూ హీరో తన ప్రేమ కోసం పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ సరదాగా సాగే ఈ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, ధనుంజయ్ సీపాన ఆలపించారు. లియోన్ జేమ్స్ స్వరపరిచారు.



నేటి సమాజంలో 'ప్రేమిస్తావా'

ఆకాశ్ మురళి, అదితి శంకర్ జంటగా విష్ణువర్ధన్ తెరకెక్కించిన చిత్రం 'ప్రేమిస్తావా'. తమిళంలో 'నేసిప్పాయా' పేరుతో విడుదలై చక్కటి ప్రజాదరణ పొందింది. ఈ గురువారం మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ తెలుగులో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ, గొడవల నేపథ్యంలో సాగిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ 'నేటి సమాజంలో ప్రేమలు, అనుబంధాలు ఎలా ఉన్నాయనేది ఈ సినిమా చూపిస్తుంది. అదితి, ఆకాశ్ చక్కగా నటించారు' అని అన్నారు. 'ఇది నా ఫస్ట్ లవ్‌స్టోరీ. లవ్, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అదితి చెప్పారు. విష్ణువర్ధన్ స్టైలిష్ మేకింగ్ ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ అని ఆకాశ్ మురళి చెప్పారు.



డాక్టర్ మోహన్‌బాబు, ఆయన తనయుడు విష్ణు 'కన్నప్ప' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను సందర్శిస్తున్నారు. ఆ క్రమంలో బుధవారం గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌ను కలిశారు. 'కన్నప్ప' చిత్ర విశేషాలను భూపేంద్ర పటేల్ వారి నుంచి అడిగి తెలుసుకున్నారు.



ఒకే టైటిల్.. రెండు చిత్రాలు

గతంలో హిట్ అయిన సినిమా టైటిల్‌ను రిపీట్ చేస్తూ సినిమాలు రావడం జరుగుతున్నదే. అయితే ఇద్దరు హీరోలు నటించిన వేర్వేరు చిత్రాలకు ఒకే టైటిల్ పెట్టడం, ఒకే రోజు కొన్ని గంటల వ్యవధిలో ఆ రెండు చిత్రాల టైటిల్స్ అనౌన్స్ చేయడం తమిళ చిత్ర పరిశ్రమలో ఇప్పుడు చర్చనీయాంశం అయింది. విజయ్ ఆంటోనీ హీరోగా అరుణ్ ప్రభు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'శక్తి తిరుమగన్' అని తమిళ్‌లో.. తెలుగులో 'పరాశక్తి' అని టైటిల్ పెట్టినట్లు ప్రకటించారు. ఇది ఆయనకు 25వ చిత్రం కావడం గమనార్హం. శివకార్తికేయన్ హీరోగా సుధా కొంగర దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు కూడా 'పరాశక్తి' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. శివ కార్తికేయన్‌కు కూడా ఇది 25వ చిత్రమే. 73 ఏళ్ల క్రితం ఏవీఎం సంస్థ 'పరాశక్తి' పేరుతో ఓ చిత్రం నిర్మించింది. వారి అనుమతితో శివ కార్తికేయన్ హీరోగా నిర్మిస్తున్న చిత్రానికి 'పరాశక్తి' టైటిల్‌ను పెట్టినట్లు చిత్ర నిర్మాణ సంస్థ డాన్ పిక్చర్స్ వెల్లడించింది. మరో వైపు విజయ్ ఆంటోనీ తన చిత్రానికి 'పరాశక్తి' అనే టైటిల్‌ను సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్‌లో రిజిస్టర్ చేశారు. ఇప్పుడు వీరిద్దరిలో ఎవరు వెనక్కి తగ్గుతారో వేచి చూడాలి.



మార్చిలో మొదలు


వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. 'వీడీ 15' అనేది వర్కింగ్ టైటిల్. యువీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇండో-కొరియన్ హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కుతోంది. మార్చి మొదటివారం నుంచి ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించనున్నట్లు యూనిట్ బుధవారం తెలిపింది. ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రస్తుతం వియత్నాంలో జరుగుతోంది. వినూత్నమైన కథతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతున్నామని, వరుణ్‌తేజ్ ఇప్పటివరకూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని మేకర్స్ చెప్పారు. 'వీడీ 15'కు తమన్ సంగీతం అందిస్తున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

అలాంటి వాళ్లంటే నాకిష్టం

- రష్మిక



పుష్ప-2తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన రష్మిక మందన్నా తాజా బాలీవుడ్ చిత్రం 'ఛావా'తో అభిమానులను పలకరించబోతున్నారు. తన కాలికి అయిన గాయాన్ని సైతం లెక్క చేయకుండా ఇటీవల మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి హాజరయ్యారు. 'ఛావా' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ఈ బ్యూటీ తాజా ఇంటర్వ్యూలో తన రిలేషన్‌షిప్‌పై ఓపెన్ అయ్యారు. ఇల్లే తనకు అత్యంత సంతోషకరమైన ప్రదేశమని, జీవితంలో గెలుపు అనేది వస్తూ, పోతూ ఉంటుందని, కానీ ఇల్లు ఎప్పటికీ శాశ్వతమని అన్నారు. రిలేషన్‌షిప్‌పై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ 'ఒక వ్యక్తి పట్ల ఆకర్షణ విషయానికొస్తే తన కళ్లే ప్రధానమని నేను నమ్ముతా. అంతేకాదు ఎప్పుడూ నవ్వుతూ ఉండాలి. స్మైలీ ఫేస్‌తోపాటు తన చుట్టూ ఉన్నవారిని గౌరవించే వాళ్లంటే నాకిష్టం' అని బదులిచ్చారు. కాగా, కొన్నేళ్లుగా టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండతో రష్మిక రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అలాగే ఓ ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ తాను రిలేషన్‌షిప్‌లో ఉన్న విషయాన్ని తెలిపారు. అయితే ఎవరనేది వెల్లడించలేదు. సరైన సమయం వచ్చినప్పుడు ఆ వివరాలను వెల్లడిస్తానని అన్నారు.



రెగ్యులర్ షూట్ అప్పటి నుంచే!

దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రం ఇటీవలే ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇందులో కథానాయికగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు. డాక్టర్. కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో టెస్ట్ షూట్ జరుగుతోంది. వచ్చే నెల నుంచి ఆఫ్రికాలోని కెన్యాలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవ్వనున్నట్లు తెలిసింది. దాదాపు రూ.వెయ్యి కోట్ల భారీ బడ్జెట్‌తో రెండు భాగాలుగా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగాన్ని 2027లో.. రెండవ భాగాన్ని 2029లో విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. 'గరుడ' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. కాగా, అమెజాన్ అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వంచర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఎటువంటి విషయాలు బయటకు రాకుండా చిత్రబృందానికి గట్టి హెచ్చరికలు జారీచేశారట రాజమౌళి. ఈ మేరకు చిత్రబృందం కొన్ని కఠిన నియమాలను పాటిస్తోంది. ఇందులో భాగంగా సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణులతో నాన్- డిస్‌క్లోస్ అగ్రిమెంట్‌ను మేకర్స్ కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈ ఒప్పందం ప్రకారం ఈ చిత్రానికి సంబంధించి ఏ చిన్న విషయం లీక్ చేసినా, సదరు వ్యక్తులు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది.



యువతి ప్రతీకారం

వందకుపైగా సినిమాలకు స్టిల్ ఫొటోగ్రాఫర్‌గా పని చేసిన ధర్మ ఇప్పుడు నిర్మాతగా మారి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'సంహారం' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఆదిత్య, కవిత మహతో హీరోహీరోయిన్లుగా నటించారు. ఇంతవరకూ 44 చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించిన సాకేత్ సాయిరామ్ ఈ సినిమాలో విలన్‌గా నటించడం విశేషం. చిత్రానికి సంగీత దర్శకుడు కూడా ఆయనే. తనకు, తన అక్కకు అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు ఓ యువతి తను నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్‌తో దుష్ట సంహారం ఎలా జరిపిందన్నదే ఈ చిత్రకథ అని ధర్మ చెప్పారు.

వేట మొదలైంది



కలియుగంలో పరమశివుని భక్తుడైన మార్కండేయునికి ఎన్నో కష్టాలు ఎదురయ్యాయి, వాటిని శివుని అనుగ్రహంతో ఎలా అధిగమించాడు అనే కాల్పనిక కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'రాజా మార్కండేయ'. 'వేట మొదలైంది' అనేది ఉపశీర్షిక. తేజస్ వీరమాచినేని, రోమీ జంటగా నటించారు. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని ఇటీవలే యూనిట్ నిర్వహించింది. నటుడు సుమన్, నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ చేతుల మీదుగా ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ చిత్రంలో శివయ్య పాట అద్భుతంగా ఉంటుంది, ప్రతి దేవాలయంలో ఈ పాట మార్మోగుతోంది అని నిర్మాత తెలిపారు. వినోదంతో పాటు సందేశం ఉన్న చిత్రమిదని దర్శకుడు చెప్పారు. బన్నీ అశ్వంత్ దర్శకత్వంలో సామా శ్రీధర్, పంజాల వెంకట్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

బిజినెస్

వరంగల్ ● గురువారం 30 జనవరి 2025

కీలక ఖనిజాల మిషన్‌కు రూ.34,300 కోట్లు

కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర..పీఎస్‌యూల నుంచి రూ.18,000 కోట్లు

న్యూఢిల్లీ: జాతీయ ప్రాధాన్యత ఉన్న అరుదైన రాగి, లిథియం, నికెల్, కోబాల్ట్ వంటి 24 కీలక ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం జాతీయ కీలక ఖనిజాల మిషన్ (ఎన్‌సీఎం) పేరుతో ప్రత్యేక జాతీయ మిషన్ ఏర్పాటు చేసింది. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ కీలక ఖనిజాల దిగుమతులను తగ్గించి, స్వయం సమృద్ధి సాధించేందుకు ఈ విషన్ ద్వారా వచ్చే ఏడేళ్లలో రూ.34,300 కోట్లు ఖర్చు చేయనున్నట్టు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. ఇందులో రూ.18,000 కోట్లు ప్రభుత్వ రంగ సంస్థలు, రూ.16,300 కోట్లు ప్రైవేటు సంస్థలు పెట్టుబడులు పెడతాయన్నారు.



ఎందుకంటే ?

ప్రస్తుతం దేశంలో నడుస్తున్న వాహనాల్లో దాదాపు 90 శాతం పెట్రోల్, డీజిల్ వంటి శిలాజ ఇంధనాలతో నడుస్తూ, పెద్ద ఎత్తున పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. విద్యుత్ వాహనాల ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. అయితే ఈ వాహనాలకు అవసరమైన బ్యాటరీలతో పాటు పవన విద్యుత్ కేంద్రాల టర్బైన్లు, విద్యుత్ పరికరాలు, సరఫరాల్లోనూ ఈ ఖనిజాలది కీలక పాత్ర. ప్రస్తుతం మన దేశంలో ఈ ఖనిజ నిక్షేపాలు, నిల్వలు చాలా తక్కువ. ఈ సమస్యను అధిగమించేందుకు దేశ, విదేశాల్లో ఈ ఖనిజాల అన్వేషణ, ప్రాసెసింగ్, ఉత్పత్తి, రీసైక్లింగ్ వరకు అన్ని స్థాయిల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం ఈ మిషన్ ప్రారంభించింది. విదేశాల్లో ఈ తరహా ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తికి ముందుకు వచ్చే దేశీయ కంపెనీలకు కూడా ప్రభుత్వం సహాయ పడుతుందని వైష్ణవ్ చెప్పారు.

ఫెడ్ రేట్లు యథాతథం

న్యూయార్క్: అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జీరోమ్ పావెల్ అధ్యక్షతన రెండ్రోజులపాటు సమావేశమైన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌ఓఎంసీ) బుధవారం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. అమెరికా మార్కెట్లో ధరలు ఆశించిన స్థాయిలో తగ్గకపోవంతో ఎఫ్‌ఓఎంసీ ఈసారి వడ్డీ రేట్ల విషయంలో కఠిన వైఖరినే ప్రదర్శించవచ్చని మార్కెట్ వర్గాలు ముందుగానే అంచనా వేశాయి. దీంతో ఫెడరల్ ఫండ్స్ రేట్ల శ్రేణి మరికొంత కాలం 4.25-4.50 శాతంగా కొనసాగనుంది. అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఈనెల 20న బాధ్యతలు చేపట్టాక ఎఫ్‌ఓఎంసీ నిర్వహించిన తొలి ద్రవ్యపరపతి సమీక్ష ఇది. గత ఏడాది సెప్టెంబరు-డిసెంబరు మధ్యకాలంలో ఫెడ్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను వరుసగా మూడు విడతల్లో మొత్తం 1 శాతం (100 బేసిస్ పాయింట్లు) తగ్గించింది. ఈ ఏడాదిలో మాత్రం ఒకటి లేదా రెండు విడతలకు మించి తగ్గించకపోవచ్చని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇస్రోకు ఏటీఎల్, ఎంటార్ కీలక పరికరాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బుధవారం మన దేశం ప్రతిష్ఠాత్మకంగా ప్రయోగించిన ఎన్‌వీఎస్-02 ఉపగ్రహ విజయంలో హైదరాబాద్‌కు చెందిన అనంత్ టెక్నాలజీస్, ఎంటార్ టెక్నాలజీస్ కీలక పాత్ర పోషించాయి. ఇస్రో 100వ ఉపగ్రహ ప్రయోగం ఒక చారిత్రక విజయమని, ఆ విజయంలో తాము కూడా భాగస్వాములు కావడం ఆనందదాయకమని రెండు సంస్థలు ప్రకటించాయి. ఈ రెండు సంస్థలు ఎన్‌వీఎస్-02 ఉపగ్రహానికి, జీఎస్‌ఎల్‌వీ ఎఫ్ 15 రాకెట్‌కు కీలకమైన భాగాలు సరఫరా చేశాయి.

అనంత్ టెక్నాలజీస్: ఈ సంస్థ ఎన్‌వీఎస్-02 ఉపగ్రహానికి ఆల్టిట్యూడ్, ఆర్బిట్ కంట్రోల్ ఎలక్ట్రానిక్స్, డీసీ-డీసీ కన్వర్టర్‌తో కూడిన స్టార్ సెన్సర్ మార్క్-3 సరఫరా చేసింది. అలాగే జీఎస్‌ఎల్‌వీ ఎఫ్ 15 రాకెట్‌కు డేటా ఎక్విజిషన్ యూనిట్లు, ట్రాన్స్‌పోండర్లు, పవర్ మాడ్యూల్స్, రిలే యూనిట్లు, కంట్రోల్ మాడ్యూళ్ల సహా 40 కీలక వ్యవస్థలు సరఫరా చేసినట్టు కంపెనీ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు తెలిపారు. తమ సంస్థ ఇప్పటివరకు 103 ఉపగ్రహాలు, 83 ప్రయోగవాహక రాకెట్లకు కీలక భాగాలు సమకూర్చి ఇస్రో విజయాల్లో కీలక పాత్ర పోషించిందన్నారు.

ఎంటార్ టెక్నాలజీస్: ప్రెసిషన్ ఇంజనీరింగ్‌లో అందె వేసిన చేయిగా పేరొందిన ఎంటార్ టెక్నాలజీస్ జీఎస్‌ఎల్‌వీ రాకెట్‌కు వికాస్ ఇంజిన్లు, క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ వ్యవస్థలు, ఎలక్ట్రో న్యూమాటిక్ మాడ్యూల్స్ సరఫరా చేసినట్టు కంపెనీ ఎండీ పర్వత్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పరికరాలన్నీ రాకెట్ స్థిరత్వానికి, నిలకడగా పని చేయడానికి కీలకంగా నిలిచాయని తెలిపారు. దేశీయంగా ఉత్పత్తి చేసిన పరికరాలతో పాటు విదేశాల నుంచి సేకరించిన ఆటమిక్ గడియారాలు కచ్చితమైన కాలాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడ్డాయన్నారు.

మైండ్‌స్పేస్ రీట్ చేతికి సస్టెయిన్ ప్రాపర్టీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రియల్టీ రంగంలోని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)హైదరాబాద్‌లో సస్టెయిన్ ప్రాపర్టీస్ కంపెనీని కొనుగోలు చేసింది. ఈ సంస్థ చేతిలో 18.2 లక్షల కార్యాలయ స్థలం అందుబాటులో ఉంది. ఈ డీల్ ఎంటర్‌ప్రైజ్ విలువ రూ.2038 కోట్లు కాగా ఈక్విటీ విలువ రూ.613 కోట్లని మైండ్ స్పేస్ రీట్ రెగ్యులేటరీ సంస్థలకు పంపిన ప్రకటనలో తెలిపింది. సస్టెయిన్ ప్రాపర్టీస్‌లో నూరు శాతం వాటాల కొనుగోలుకు తాము కుదుర్చుకున్న ఈ డీల్ మార్చి నాటికి పూర్తవుతుందని భావిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లోని 'కామర్‌జోన్, రాయదుర్గ్'లో క్వాల్‌కామ్ కంపెనీకి లీజుకిచ్చిన ఈ కార్యాలయ స్థలాన్ని కొనుగోలు చేయడానికి తమ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపినట్టు ఆ ప్రకటనలో వెల్లడించింది. ఇందుకుగాను సస్టెయిన్ ప్రాపర్టీస్ వాటాదారులకు రూ.379.08 యూనిట్ విలువతో 1,61,68,090 మైండ్‌స్పేస్ రీట్ యూనిట్లు ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన కేటాయించేందుకు బోర్డు ఆమోదించిందని పేర్కొంది. ఇందుకోసం కంపెనీ రూ.1400 కోట్ల రుణం సమీకరిస్తోంది.

టాప్ గేర్‌లో మారుతి

క్యూ3లో రూ.3,727 కోట్ల నికర లాభం

న్యూఢిల్లీ: మారుతి సుజుకీ సంస్థ వర్తమాన ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.38,764 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.3,727 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం, నికర లాభం 16 శాతం చొప్పున పెరిగాయి. ఏకీకృత (స్టాండ్ అలోన్) ప్రాతిపదికన క్యూ3లో కంపెనీ ఆదాయం గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.31,860 కోట్ల నుంచి రూ.36,802 కోట్లకు చేరింది. నికర లాభం రూ.3,130 కోట్ల నుంచి రూ.3,525 కోట్లకు చేరింది.

తొమ్మిది నెలలకు: డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో మారుతి నికర అమ్మకాలు రూ.98,240 కోట్ల నుంచి రూ.1,06,266 కోట్లకు పెరిగాయి. ఇదే సమయంలో కంపెనీ నికర లాభం రూ.9,331 కోట్ల నుంచి రూ.10,244 కోట్లకు చేరింది.

వాహన అమ్మకాలూ అదుర్స్ : డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో కంపెనీ 5,66,213 వాహనాలు విక్రయించింది. 2023 డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఇది 13 శాతం ఎక్కువ. ఇందులో 4,66,993 వాహనాలను దేశీయ మార్కెట్‌లో, 99,220 వాహనాలను విదేశీ మార్కెట్ల విక్రయించింది. గతంలో ఏ ఒక్క త్రైమాసికంలోనూ కంపెనీ ఇన్ని వాహనాలను ఎగుమతి చేయలేదు. డిసెంబరు, 24తో ముగిసిన తొమ్మిది నెలలను పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ వాహన అమ్మకాలు, డిసెంబరు, 23తో పోలిస్తే ఐదు శాతం వృద్ధితో 16,29,631 యూనిట్లకు చేరాయి. మళ్లీ ఇందులో 13,82,135 వాహనాలను దేశీయ మార్కెట్‌లో, 2,47,496 వాహనాలను విదేశాలకు ఎగుమతి చేసింది.

మళ్లీ టకెయుచీనే ఎండీ, సీఈఓ

హిసాషి టకెయుచిని మరో మూడేళ్ల పాటు కంపెనీ ఎండీ, సీఈఓగా నియమించేందుకు బుధవారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం ఆమోదం తెలిపింది. సుజుకీ మోటార్ గుజరాత్ కంపెనీని మారుతి సుజుకీ ఇండియాలో విలీనం చేసే తీర్మానానికి కూడా ఆమోదం తెలిపింది.

టాటా మోటార్స్ లాభంలో క్షీణత

న్యూఢిల్లీ: డిసెంబరు త్రైమాసికంలో టాటా మోటార్స్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,13,575 కోట్ల ఆదాయంపై రూ.5,578 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం రూ.2,998 కోట్లు పెరిగినా, నికర లాభం మాత్రం 22 శాతం పడిపోయింది. ఖర్చులు రూ.1,04,494 కోట్ల నుంచి రూ.1,07,627 కోట్లకు పెరగడం మూడో త్రైమాసికంలో టాటా మోటార్స్ లాభాలకు గండి కొట్టింది. ప్రయాణికుల వాహన అమ్మకాల ఆదాయం 4.3 శాతం, వాణిజ్య వాహనాల అమ్మకాల ఆదాయం 8.4 శాతం పడిపోవడం కంపెనీ లాభాలను దెబ్బతీసింది. ఇదే సమయంలో జాగ్వార్ లాండ్ రోవర్ ఆదాయం రికార్డు స్థాయిలో 750 కోట్ల పౌండ్లకు చేరినా పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) నాలుగో త్రైమాసికంలో వాణిజ్య వాహనాల అమ్మకాలు పుంజుకుంటాయని ఆశిస్తున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీశ్ వాఘ్ చెప్పారు.

పసిడి కొత్త రికార్డు

రూ.83,750కి చేరిన తులం ధర



న్యూఢిల్లీ: దేశీయంగా బంగారం ధరలు సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయికి పెరిగాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములపై రూ.910 పెరుగుదలతో రూ.83,750కి చేరుకుంది. 99.5 స్వచ్ఛత లోహం సైతం అదే స్థాయిలో పెరిగి రూ.83,350 స్థాయికి ఎగబాకింది. అంతర్జాతీయంగా బంగారం రేటు పెరగడంతో పాటు దేశీయంగా ఆభరణాల తయారీదారులు, రిటైలర్లు కొనుగోళ్ల పెంచడం ఇందుకు కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. కాగా, కిలో వెండి రూ.1,000 పెరుగుదలతో రూ.93,000 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 2,794.70 డాలర్ల స్థాయికి ఎగబాకగా.. వెండి 30.99 డాలర్ల వద్ద ట్రేడైంది.

631 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో మదుపరులు ఐటీ, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్ రంగ షేర్లలో కొనుగోళ్లు జరపడంతో ఈక్విటీ సూచీలు బుధవారం ఒక శాతం మేర పెరిగాయి. సెన్సెక్స్ 631.55 పాయింట్ల లాభంతో 76,532.96 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 205.85 పాయింట్ల వృద్ధితో 23,163.10 వద్ద స్థిరపడింది. జొమాటో షేరు 6.79 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

- బుధవారం లిస్టింగ్ అయిన డెంటా వాటర్ అండ్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ లిమిటెడ్ షేరు ఐపీఓ ధర రూ.294తో పోలిస్తే 17.84 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.346.45 వద్ద తొలిరోజు ట్రేడింగ్‌ను ముగించింది.
- డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్ ఐపీఓకు తొలిరోజు కేవలం 7 శాతం సబ్‌స్క్రిప్షన్ లభించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	82,850 ▲	75,950 ▲	1,04,000 ▲
విజయవాడ	83,500 ▲	78,500 ▲	93,500 ▲
విశాఖపట్నం	80,840 ▲	74,100 ▲	91,680 ▲
రాజమండ్రి	82,850 ▲	75,950 ▲	92,600 ▼
ప్రొద్దుటూరు	82,200 ▲	76,120 ▲	93,000 ▲
ముంబై	80,980 ▲	74,170 ▲	90,680 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	500
వరంగల్	482	గోదావరి	490
చిత్తూరు	553	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	109	విజయవాడ	120
వరంగల్	109	గుంటూరు	118
కరీంనగర్	109	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	97
కర్నూలు	109	నెల్లూరు	102
విశాఖపట్నం	112	అనంతపురం	102
గోదావరి	120		

స్పోర్ట్స్

మహిళల 400 మీ. కోచ్‌గా జెర్రీ లీ



న్యూఢిల్లీ : జెర్రీ లీ హోనెస్..జమైకాకు చెందిన ప్రఖ్యాత అథ్లెటిక్ కోచ్. ఎలాని థాంప్సన్, నెస్టా కార్టర్ వంటి ఒలింపిక్ చాంపియన్లకు మార్గదర్శనం చేశాడు. అలాంటి జెర్రీ..భారత మహిళల 400 మీటర్ల జట్టుకు కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఈ మేరకు తిరువనంతపురంలోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అతడు బాధ్యతలు స్వీకరించాడు. 400 మీ. పరుగుతోపాటు 400 మీ. హర్డిల్స్ జట్టుకూ శిక్షణ ఇస్తాడు.

శ్రీకాంత్ శుభారంభం

పటుమ్మాన్ (థాయ్‌లాండ్): కిడాంబి శ్రీకాంత్ థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-13, 21-18తో దుబోవెంకో (ఇజ్రాయిల్)పై గెలిచి, ముందంజ వేశాడు. ఇతర మ్యాచ్‌ల్లో సుబ్రమణియన్ విజయం సాధించగా ఆయూష్ షెట్టి, మిథున్ మంజునాథ్ ఓటమి పాలయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్విక శివాని-రోహన్ కపూర్ జోడీ 21-8, 21-16తో సరాత్ చుబోకా-ఫక్తరుంగ్ (థాయ్‌లాండ్) జంటపై నెగ్గింది.

ఆసీస్‌కు లంక షాక్

- అండర్-19 టీ20 వరల్డ్ కప్

బంగి (మలేసియా) : అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియా వరుస విజయాలకు శ్రీలంక చెక్ పెట్టింది. బుధవారం జరిగిన గ్రూప్-1 సూపర్ సిక్స్ మ్యాచ్‌లో శ్రీలంక 12 పరుగులతో ఆస్ట్రేలియాను కంగుతినిపించింది. తద్వారా టోర్నమెంట్‌ను లంక మహిళలు విజయంతో ముగించారు. అయితే ఆస్ట్రేలియా జట్టు ఇప్పటికే సెమీఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే. ఇక..మ్యాచ్‌లో తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 99/8 స్కోరు చేసింది. ఛేదనలో ఆసీస్ 20 ఓవర్లలో 87/8కే పరిమితమైంది. ప్రబోధ, ప్రముది, అసేని తలా రెండేసి వికెట్లు తీశారు. లంక దిగ్గజ ఆటగాడు తిలకరత్నే దిల్షాన్ కుమార్తె లిమాన్స తిలకరత్నకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ మ్యాచ్‌లో ఆమె ఓ వికెట్ తీయడంతోపాటు ఓ రనౌట్, ఇంకో క్యాచ్‌ను కూడా అందుకుంది. ఇక మరో గ్రూప్-2 సూపర్ సిక్స్ మ్యాచ్‌లో నైజీరియా ఆరు పరుగులతో ఐర్లాండ్‌పై నెగ్గింది. ఇక..శుక్రవారం జరిగే సెమీఫైనల్లో భారత్-ఇంగ్లండ్, ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా తలపడతాయి.

అర్జున్ పాయింట్ పంచుకున్నాడు!

విజాన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ టోర్నీలో గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి మరో గేమునూ డ్రా చేసుకున్నాడు. విన్సెంట్ కీమర్ (జర్మనీ)తో బుధవారం జరిగిన పదోరౌండ్ గేమ్‌లో 38 ఎత్తుల అనంతరం పాయింట్ పంచుకున్నాడు. అర్జున్‌కిది వరుసగా మూడో డ్రా. ఇక వార్మెర్డామ్‌పై గెలుపొందిన గుకేష్ 7.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఫెడొసీవ్‌పై ప్రజ్ఞానంద విజయం సాధించాడు. అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో భారత ఆటగాడు మెండోకా గేమ్ కూడా ఫలితం లేకుండా ముగిసింది.

తిలక్ @ 2

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్



వరుణ్ చక్రవర్తి



తిలక్ వర్మ

దుబాయ్ : టీమిండియా యువ సంచలనం తిలక్ వర్మ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి దూసుకొచ్చాడు. ఇక మిస్టర్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఏకంగా 25 స్థానాలు ఎగబాకాడు. హైదరాబాద్ బ్యాటర్ తిలక్..ఇంగ్లండ్‌తో ప్రస్తుత టీ20 సిరీస్ రెండో మ్యాచ్‌లో (72 నాటౌట్) అదరగొట్టాడు. దాంతో బుధవారంనాటి తాజా ర్యాంకింగ్స్‌లో అతడు 832 పాయింట్లతో రెండో స్థానం కైవసం చేసుకున్నాడు. ఆస్ట్రేలియా బ్యాటర్ హెడ్ (855) కేవలం 23 పాయింట్ల ఆధిక్యంతో టాప్‌లో నిలిచాడు. తిలక్ తాజా ఫామ్‌ను బట్టిచూస్తే..రాబోయే ర్యాంకుల్లో అతడు టాప్‌నకు చేరే అవకాశాలు లేకపోలేదు. అదే జరిగితే పిన్న వయస్సులో 'టాపర్'గా నిలిచిన రికార్డు కూడా వర్మ (22 ఏళ్లు)కు లభిస్తుంది. ప్రస్తుతం ఈ రికార్డు బాబర్ ఆజమ్ (23 ఏళ్ల 105 రోజులు) పేరిట ఉంది. తాజా రేటింగ్ పాయింట్లతో తిలక్..అత్యధిక పాయింట్లు పొందిన నాలుగో భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఇంతకుముందు సూర్యకుమార్, విరాట్, కేఎల్ రాహుల్ ఈ జాబితాలో ఉన్నారు. ఇంగ్లండ్‌తో మూడో టీ20లో (5/24) ఐదు వికెట్లతో అదరగొట్టిన వరుణ్ చక్రవర్తి (666 పాయింట్లు) ఐదో ర్యాంక్‌కు చేరాడు.

ధీనిధికి మూడు స్వర్ణాలు



హల్ద్‌వాని: జాతీయ క్రీడల్లో 14 ఏళ్ల పారిస్ ఒలింపిక్ స్విమ్మర్ ధీనిధి దేశింగు మూడు స్వర్ణాలతో ప్రకంపనలు సృష్టించింది. మరో పారిస్ ఒలింపియన్ శ్రీహరి నటరాజ్ కూడా రెండు పసిడి పతకాలు సొంతం చేసుకొన్నాడు. కర్ణాటకకు చెందిన ధీనిధి మహిళల 200 మీటర్ల ఫ్రీ స్టయిల్ రేస్‌లో 2 నిమిషాల 3.24 సెకన్ల గేమ్స్ రికార్డు టైమింగ్‌తో స్వర్ణం నెగ్గింది. 2022లో జాతీయ క్రీడల్లో హషికా రామచంద్ర నెలకొల్పిన (2 నిమిషాల 7.08 సెకన్ల) రికార్డును ధీనిధి బద్దలుకొట్టింది. 100 మీ. బటర్‌ఫ్లై ఈవెంట్‌లో మరో పసిడిని దక్కించుకొన్న దేశింగు.. 4×100 మీ ఫ్రీ స్టయిల్ రిలే జట్టు స్వర్ణం నెగ్గడంలోనూ కీలకపాత్ర పోషించింది. 200 మీ.ఫ్రీ స్టయిల్‌లో శ్రీహరి తొలి స్వర్ణంతో మెరిశాడు. ఆ తర్వాత 4×100 మీ. ఫ్రీ స్టయిల్ రిలేలో అనీష్, ఆకాశ్‌మణి, చినాతన్‌తో కలసి శ్రీహరి రెండో పసిడి నెగ్గాడు.



హక్కుల కోసం ఆటతోనే ధిక్కారం!

- బరిలోకి అఫ్ఘాన్ మహిళా క్రికెట్ జట్టు
- నేడు మెల్‌బోర్న్ వేదికగా మ్యాచ్
- తాలిబన్లనే ఎదిరిస్తున్న ధీర వనితలు



ఫిరోజా అమీరి

మెల్‌బోర్న్: అఫ్ఘానిస్థాన్ క్రికెట్‌లో చారిత్రక ఘట్టం చోటు చేసుకోనుంది. మహిళల హక్కులను కాలరాస్తున్న తాలిబన్ల ఛాందస భావాలను నిగ్గదీసే ఉద్యమం అంతర్జాతీయ వేదికగా ఉవ్వెత్తున ఎగసిపడనుంది. స్వేచ్ఛ కోసం.. క్రికెట్‌పై ఉన్న ప్రేమ కోసం.. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సరిహద్దులు దాటిన అఫ్ఘాన్ మహిళలు దాదాపు మూడేళ్ల తర్వాత జట్టుగా బరిలోకి దిగనున్నారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో గురువారం 'విదౌట్ బోర్డర్స్ లెవెన్'తో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో అఫ్ఘాన్ మహిళల జట్టు బరిలోకి దిగనుంది. ఇది కేవలం క్రికెట్ మ్యాచ్ కాదు. తమ హక్కులు.. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం అఫ్ఘాన్ మహిళలు చేస్తున్న పోరాటం. ఆడవాళ్లు బయటకు రాకుండా, చదువుకోకుండా అణచి వేస్తున్న తాలిబన్ పాలకులను నిలదీస్తున్న ధీర వనితల పోరాటం. ప్రాణాలు పోతాయనే హెచ్చరికలు వచ్చినా.. అఫ్ఘాన్ మహిళా క్రికెటర్లు అదరలేదు.. బెదరలేదు. కోటి ఆశలతో కొంగొత్త జీవితాన్ని కోరుకొంటున్న ఈ అమ్మాయిలు.. అగచాట్లు అనుభవిస్తున్న సదరు అఫ్ఘాన్ మహిళలకు గొంతుక కావాలనుకొన్నారు. వీరందరికీ ఆదర్శం, మార్గదర్శి ఫిరోజా అమీరి. ఆశ్రయం కోసం పలు దేశాలను అభ్యర్థించిన అమీరికి ఆస్ట్రేలియా సాయం చేసింది. అయితే, తనతోపాటు తన టీమ్ కూడా రావాలని ఆమె చేసిన పోరాటం ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపింది. 2021లో అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు 21 మందికి కాంట్రాక్ట్‌లు ఇచ్చింది. అయితే, పాలన తాలిబన్ల చేతిలోకి వెళ్లడంతో వారందరూ చెల్లాచెదురయ్యారు. అమీరి వారిని సంఘటితం చేసి ఆస్ట్రేలియాలో ఆశ్రయం పొందేలా చేసింది. ఇప్పటి వరకూ వివిధ క్లబ్‌లకు ఆడుతూ ఉన్న వీరు.. మూడేళ్ల తర్వాత అఫ్ఘాన్ మహిళల క్రికెట్ జట్టుగా బరిలోకి దిగనున్నారు. 'మాకందరికీ ఈ రోజు ఎంతో ప్రత్యేకం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దేశాన్ని వీడాం. మళ్లీ ఇప్పుడు అందరం ఒక్కటయ్యాం' అని అమీరి భావోద్వేగంతో చెప్పింది. అఫ్ఘాన్ మహిళల విద్య, క్రీడలు, భవిష్యత్తుకు ఈ మ్యాచ్ దారులు తెరుస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేసింది.

క్వార్టర్స్ చేరేదెవరో?

- నేటి నుంచి రంజీ ఆఖరి లీగ్ మ్యాచ్‌లు
- ప్రత్యేక ఆకర్షణగా కోహ్లీ



విరాట్ కోహ్లీ

న్యూఢిల్లీ: రంజీ ట్రోఫీ లీగ్ దశ తుది అంకానికి చేరుకొంది. విదర్భ మాత్రమే నాకౌట్ చేరుకోగా.. క్వార్టర్స్ బెర్త్ కోసం ఏడు జట్లు పోటీపడుతుండడంతో గురువారం నుంచి జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్ ఆయా జట్లకు కీలకంగా మారింది. ఇక, ఢిల్లీ తరఫున 12 ఏళ్ల తర్వాత విరాట్ కోహ్లీ దేశవాళీ క్రికెట్ ఆడనుండడం ప్రత్యేక ఆకర్షణ. గ్రూప్-డిలో ఢిల్లీ నాకౌట్ అవకాశాలు చాలా స్వల్పంగా ఉన్నాయి. ఆ టీమ్ క్వార్టర్స్ చేరాలంటే రైల్వేస్‌పై బోనస్ పాయింట్‌తో గెలవడంతోపాటు మిగతా జట్ల ఫలితాల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి. ఈ మ్యాచ్‌కు కోహ్లీ కోసం అభిమానులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. టాప్-3లో తమిళనాడు (25 పాయింట్లు), చండీగఢ్ (19 పాయింట్లు), సౌరాష్ట్ర (18 పాయింట్లు) మధ్యే ఆసక్తికర పోటీ నెలకొంది. ఇక, గ్రూప్-ఎలో డిఫెండింగ్ చాంప్ ముంబై పరిస్థితి క్లిష్టంగా ఉంది. టేబుల్ టాపర్‌గా ఉన్న జమ్మూ కశ్మీర్ (29 పాయింట్లు) కేవలం ఒక్క పాయింట్ సాధిస్తే నాకౌట్‌కు చేరుకొంటుంది. ఇక, రెండో స్థానంలో ఉన్న బరోడా (27 పాయింట్లు) తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధిస్తే చాలు. గ్రూప్-బిలో పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. విదర్భ ఈపాటికే క్వార్టర్స్ బెర్త్‌ను ఖరారు చేసుకోగా.. రెండు, మూడు స్థానాల్లో ఉన్న గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ మధ్య నాకౌట్ కాని నాకౌట్ మ్యాచ్ జరగనుంది. ఈ రెండు జట్లలో ఎవరు నెగ్గితే వారు రౌండ్-8లోకి అడుగుపెడతారు. ఇక, గ్రూప్-సిలో త్రిముఖ పోరు నెలకొంది. క్వార్టర్స్ బెర్త్‌ల కోసం హరియాణా (26 పాయింట్లు), కేరళ (21 పాయింట్లు), కర్ణాటక (19 పాయింట్లు) మధ్య తీవ్ర పోటీనెలకొంది.

ఆధార్‌తో ఎంట్రీ ఫ్రీ..

రైల్వేస్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున విరాట్ బరిలోకి దిగనుండడంతో భారీగా ఫ్యాన్స్ హాజరయ్యే అవకాశం ఉంది. తొలి రోజు ఆట చూసేందుకు దాదాపు 10 వేల మంది వస్తారని ఢిల్లీ క్రికెట్ సంఘం అంచనా వేస్తుంది. ఈ నేపథ్యంలో ఉచిత ప్రవేశం అని ప్రకటించిన డీడీసీఏ.. ఆధార్ కార్డ్‌ను మాత్రం తప్పకుండా తీసుకురావాలనే షరతు విధించింది. జియో సినిమాలో మ్యాచ్‌ను ప్రత్యక్ష ప్రసారం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

టీవీ నటితో సిరాజ్ డేటింగ్?



న్యూఢిల్లీ: టీమిండియా పేసర్ సిరాజ్.. టీవీ నటితో డేటింగ్‌లో ఉన్నట్టు ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. బిగ్‌బాస్ కంటెస్టెంట్ మాహిరా శర్మతో అతడు ప్రేమలో ఉన్నాడని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇటీవలే ఆశా భోస్లే మనుమరాలు జనై భోస్లేతో సిరాజ్ డేటింగ్ చేస్తున్నాడని నెటిజన్లు కోడై కూశారు. కానీ, ఆమె తన సోదరి లాంటిదని చెప్పడంతో పుకార్లకు తెరపడింది. కానీ, ఇప్పుడు మాహిరాతో లవ్‌స్టోరీ మాత్రం నిజమేనన్నట్టుగా చెబుతున్నారు. మరి ఈ ఊహాగానాలపై సిరాజ్ ఎలా స్పందిస్తాడో చూడాలి.



స్మిత్, ఖవాజా శతకాలు

- శ్రీలంకతో తొలి టెస్ట్



స్టీవ్ స్మిత్ (104 బ్యాటింగ్)

గాలె : ఖవాజా (147 బ్యాటింగ్), స్టీవ్ స్మిత్ (104 బ్యాటింగ్) అజేయ శతకాలతో అదరగొట్టడంతో శ్రీలంకతో బుధవారం ప్రారంభమైన తొలి టెస్ట్ మొదటి రోజే ఆస్ట్రేలియా పటిష్ఠ స్థితిలో నిలిచింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు అభేద్యంగా 195 పరుగులు జోడించారు. దాంతో తొలి రోజు ఆఖరికి ఆసీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 330/2 స్కోరు చేసింది.

10వేల పరుగుల క్లబ్‌లో స్మిత్..: ఈ మ్యాచ్‌కు ముందు 9999 పరుగులతో ఉన్న స్మిత్..ఒక పరుగు తీయడం ద్వారా టెస్టుల్లో 10 వేల పరుగుల మైలు రాయిని చేరుకున్నాడు. ఈక్రమంలో తన సహచరులు పాంటింగ్, బోర్డర్, స్టీవ్ వా సరసన స్మిత్ చేరాడు. ఓవరాల్‌గా 10 వేల పరుగులు చేసిన 15వ బ్యాటర్‌గా నిలిచాడు. ఇక.35వ శతకం సాధించిన స్మిత్ ఈక్రమంలో 34 సెంచరీలు చేసిన గవాస్కర్, జయవర్ధనే, యూనిస్ ఖాన్, లారాను అధిగమించాడు. 205 ఇన్నింగ్స్‌లలో 35వ శతకం సాధించిన స్టీవ్..పాంటింగ్ (194 ఇన్నింగ్స్), సచిన్ (200 ఇన్నింగ్స్) తర్వాత వేగంగా ఈ ఘనత అందుకున్న మూడో బ్యాటర్‌గా మరో రికార్డు సృష్టించాడు.

ల్యాండ్ గవర్నెన్స్ ఇన్నోవేషన్ అండ్ లీగల్ సపోర్ట్ సెల్ ఏర్పాటు

- సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీ
- ఈ కమిటీ ద్వారానే భూభారతి నిబంధనల రూపకల్పన!

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ గవర్నెన్స్ ఇన్నోవేషన్ అండ్ లీగల్ సపోర్ట్ సెల్‌ను ఏర్పాటు చేస్తూ భూ పరిపాలనా విభాగం(సీసీఎల్ఏ) ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. భూపరిపాలన ప్రధాన కార్యాలయం కేంద్రంగా పని చేసే ఈ లీగల్ సెల్‌లో ప్రధాన సలహాదారు, మరో ఇద్దరు సలహాదారులు సహా ముగ్గురు సభ్యులుంటారు. భూపరిపాలన వ్యవహారాలకు సంబంధించి న్యాయ పరిశోధన, విధానాల రూపకల్పన, చట్టాలు, నిబంధనలు, నియంత్రణకు సంబంధించిన ఉత్తర్వులు, ఇతర సర్క్యులర్ల తయారీ, భూపరిపాలనకు సంబంధించి ఉత్తమ విధానాల అధ్యయనం, సలహాలు, సూచనలు చేయడం, న్యాయపరమైన సందేహాలు తలెత్తినప్పుడు పరిష్కార మార్గాలు చూపడం ఈ కమిటీ ప్రధాన బాధ్యతలు. అంతేకాక, పెండింగ్‌లో ఉన్న భూసమస్యల విషయంలో న్యాయ సలహాలిచ్చే బాధ్యత కూడా ఈ సెల్‌కు ఉంటుంది. త్వరలో అమలులోకి రానున్న భూభారతి చట్టానికి సంబంధించిన నిబంధనల రూపకల్పన కూడా ల్యాండ్ గవర్నెన్స్ ఇన్నోవేషన్ అండ్ లీగల్ సపోర్ట్ సెల్ ఆధ్వర్యంలో జరగనున్నట్టు తెలిసింది. కాగా, భూభారతి చట్టంలో సహకారం అందించిన న్యాయవాది భూమి సునీల్‌ను లీగల్‌సెల్ ప్రధాన న్యాయ సలహాదారుగా నియమించే అవకాశముందని సమాచారం. ఒకటి, రెండు రోజుల్లోనే దీనిపై ఉత్తర్వులు వెలువడే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

గోదావరి బోర్డు చైర్మన్‌గా ఏకే ప్రధాన్

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) చైర్మన్‌గా ఏ.కే ప్రధాన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బుధవారం కేంద్ర జలశక్తి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర నీటి ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో గ్రూప్-ఏ క్యాటగిరీ అధికారి అయిన ప్రధాన్‌కు... ఉన్నత పరిపాలన శ్రేణి(హెచ్ఏజీ)కి పదోన్నతి కల్పించి, బోర్డు చైర్మన్‌గా నియమించారు.

కరువు పరిస్థితులను ముందే అంచనా వేయొచ్చు

- ఎస్ఏడీఎంఎస్ వ్యవస్థతో రైతులు, ప్రభుత్వాలకు మేలు
- ముందుగానే చెబుతున్నామంటున్న శాస్త్రవేత్తలు

హైదరాబాద్ సిటీ, జనవరి29(ఆంధ్రజ్యోతి): దేశంలో దాదాపు 68% ప్రాంతాలు కరవు బారిన పడేందుకు అవకాశాలున్నాయనే నివేదికల వేళ, ఫలానా ప్రాంతంలో కరవు ఉందని ముందే నిర్ధారించడానికి ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్(ఐడబ్ల్యుఎంఐ) కృషి చేస్తోంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్)తో కలిసి ఐడబ్ల్యుఎంఐ సౌత్ ఏసియా డ్రౌట్ మానిటరింగ్ సిస్టమ్(ఎస్ఏడీఎంఎస్)ను అభివృద్ధి చేసింది. శాటిలైట్ ఆధారిత ఆన్‌లైన్ వనరుగా ఉపయోగపడే ఈ ఎస్ఏడీఎంఎస్‌తో రైతులతో పాటు అధికారులకు కూడా కరవు అంచనా, నిర్వహణ, పర్యవేక్షణకు సంబంధించిన సమస్త సమాచారం అందించనున్నారు. సీజనల్ అంచనాలు, కరవు పరిస్థితులు ఎప్పుడు రావొచ్చనే అంచనాలను కూడా చేయవచ్చని దీనిని తీర్చిదిద్దిన శాస్త్రవేత్తల బృందం తెలిపింది. సంతోష్‌నగర్‌లోని ఐసీఏఆర్-సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ డ్రై ల్యాండ్ అగ్రికల్చర్‌లో జరుగుతున్న జరుగుతున్న 3 రోజుల అంతర్జాతీయ సదస్సులో కరవు నిర్వహణ, నీటి ఉత్పాదకపై ప్రత్యేక కార్యక్రమంలో ఈ వ్యవస్థ పనితీరుని శాస్త్రవేత్తలు వివరించారు.

2004-14 వరకు 'ఇందిరమ్మ ఇళ్ల'లో అవినీతి

- విచారణ జరిపించాలని సీఎంకు ఎఫ్‌జీజీ విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 2004 నుంచి 2014 వరకు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రూ.వేలాది కోట్ల అవినీతి జరిగిందని, దానిపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఈమేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌కు లేఖ రాశారు. ఆ పదేళ్ల కాలంలో ప్రభుత్వం 33.4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, అందులో 20.49 లక్షల ఇళ్లు పూర్తయినట్లు చూపారని తెలిపింది. అయితే ఆ ఇళ్లలో కొన్నింటి నిర్మాణాలు పూర్తి కాకపోయినా పూర్తయినట్లు చూపారని, కొన్నింటి పనులు అసలు ప్రారంభమే కాలేదని, కొన్ని సగంలో నిలిచిపోయాయని వివరించింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిపై సీఐడీ విచారణకు ఆదేశించిందని, ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడం అవినీతి అధికారులను ప్రోత్సహించినట్లవుతుందని తెలిపింది.

పోలవరం ముంపుపై అధ్యయనం చేయండి

- ఐఐటీ హైదరాబాద్‌ను కోరిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పోలవరం బ్యాక్ వాటర్ ముంపు, ఆ ముంపు నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై తగిన అధ్యయనం చేసి, నెలరోజుల్లోగా నివేదిక అందించాలని ఐఐటీ హైదరాబాద్‌ను తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్‌కు తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం లేఖ రాశారు. గోదావరి నదికి 2022 జూలైలో 22.50 లక్షల క్యూసెక్కుల వరద రాగా... ఆ వరద ప్రభావానికి గురైన ప్రాంతాలతో పాటు 2016లో పోలవరం బ్యాక్ వాటర్ ముంపు ప్రభావంపై సీడబ్ల్యూసీ ఇచ్చిన నివేదికపై, పోలవరం ప్రాజెక్టును 150 అడుగుల(45.72 మీటర్ల) ఎత్తుతో కట్టి, నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసినప్పుడు ఏ మేరకు ముంపు ప్రభావం ఉంటుందనే దానిపై అధ్యయనం చేయాలని కోరారు.

రాహుల్‌ను ప్రధానిని చేసే బాధ్యత రేవంత్ తీసుకోవాలి: మల్లు రవి

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే బాధ్యతను సీఎం రేవంత్‌రెడ్డి భుజాన వేసుకోవాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దూసుకుపోతున్నారని, జాతీయ నేతగానూ పేరు తెచ్చుకుంటున్నారని కొనియాడారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలపై చర్చకు సిద్ధమా అని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు.

వాజపేయి విగ్రహం ఏర్పాటు చేయొద్దన్న పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహం ఏర్పాటు చేయకుండా అడ్డుకోవాలని కోరుతూ దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టేసింది. కుల, మత సంబంధమైన విగ్రహాల ఏర్పాటుపై మాత్రమే సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసిందే తప్ప మాజీ ప్రధానులు విగ్రహాలు పెట్టరాదని పేర్కొనలేదని గుర్తుచేసింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతం పికెట్ పబ్లిక్ గార్డెన్‌లో వాజపేయి విగ్రహం ఏర్పాటును అడ్డుకోవాలని జెట్టి ఉమేశ్వర్‌రావు ఈ పిల్ వేశారు. విచారణలో కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ప్రవీణ్ వాదిస్తూ.. ప్రధానిగా వాజపేయి చేసిన సేవలు భవిష్యత్తు తరాలకు తెలియజెప్పటం కోసమే విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో కోర్టు పిటిషన్‌ను కొట్టేస్తూ తుది తీర్పునిచ్చింది.

అనుమతుల్లేకుండా రహస్య కెమెరాల అమ్మకాలా?

- కౌంటర్ వేయాలని కేంద్రానికి హైకోర్టు ఆదేశాలు

ఎలాంటి అనుమతులు, నియంత్రణ లేకుండా ఆన్‌లైన్‌లో ఇష్టారాజ్యంగా రహస్య కెమెరాలు విక్రయిస్తుండటంపై కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంటూ కేంద్రానికి హైకోర్టు ఆదేశాలిచ్చింది. రహస్య కెమెరాల విక్రయాలపై ఎలాంటి నియంత్రణ లేదంటూ హెవెన్ హోమ్స్ సొసైటీ ఎన్జీవో అధ్యక్షురాలు వరలక్ష్మి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. వీటిని ఆన్‌లైన్‌లో ఇష్టారీతిన కొనుగోలు చేసి వాష్‌రూంలు, హాస్టల్ గదులు, హోటళ్లు, షాపింగ్‌మాల్స్‌లో రహస్యంగా ఏర్పాటు చేస్తుండటంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

అత్యాధునిక సాంకేతికతతో భూభారతి!

- కృత్రిమ మేధ, జియోస్పేస్ వినియోగం
- సందేహాల నివృత్తికి చాట్‌బాట్!
- కొత్త సాఫ్ట్‌వేర్ కోసం త్వరలో టెండర్లు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): భూభారతి పోర్టల్‌లో అత్యాధునిక సాంకేతికతను వినియోగించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. కొత్త ఆర్వోఆర్ అమల్లో భాగంగా ఏఐ (కృత్రిమ మేధ), జియోస్పేస్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలని సర్కారు నిర్ణయించింది. గతంలో ధరణి పోర్టల్‌ను నిర్వహించిన టెర్రాసిస్ కంపెనీ 'మోనోలిథిక్ ఆర్కిటెక్చర్ (సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో ఇదో రకమైన నిర్మాణ రూపం. ఇందులో అప్లికేషన్ మొత్తం ఒకే యూనిట్‌గా ఉంటుంది) విధానం'లో అప్లికేషన్లు రన్ చేసింది. క్లిష్టతరంగా ఉన్న ఈ విధానానికి స్వస్తి పలికి, భూభారతి పోర్టల్ అమల్లో సరళతకు పెద్ద పీట వేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు భూ ఆధారిత సేవలను అందించనుంది. ఏఐ, జియోస్పేస్ టెక్నాలజీలతోపాటు 'మైక్రో సర్వీసెస్ ఆర్కిటెక్చర్ (ఒక పెద్ద అప్లికేషన్‌ను చిన్న చిన్న స్వతంత్ర సేవలుగా విభజిస్తారు. వీటిని మైక్రో సర్వీసెస్ అంటారు) విధానం'లో పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానుంది.

ఏఐ ఆధారిత సేవలు ఇలా..

రెవెన్యూ శాఖ అందించే అన్ని రకాల సేవలకు సంబంధించిన సలహాలు, సూచనలు అందించేలా ఏఐ అప్లికేషన్‌ను భూభారతి పోర్టల్ ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నారు. చాట్‌బాట్ ద్వారా భూ సమస్యలపై ఏ సందేహం వచ్చినా దరఖాస్తు చేసుకునే దగ్గరి నుంచి సమస్య పరిష్కరించుకునే వరకూ అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చే ఏజెంట్ వ్యవస్థలా ఏఐ పని చేయనుంది. ఎలాంటి భూ సమాచారం కావాలన్నా రైతులు కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చాట్‌బాట్ ద్వారా వారికి కావాల్సి సమగ్ర సమాచారాన్ని అందించేలా ఈ వ్యవస్థను తీసుకొస్తున్నట్లు సమాచారం. అధికారులకు సాంకేతిక ఇబ్బందులు, సాఫ్ట్‌వేర్, కోడింగ్, ఇతర అప్లికేషన్ల విషయంలో ఏవైనా సమస్యలు వస్తే అధిగమించేలా రెండు వేర్వేరు చాట్‌బాట్‌లు ఉంటాయి. దీంతోపాటు జియోస్పేస్ టెక్నాలజీ ద్వారా జీపీఎస్ విధానంలో ఒక ప్రదేశం యొక్క కచ్చితత్వాన్ని గుర్తించే అవకాశం ఉంటుంది. అలాగే జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(జీఐఎస్) ద్వారా ఉపగ్రహ చిత్రాలను సేకరించి పంట వేశారా? లేదా? అనేది కూడా తెలుసుకోవచ్చు. ఇక డ్రోన్ల ద్వారా భూమి హద్దులను నిర్ణయించవచ్చు. భూ దస్త్రాల నిర్వహణ, పౌరుల కోసం అప్లికేషన్ల రూపకల్పనతోపాటు భూభారతి పోర్టల్‌కు అవసరమైన కొత్త సాఫ్ట్‌వేర్‌ను అందించేందుకు ఒకటి రెండు రోజుల్లో టెండర్లు పిలిచేందుకు రెవెన్యూ శాఖ సిద్ధమైంది.

కేంద్రం కరుణించేనా!?

ఈసారి బడ్జెట్లోనైనా నిధులు వచ్చేనా?.. ఇప్పటికే పలు డిమాండ్లను తెలిపిన రాష్ట్రం

- 'పాలమూరు'కు 60% నిధులివ్వండి
- ఆర్ఆర్ఆర్, మెట్రో రైలు, లెదర్ పార్కులను పట్టించుకోండి
- రూ.1,63,559 కోట్ల మేర ప్రతిపాదనలు
- 1న బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆశలు



హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం భారీగానే ఆశలు పెట్టుకుంది. మోదీ సర్కారు ఈసారైనా కరుణిస్తుందని భావిస్తోంది. కొన్ని ప్రాజెక్టులకైనా నిధులు ఇస్తుందని ఆశిస్తోంది. తెలంగాణలో 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలపై స్పష్టత లేని నేపథ్యంలో గత ఏడాది కేంద్రం నిధుల విడుదలలో ఆచితూచి వ్యవహరించి ఉంటుందని భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రెండో ఏట అడుగు పెట్టినందున.. పని తీరు, కేంద్రంతో సత్సంబంధాలు, సమాఖ్య విధానానికి ఇస్తున్న ప్రాధాన్యం వంటి అంశాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుని ఈసారి గ్రాంట్లు, ప్రత్యేక గ్రాంట్లను మంజూరు చేయొచ్చని ఆకాంక్షిస్తోంది. కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రాష్ట్రానికి కేటాయింపులు పెంచవచ్చని, విభజన సంబంధిత ప్రాజెక్టులకు నిధులిస్తుందని భావిస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో అయినా నిధులు వస్తాయని భావిస్తున్నారు. మరోవైపు మోదీ సర్కారు తీరుపై ఇప్పటికే రాష్ట్రం నిరుత్సాహంతో ఉంది. తెలంగాణ పట్ల కాస్త వివక్ష చూపుతోందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా దక్షిణాది రాష్ట్రాల పట్ల అందునా తెలుగు రాష్ట్రాలపై పక్షపాతాన్ని, సవతి తల్లి ప్రేమను కనబరుస్తున్నాయన్న విమర్శలున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు పన్నుల వాటాలు, సీఎస్ఎస్‌ల కేటాయింపుల్లో అన్యాయం జరుగుతుండగా.. ప్రత్యేక గ్రాంట్లను కూడా విడుదల చేయడం లేదని ఇక్కడి పాలక వర్గాలు, ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. కానీ, టీడీపీ ఎన్డీయేలో భాగస్వామ్య పార్టీ కావడంతో ఇటీవల ఏపీకి కొన్ని రకాల నిధులు మంజూరవుతున్నాయని ఇక్కడి అధికార పార్టీ నేతలు గుర్తుచేస్తున్నారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా.. రాష్ట్రానికి ఎలాంటి నిధులివ్వడం లేదని అధికార కాంగ్రెస్ ఆరోపిస్తోంది. విభజన సమస్యల్లో భాగమైన పోలవరం ప్రాజెక్టుకు ఆర్థికసాయాన్ని అందిస్తున్న కేంద్రం.. తెలంగాణలోని ఏ ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని గుర్తుచేస్తోంది. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా.. కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శిస్తోంది. రాష్ట్రంలో పలు ప్రాజెక్టుల కోసం రూ.1,63,559.31 కోట్ల నిధులివ్వాలని కోరుతోంది.

ఇవీ రాష్ట్ర ప్రభుత్వ డిమాండ్లు..

తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత ఒక్క సాగునీటి ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతోంది. 2014 తర్వాత దేశంలోని ఏ ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇవ్వడం లేదంటూ కేంద్రం స్పష్టతనిచ్చినందున.. ప్రాజెక్టు ప్రాధాన్యం దృష్ట్యా ఇతర పథకాల కింద 60% నిధులిస్తామన్న ప్రకటనకు కట్టుబడి నిధులివ్వాలని కోరుతోంది.

- హైదరాబాద్ చుట్టూ చేపడుతున్న రీజనల్ రింగు రోడ్డుకు రూ.34,367.62 కోట్లు అవసరమని, 2016 లోనే కేంద్ర రోడ్డు రవాణా శాఖ దీనికి ప్రాథమికంగా అనుమతి ఇచ్చిందని కేంద్రానికి సీఎం, డిప్యూటీ సీఎంలు వివరించారు. ఈ ప్రాజెక్టు ఉత్తర, దక్షిణ భాగాల భూసేకరణకయ్యే వ్యయం లో 50 శాతాన్ని భరిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. మిగతా నిధులపై స్పష్టతనివ్వాలని కోరుతోంది. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ మధ్య నిర్మించే 10 గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్లకు రూ.45 వేల కోట్లు కూడా మంజూరు చేయాలని కోరుతోంది.
- మెట్రో రైలు రెండో దశలో 76.4 కి.మీ. మేర 5 కారిడార్లను నిర్మించతలపెట్టామని, రూ.24,269 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తోంది.
- బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయాలనుకుంటున్నామని తెలిపింది. మూసీలోకి మురికినీరు ప్రవేశించకుండా 'ట్రంక్ ఇంటర్‌సెప్టర్'ను నిర్మించనున్నామని వివరించింది. దీనికి రూ.14,100 కోట్లు మంజూరు చేయాలని కోరింది.
- 'గోదావరి-మూసీ అనుసంధాన' ప్రాజెక్టును చేపడుతున్నామని, దీనికి రూ.7,440 కోట్లు ఇవ్వాలని అడుగుతోంది.
- హైదరాబాద్‌తో పాటు సమీప 27 మునిసిపాలిటీల్లో 7,444 కి.మీ. మేర సీవరేజీ నెట్‌వర్క్ అభివృద్ధికి 'సమీకృత మురుగు నీటి మాస్టర్ ప్లాన్ (సీఎస్ఎంపీ)'ను రూపొందించామని, రూ.17,212.69 కోట్లు అవసరమని వివరించింది.
- వరంగల్‌లో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ అభివృద్ధికి రూ.4,170 కోట్లు కావాలని తెలిపింది.
- ఏపీలోని బందరు పోర్టు నుంచి హైదరాబాద్ డ్రై పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేకు రూ.17 వేల కోట్లు విడుదల చేయాలని కోరింది.
- విభజన చట్టంలో ఇచ్చిన హామీల మేరకు వెనకబడిన జిల్లాల అభివృద్ధి నిధులు రూ.1,350 కోట్లను విడుదల చేయాలని కోరుతోంది.
- కరీంనగర్, జనగాం జిల్లాల్లో లెదర్ పార్కులను మంజూరు చేస్తే.. భూములు కేటాయిస్తామని చెబుతోంది. పీఎం మిత్ర పథకంలో భాగంగా వరంగల్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్కుకు గ్రీన్ ఫీల్డ్ హోదా ఇవ్వాలని.. తద్వారా రూ.300 కోట్ల గ్రాంట్లు అదనంగా వస్తాయని చెబుతోంది.
- మిర్యాలగూడ మీదుగా హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు నూతన పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు, హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌కు తుది అనుమతులు మంజూరు చేయాలని అడుగుతోంది. తెలంగాణకు 15వ ఆర్థిక సంఘం రూ.2,233.54 కోట్లను సిఫారసు చేసిందని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరుతోంది.
- యూపీఏ హయాంలో హైదరాబాద్‌కు నేషనల్ డిజైన్ సెంటర్(ఎన్ఐడీ) మంజూరవగా.. రాష్ట్ర విభజన తర్వాత దాన్ని విజయవాడకు తరలించారని, తెలంగాణకు ఎన్ఐడీని మంజూరు చేయాలని అడుగుతోంది. తెలంగాణకు జాతీయ చేనేత సాంకేతిక కేంద్రం (ఐఐహెచ్‌టీ)ను మంజూరు చేయాలని కోరుతోంది.
- తెలంగాణలోని గిరిజన రైతులకు నిరంతరం సాగు నీటిని అందించేందుకు వీలుగా 'పీఎం కుసుమ్' పథకం కింద లక్ష సౌర పంపులు కేటాయించాలని కోరింది. విద్యుత్తు సరఫరా, నెట్‌వర్క్ బలోపేతానికి రూ.488 కోట్ల అంచనా వ్యయంతో 9 ప్రాజెక్టుల నివేదికలను కేంద్రానికి సమర్పించామని, వాటిని మంజూరు చేయాలని కోరుతోంది.

పీఎంఏవై కింద 20 లక్షల ఇళ్లు ఇవ్వండి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్)-2.0 కింద తెలంగాణకు 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ఇటీవల సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. పీఎంఏవై-2.0లో చేరిన తొలి రాష్ట్రం తెలంగాణ అని, ఇళ్ల నిర్మాణానికి సమగ్రమైన డేటా, పూర్తి ప్రణాళికతో సన్నద్ధంగా ఉందని, రాష్ట్రానికి 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

తెలంగాణలో నిషేధమున్నా లాగిన్ ఎలా?

- బెట్టింగ్, గేమింగ్ వెబ్‌సైట్ల నిర్వాహకులకు రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రశ్న
- ఆన్‌లైన్ గేమింగ్‌పై ఉన్నతస్థాయి సమావేశం
- పలు బెట్టింగ్, గ్యాంబ్లింగ్ సైట్లకు నోటీసులు జారీ

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై తెలంగాణలో నిషేధం ఉన్నప్పటికీ ఆయా వెబ్‌సైట్ల వినియోగానికి ఇక్కడి ప్రజలన ఎలా అనుమతిస్తున్నారు ? అంటూ సంబంధిత వెబ్‌సైట్ల నిర్వాహకులు, ఇంటర్నెట్ ప్రొవైడర్లను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిలదీసింది. ఈ మేరకు పలు బెట్టింగ్, గేమింగ్ కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. ఆన్‌లైన్ గేమింగ్ ఓ విషవలయంగా మారిన నేపథ్యంలో ప్రముఖ ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీల నిర్వాహకులతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో బుధవారం సమావేశం నిర్వహించింది. ఆలిండియా గేమింగ్ ఫెడరేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్, పలు గేమింగ్ కంపెనీల సీఈఓలు, ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్లు, టెలికాం సర్వీసు ప్రొవైడర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం ప్రతినిదులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో నిషేధం ఉన్న గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌ల్లోకి తెలంగాణ వాసులను ఎలా అనుమతిస్తున్నారని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ ప్రశ్నించారు. తెలంగాణలో నమోదైన ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా ఉన్న వ్యక్తులకు నిషేధిత గేమింగ్ సైట్లలో లాగిన్ అయ్యేందుకు అవకాశం ఇవ్వడం ఏంటనీ అడిగారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌కు బానిసలై పలువురు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బెట్టింగ్ కంపెనీలకు నోటీసులు జారీ చేశారు. గేమింగ్ సంస్థలు జియో ఫెన్సింగ్ పాటించకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. చట్టాలను గౌరవించని గేమింగ్ కంపెనీల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అలాగే, విదేశాల్లో ఉంటూ కార్యకలాపాలు నిర్వహించే ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్ల పర్యవేక్షణకు, ఆయా కంపెనీలు స్థానిక చట్టాలను గౌరవించేలా చేసేందుకు ఓ నియంత్రణ విభాగం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖకు లేఖ రాశామని షికా గోయల్ తెలిపారు. కాగా, నిషేధిత గేమింగ్ యాప్‌ల్లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిపై 1930కు ఫోన్ చేసి తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి అభ్యర్థులుగా నర్సిరెడ్డి, అశోక్ కుమార్

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వరంగల్- ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డి, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు అశోక్ కుమార్‌లను ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి అభ్యరులుగా ప్రకటించారు. బుధవారం టీఎస్ యూటీఎఫ్ సంఘం కార్యాలయంలో టీపీటీఎఫ్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థులను పరిచయం చేశారు. ఇద్దరు నేతలను గెలిపించాలని యూటీఎఫ్, టీపీటీఎఫ్ నేతలు చావా రవి, సీహెచ్ అనిల్ కుమార్, ఎ.వెంకట్, ఎన్. తిరుపతి పిలుపునిచ్చారు. ఉద్యమ నాయకులను గెలిపించి శాసనమండలిలో ఉపాధ్యాయుల గొంతు వినిపించే అవకాశం ఇవ్వాలని కోరారు.

ధరణిని బంధించిన బగ్!

ఈ నెలారంభం నుంచి 2 వారాలపాటు సమస్య.. సర్వర్ పూర్తిగా మొరాయించి తీవ్ర ఇబ్బందులు

- పోర్టల్.. కుప్పకూలే స్థాయికి పరిస్థితి
- గత నిర్వహణ సంస్థ టెర్రాసిస్ వల్లే!
- సామర్థ్యానికి మించి సీపీ వినియోగంతో కుప్పకూలిన సర్వర్
- ఫైళ్ల అప్‌లోడ్‌లో తీవ్ర జాప్యం.. ప్రస్తుతం సాఫీగా రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఒక చిన్న బగ్.. ధరణి పోర్టల్ నిర్వహణను కుప్పకూల్చేంత పని చేసింది. ఎక్కడ లోపం ఉందో తెలుసుకునేందుకు నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సాంకేతిక నిపుణులు, సీసీఎల్ఏ అధికారులు తలపట్టుకోవాల్సి వచ్చింది. ఈ నెల 2న స్వల్పంగా మొదలైన సమస్య.. 8వ తేదీ తరువాత తీవ్రమై.. సర్వర్ పూర్తిగా మొరాయించే పరిస్థితికి చేరింది. దీంతో అధికారులు, ఎన్ఐసీ సాంకేతిక నిపుణులు తీవ్రంగా శ్రమించి జనవరి 15 తరువాత క్రమేణా పోర్టల్‌ను యథాస్థితికి తీసుకొచ్చారు. అయితే ఇందుకు కారణం గతంలో ధరణి పోర్టల్‌ను నిర్వహించిన టెర్రాసిస్ సంస్థ నిర్వాకమేనని తేలింది. భూ యజమానులకు సంబంధించిన వివరాల గోప్యతను ఆ సంస్థ గాలికొదిలేసింది. వారి ఆధార్ వివరాలు బహిర్గతం కాకుండా పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉండగా.. టెర్రాసిస్ ఈ నిబంధనను పాటించకుండా బహిరంగంగా కనిపించేలా చేసింది. ఇది ఆధార్ చట్ట రీత్యా కూడా ఆమోదయోగ్యం కాదు. దీంతోపాటు ఇతర సమాచారాన్ని కూడా ఎన్‌క్రిప్ట్ చేయకపోవడంతో.. సెంట్రల్ ప్రాసెసర్ (సీపీ) వినియోగం వంద శాతం పెరిగింది. దీంతో లోడంతా సర్వర్‌పై పడి సర్వర్ మొరాయించే పరిస్థితి తలెత్తింది. స్టేట్ డాటా సెంటర్ (ఎస్‌డీసీ) అధీనంలో ఉన్న సర్వర్ ఎందుకు మొరాయిస్తుందో తొలుత అధికారులకు కూడా అంతుబట్టలేదు. చివరికి చాలా అప్లికేషన్లను ఎన్‌క్రిప్ట్ చేయకుండా సమాచారాన్ని బహిరంగంగా ఉంచడం వల్లనే ఈ సమస్య తలెత్తినట్లు గుర్తించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఐటీ నిపుణులను సంప్రదించి సమస్యను పరిష్కరించారు.

బదలాయింపులో హడావుడి వల్లే..!

ధరణి పోర్టల్ నిర్వహణ టెర్రాసిస్ నుంచి ఎన్ఐసీ చేతికిలోకి వచ్చిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఒక సంస్థ నుంచి మరో సంస్థకు డేటా బదిలీ జరిగేటప్పుడు స్టెబిలైజేషన్ పీరియడ్ (స్థిరీకరణ కాలం) మూడు నెలలు ఉంటుంది. అయితే ఇక్కడ ప్రభుత్వ అవసరాల రీత్యా నెల రోజుల వ్యవధిలోనే హడావుడిగా అన్నీ చేయాల్సి రావడంతో సాంకేతికపరమైన ఇబ్బందులు తలెత్తాయి. ఐటీ పరిశ్రమ ప్రమాణాల ప్రకారం నాలెడ్జ్ బదలాయింపునకు కూడా ఆరు నెలల సమయం తీసుకుంటారు. భూములకు సంబంధించిన సమగ్ర వివరాలతో ధరణి పోర్టల్‌లో 400 నుంచి 500 పేజీల్లో నిర్వహించాల్సిన డేటాను టెర్రాసిస్ సంస్థ సుమారు 7వేల పేజీల్లో నిర్వహించింది. అయితే అవసరానికి మించి పేజీలను సృష్టించడం, అవసరం లేకున్నా 30 లక్షల లైన్ల కోడింగ్ పెట్టడం వంటివన్నీ రీవ్యాంప్ చేపట్టిన ఎన్ఐసీకి అవరోధంగా మారాయి. పేజీ నిర్మాణానికి సంబంధించి టెర్రాసిస్ మోనోలిథిక్ ఆర్కిటెక్చర్ పద్ధతిని ఎంచుకోవడంతో ఒక్క అప్లికేషన్‌లో లోపాలను సరిదిద్దాలన్నా అందులో ఉన్న అన్ని అప్లికేషన్లను నిలిపేయాల్సి వచ్చిందని చెబుతున్నారు. దీని వల్ల కూడా స్లాట్ల బుకింగ్‌లోనూ, రిజిస్ట్రేషన్లలో జాప్యం జరిగిందని అంటున్నారు. ఎన్ఐసీ అధికారులు ధరణి పోర్టల్‌కు సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించి ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించారు. సాంకేతికపరమైన లోపాలున్నట్లు గుర్తించారు. ఒక చిన్న బగ్ దీనంతటికీ కారణమని తేల్చారు. వాటిని సరిదిద్ది స్లాట్ బుకింగ్స్, లావాదేవీలను పూర్వపు స్థితికి తీసుకొచ్చారు. ఈ నెల 27న ధరణిలో 3,538 స్లాట్స్ బుక్ చేయగా.. వాటిలో 3,280 లావాదేవీలు జరిగాయి. సాధారణంగా నిత్యం సగటున 2వేల నుంచి 2500 వరకు లావాదేవీలు జరుగుతాయని సమాచారం. అయితే ఈ నెల మొదటి రెండు వారాల్లో తలెత్తిన సాంకేతిక ఇబ్బందులతో ఈ సంఖ్య భారీగా తగ్గింది. ప్రస్తుతం ఇది సాధారణ స్థితికి చేరిందని అధికారులు చెబుతున్నారు. అయితే జిల్లాలో ఇప్పటికీ కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలను అధిగమించలేకపోతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.

జిల్లాల్లో ధరణి లావాదేవీల పరిస్థితి ఇదీ..

నల్లగొండ జిల్లాలో సర్వర్ సమస్యతో స్లాట్‌ల బుకింగ్, రిజిస్ట్రేషన్లలో సమస్య ఉంది. రోజుకు 7, 8కి మించి తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. రంగారెడ్డి జిల్లాలో రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నా.. అప్పుడప్పుడు సాంకేతిక సమస్యలు వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. యాదాద్రి జిల్లాలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా.. కొంత జాప్యం ఉంది. వికారాబాద్ జిల్లాలో గత రెండు రోజుల నుంచి రిజిస్ట్రేషన్లలో వేగం పెరిగింది. ధరణి సవ్యంగా పని చేస్తోందని అధికారులు తెలిపారు. జనగామ జిల్లాలో కొన్ని మండలాల్లో సర్వర్ సమస్య లేకున్నా కొన్ని మండలాల్లో మొరాయిస్తుందనే ఫిర్యాదులు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో గతంలో అరగంటలో రిజిస్ట్రేషన్ పూర్తవగా.. ఇప్పుడు గంటన్నర సమయం పడుతోందంటున్నారు. భద్రాది కొత్తగూడెం జిల్లాలో గతంలో కంటే కొంత నెమ్మదిగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. జగిత్యాల జిల్లాలో ధరణి సమస్య లేదని, సాఫీగానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాని చెబుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండు వారాల క్రితం సమస్య ఉండేదని, ప్రస్తుతం రెండు రోజుల నుంచి ఎలాంటి సమస్య లేదని రైతులు అంటున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో లాగిన్ సమస్య ఉంది.

పని ఒత్తిడి భరించలేక ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఆత్మహత్య

- నిజామాబాద్ జిల్లాలో ఘటన
- ఇదే కారణంతో మిర్యాలగూడలో జూనియర్ అసిస్టెంట్ అదృశ్యం

ధర్పల్లి, మిర్యాలగూడ అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ (మిషన్ భగీరథ)గా పని చేస్తున్న సాయిచరణ్(25) అనే యుకుడు పని ఒత్తిడి భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం జరిగింది. సాయిచరణ్ గత 3 నెలలుగా ధర్పల్లిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా కొనసాగుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నడిపెల్లి గ్రామశివారులో పురుగుల మందు తాగాడు. బుధవారం ఉదయం గమనించిన స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయిచరణ్ మరణించాడు. మృతుడు పని ఒత్తిడి భరించలేక.. మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తల్లిదండ్రులు చెబుతున్నారు. కాగా.. 'అమ్మా.. కంప్యూటర్‌పై పనిచేయడం నా వల్లకావడం లేదు.. పని ఒత్తిడి తట్టుకోలేకపోతున్నా..' అంటూ నల్లగొండ జిల్లాలో జూనియర్ అసిస్టెంట్ నూనె ప్రవీణ్ (30) మంగళవారం రాత్రి తన తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. బుధవారం ఉదయం పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కంగారు పడిన తల్లిదండ్రులు ఆచూకీ కోసం ఆరా తీసినా ఫలితం దక్కలేదు. దీంతో మిర్యాలగూడ పట్టణ పోలీసులను ఆశ్రయించారు. మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో ప్రవీణ్ గత డిసెంబరు నుంచి జూనియన్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. పని ఒత్తిడి పెరిగి మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు పలు సందర్భాల్లో ప్రవీణ్ ఫోన్‌చేసి తమతో చెప్పుకునేవాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ క్రమంలో వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమకాల్వ కట్టపై ఉన్న స్కూటీని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోతు తెలియక
ఎన్నికల హామీలిచ్చాం



(మొదటిపేజీ తరువాయి)

హామీలను పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోజుకు 18 నుంచి 20 గంటలు పనిచేస్తున్నారు. రేవంత్‌రెడ్డి యంగ్ అండ్ డైనమిక్ ముఖ్యమంత్రి" అని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కొనియాడారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్‌డీ చదువుతున్న విద్యార్థులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి స్థానంలో ఎవరున్న ఈ రాష్ట్ర పరిస్థితులు మారే అవకాశం లేదని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన కొత్తలో ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితీ లేదని, ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ.. ఇప్పుడు ప్రతీనెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితిని ముఖ్యమంత్రి తీసుకువచ్చారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేప్పటికి రాష్ట్రం 7 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, దానికి నెలకు రూ.6,500 కోట్లు మిత్తి కడుతున్నామని ఆయన వివరించారు. కాగా, ఇటీవలే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయిన విషయం తెలిసిందే. 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుబంధు పేరు మార్చి, రైతు భరోసాగా మార్చి పెట్టుబడి సాయం చేస్తూ వస్తున్నాం, మధ్యలో ఒకసారి మాత్రం డుమ్మీ కొట్టాం' అని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మసీదుగూడెంలో ఈ నెల 26న జరిగిన సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఊళ్లలోకి పోతే జనం తిడుతున్నరు.. కేసీఆరే బాగుండే.. కాంగ్రెసోళ్లు ఇస్తలేరు.. అని అంటున్నరు' కదా అని ప్రశ్నించగా అక్కడున్నవారు అవునని సమాధానమిచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కారణంతో కోతలు విధిస్తున్నామని, పేదవాళ్లకు సంక్షేమ పథకాలు అందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

మార్చి 31లోగా రైతు భరోసా జమ: తుమ్మల



హైదరాబాద్, ఎల్బీనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని విశ్వసించే ప్రభుత్వం తమదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. మార్చి 31లోగా రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 35% అంటే రూ.72 వేల కోట్ల నిధులను వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు కేటాయించామన్నారు. భూమికి, విత్తనానికి ఉన్న సంబంధం కాంగ్రెస్ పార్టీకి, రైతులకు ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన వ్యవసాయ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు ఏడాదిలోనే రైతు సంక్షేమానికి రూ.54,280 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. సహకార విద్యుత్తు సరఫరా సంఘం లిమిటెడ్(సెస్) నిధుల వసూళ్లు, వినియోగంపై అధికారులతో మంత్రి తుమ్మల సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రైతులకు విద్యుత్తు సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయిల్ ఫాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయిల్ ఫాం సాగులో దేశంలో తెలంగాణను తొలి స్థానంలో నిలపాలని ఆదేశించారు.

అత్యాధునిక సౌకర్యాలతో కోహెడ మార్కెట్‌ను నిర్మిస్తాం

కోహెడ మార్కెట్‌ను అత్యాధునిక సౌకర్యాలతో మూడు వేల కోట్లు వెచ్చించి నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సంఘం సెంట్రల్ ఫోరం ఆధర్యంలో రూపొందించిన 2025 నూతన డైరీ, క్యాలెండర్‌ను మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ మార్కెట్‌లో ఆయన ఆవిష్కరించారు.

'ఏఐ' సహిత సమగ్ర హెల్త్ ప్రొఫైల్

» ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా రూపొందిస్తాం: శ్రీధర్ బాబు

హైదరాబాద్, బంజారాహిల్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి రాష్ట్రంలోని ప్రతి పౌరుడి హెల్త్ ప్రొఫైల్‌ను సమగ్రంగా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. బుధవారం జూబ్లీహిల్స్ మాద్యూర్ హాస్పిటల్ సర్వీసెస్ రూపొందించిన 'ఎండీఆర్.షై డిజి రికార్డ్' మొబైల్ యాప్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇటీవలి కాలంలో వ్యాధిగ్రస్తులు ముందుగా ఒక ఆస్పత్రికి వెళ్తున్నారు. అన్ని వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స తీసుకుంటున్నారు. నమ్మకం కుదరక మళ్లీ ఇంకో ఆస్పత్రికి వెళ్తున్నారు. అక్కడా మళ్లీ అన్ని వైద్య పరీక్షలను చేయించుకోవాల్సి వస్తుంది. ఫలితంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. అయితే, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ అందుబాటులోకి వచ్చాక రోగులపై పడే అదనపు భారం తగ్గుతుంది. వేగంగా మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులకు సాయపడుతుంది' అని అన్నారు. భవిష్యత్తులో రాబోయే ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడానికి వీలవుతుందని చెప్పారు. హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని, ఏఐ లాంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అన్ని రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా రూపొందిస్తామని తెలిపారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడండి

» మిషన్ భగీరథ నీళ్లపై నమ్మకం కలిగించండి: సీతక్క

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని, అందుకోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. బుధవారం సచివాలయంలో సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు మిషన్ భగీరథ నీళ్లపై నమ్మకం కలిగించాలని, అందరికీ అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. తాగునీటి కారణంగా ఎవరు అనారోగ్యం పాలవ్వకూడదని, నీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సర్వీస్ నుంచి తొలగిస్తామని మంత్రి హెచ్చరించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణతాగునీటి సరఫరా ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీని ఆమె ఆవిష్కరించారు. మరోవైపు హుజూరాబాద్ ఉపఎన్నిక కోసం దళితబంధు, 2018 అసెంబ్లీ ఎన్నికల ముందు రైతు బంధు, జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు ఇంటికి పది వేలు.. ఇలా ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునే చరిత్ర బీఆర్ఎస్‌దేనని మంత్రి సీతక్క ఆరోపించారు. ఆత్మగౌరవ ఇండ్ల నిర్మాణ వ్యయాన్ని రూ.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు తగ్గించి, ఇంట్లో కూర్చుని లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసినందునే ప్రజలు మి మ్మల్ని ఇంట్లో కూర్చోబెట్టారని గుర్తుంచుకోవాలన్నారు. ఉచిత ఎరువులు, పంట బోనస్ హామీలను విస్మరించింది ఎవరని కేటీఆర్‌ను ఆమె ప్రశ్నించారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఏఐ !

» అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచన

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణ పనుల పూర్తయ్యే వరకు కృత్రిమ మేధ(ఏఐ)ను వినియోగించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంపై బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఇంటి నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించేలా ఏఐని ఉపయోగించుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. లబ్ధిదారుల ఎంపిక కోసం మొబైల్ యాప్ ద్వారా చేసిన సర్వే వివరాలను క్లౌడ్ ఆధారిత ఏఐ టెక్నాలజీతో సరిపోలుస్తూ నిజమైన అర్హులను గుర్తించాలన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా అసలైన అర్హులను గుర్తించేందుకు, అనర్హులను లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించేందుకు ఈ విధానం ఉపకరిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఇండ్ల నిర్మాణానికి సంబంధించి నాలుగు దశల్లో చెల్లింపులు చేస్తామని, ఎలాంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు చెల్లింపులు చేసేలా ఏఐని వినియోగించుకోవాలన్నారు. అనంతరం సమాచార- పౌర సంబంధాల ఉద్యోగుల సంఘం రూపొందించిన 2025 సంవత్సర నూతన క్యాలెండర్‌ను మంత్రి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించి, ప్రజలు లబ్ధి పొందేలా చూడాలని ఉద్యోగులను ఆయన ఆదేశించారు.

పర్యాటకానికి పెద్దపీట

» 10 లోగా సమగ్ర పర్యాటక విధానం రూపొందించాలి

» సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఎకో టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించింది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యాటకులను ఆకర్షించేలా పర్యాటక విధానం ఉండాలని భావిస్తోంది. ఈ మేరకు ఫిబ్రవరి 10వ తేదీలోగా సమగ్ర పర్యాటక విధానాన్ని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలు, అభయారణ్యాలు, ఆలయాలను ప్రాతిపదికగా చేసుకొని పాలసీని రూపొందించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర పర్యాటక విధానంపై బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశీయంగా వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న పర్యాటక పాలసీలతో పాటు అంతర్జాతీయంగా ప్రముఖమైన పాలసీలను అధ్యయనం చేసి తెలంగాణ పర్యాటక విధానాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. బహుళజాతి కంపెనీలు (ఎంఎన్‌సీ) రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం వల్ల అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వసతులు ఏర్పడతాయని, తద్వారా పర్యాటకుల ఆకర్షణ సులువవుతుందని చెప్పారు. ఇక రాష్ట్రంలోని కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాలను సఫారీ టూరిజానికి అనువుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. సమ్మక్క-సారక్క, రామప్ప ఆలయం, లక్నవరంను సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలని, నాగార్జునసాగర్, శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో కేరళ తరహాలో బోటు హౌస్‌ల ద్వారా పర్యాటకుల సంఖ్య పెరిగేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో బౌద్ధ పర్యాటక ప్రదేశాలను కలుపుతూ బౌద్ధ సర్క్యూట్ ఏర్పాటు చేయాలన్నారు. సమ్మక్క-సారక్క జాతరకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులు సమీపంలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సింగపూర్ వంటి దేశాలు తక్కువ ప్రదేశంలో వైవిధ్యమైన ప్రణాళికలతో పెద్ద సంఖ్యలో పర్యాటకులను ఆకర్షించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ గార్డెన్, సంజీవయ్య పార్క్, ఇందిరా పార్క్‌లను కలుపుతూ స్కైవాక్, సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. అనంతగిరితోపాటు ఇతర ప్రాంతాల్లోనూ వసతులు మెరుగుపరచాలన్నారు.

ఇస్రోకు సీఎం రేవంత్ అభినందనలు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) బుధవారం నిర్వహించిన 100వ అంతరిక్ష ప్రయోగం విజయవంతం కావడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీఎస్ఎల్వీ ఎఫ్-15 రాకెట్ విజయవంతంగా ప్రయోగించిన అనంతరం శాస్త్రవేత్తలను అభినందించారు. దేశానికి సంబంధించి ఇది భారీ విజయమని కొనియాడారు.

బీసీ రిజర్వేషన్లు తేలాకే!

(మొదటిపేజీ తరువాయి)

వివరాల ఆధారంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలంటే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటాల్సి ఉంటుంది. ఇందుకు కేంద్రం నుంచి ఆమోదం అవసరం. దీంతో బీసీలకు రిజర్వేషన్లు పెంచుకునేందుకు అవకాశం ఇవ్వాలని, ఇందుకోసం పార్లమెంటులో చట్టం చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరనున్నట్లు సమాచారం. ఒకవేళ ఈ విజ్ఞప్తిని కేంద్రం అనుమతించకపోతే స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఉంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. పాత పద్ధతిలోనే ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి.. కాంగ్రెస్ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం టిక్కెట్లు ఇస్తుందా? లేక ఇతర మార్గాలను అన్వేషిస్తుందా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.



దేవాదాయశాఖపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సర్వేపై జాతీయ స్థాయిలో ప్రశంసలు: సీఎం

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే.. దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జాతీయ స్థాయిలో ఈ సర్వేపై ప్రశంసలందుతున్నాయని చెప్పారు. సర్వేను విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ఉద్యోగులను అభినందించారు. బుధవారం సమగ్ర కులగణన, సర్వే నివేదికపై బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కులగణన ప్రక్రియ సామాజిక సాధికారతతో పాటు, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాలందరి అభ్యున్నతికి ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ కులగణన సర్వేను చేపట్టి తమ చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. ఫిబ్రవరి 2వ తేదీ లోగా క్యాబినెట్ సబ్ కమిటీకి తుది నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్కమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టీటీడీ తరహాలో యాదగిరి గుట్టబోర్డు

యాదగిరిగుట్ట దేవస్థానానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలోనే ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం యాదగిరిగుట్ట బోర్డు నియామకానికి సంబంధించిన అంశాలపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ధర్మకర్తలి మండలి ఏర్పాటుకు ఇప్పటికే రూపొందించిన ముసాయిదాలో ఆయన పలు మార్పులను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయం సమీపంలో రాజకీయాలకు తావులేకుండా చూడాలని, ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆలయం తరఫున చేపట్టాల్సిన పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలపై ముసాయిదాలో పేర్కొన్న నిబంధనల్లో మార్పులు చేయాలన్నారు. సమీక్షలో సీఎస్ శాంతికుమారి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

'కుంభమేళా' మృతుల కుటుంబాలను కేంద్రం ఆదుకోవాలి

రాష్ట్రం నుంచి సాయం అందిస్తాం: సీఎం

మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతి చెందిన కుటుంబాలను కేంద్రంతో పాటు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదుకోవాలని, గాయపడిన వారికి చికిత్స అందించాలన్నారు. ఈ విషయంలో అవసరమైన సాయం అందించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం తెలిపారు. ఈ మేరకు సీఎంవో బుధవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా, మహా కుంభమేళాలో తొక్కిసలాట జరిగి భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కుంభమేళాకు తెలంగాణ నుంచి వెళ్లిన వారు క్షేమంగా తిరిగివాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

నాకు తెలియకుండా పదవులు ఎలా ఇస్తారు?

» వెంకట్‌రెడ్డిని ప్రశ్నించిన ఎమ్మెల్యే సామేలు

» డీసీసీ ఉపాధ్యక్ష పదవిపై వివాదం..

సీనియర్ నేత కాబట్టే ఇచ్చామన్న మంత్రి


మోత్కూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 'నాకు తెలియకుండా నా నియోజకవర్గంలోని వారికి మీరు పదవులు ఎలా ఇస్తారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మంత్రి వెంకటరెడ్డిని ప్రశ్నించినట్లు ప్రచారం జరుగుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు పైళ్ల సోమిరెడ్డిని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడం కాంగ్రెస్‌లో దుమారం లేపింది. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి, ఎమ్మెల్యే మధ్య ఈ విషయమై వాగ్వాదం జరిగినట్లు చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ నాయకులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమిరెడ్డి, మరికొందరు ఈ నెల 28న మంత్రి కోమటిరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. '30 ఏళ్లగా నేను పార్టీకోసం పనిచేస్తున్నా, మన ప్రభుత్వం వచ్చాక కూడా నాకు ఒక నామినేటెడ్ పోస్టుగాని, పార్టీ పదవిగాని లేకపాయే' అని సోమిరెడ్డి మంత్రి వద్ద తన ఆవేదన వెలిబుచ్చారు. డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి అక్కడే ఉండడంతో మంత్రి ఆయనతో సోమిరెడ్డిని జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించి లేఖ ఇవ్వాలని చెప్పారు. దాంతో సంజీవరెడ్డి వెంటనే మంత్రి చేతుల మీదుగా ఇప్పించేందుకు లేఖ సిద్ధం చేశారు. అంతలో సామేలు అక్కడకు వెళ్లారు. 'అప్పుడు సోమిరెడ్డిని జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించాం.. మీ చేతుల మీదుగా ఆయనకు లెటర్ ఇవ్వండ'ని మంత్రి ఎమ్మెల్యేతో చెప్పారు. 'నాకు తెలియకుండా నా నియోజకవర్గంలోని వారికి మీరు పదవులు ఎలా ఇస్తారని సామేలు మంత్రిని ప్రశ్నించారు. 'సోమిరెడ్డి చాలా సీనియర్. ఆయన సుమారు 30 ఏళ్ల నుంచి కోసం పని చేస్తున్నారు. ఆయనకు ప్రభుత్వ నామినేటెడ్ పోస్టు ఇవ్వడం లేదు కదా! పార్టీ పదవి ఇస్తే ఎందుకు అభ్యంతరం చెబుతున్నార'ని మంత్రి అన్నారని, ఈ సందర్భంగా ఆయనకు, ఎమ్మెల్యేకు మధ్య వాగ్వాదం జరిగిందని సమాచారం. సోమిరెడ్డికి నియామక పత్రం ఇవ్వడానికి ఎమ్మెల్యే సామేలు నిరాకరించి వెళ్లిపోవడంతో మంత్రి వెంకటరెడ్డి డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డితో కలిసి సోమిరెడ్డికి అందజేశారు.

వాగ్దానాల్లో ఒక్కటీ పూర్తిగా
అమలు కాలేదు

» కూలీలకు 'భరోసా' ఇవ్వరా?

» 40 లక్షల కొత్త రేషన్ కార్డులంటూ కేవలం 42 వేల మందికే ఇస్తారా?

» సీఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ



హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేకపోయారని, 3 శాతం మందికి కూడా లబ్ధి చేకూర్చలేకపోయారని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. రాష్ట్రంలో 12991 గ్రామ పంచాయతీలుంటే, కేవలం 561 గ్రామాలను ఎంపిక చేసి నాలుగు పథకాలను మంజూరు చేయడం విస్మయానికి గురి చేసిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో 70 లక్షల మంది అర్హులైన రైతులు ఉంటే కేవలం 4,41,911 మంది రైతుల ఖాతాల్లోనే రైతు భరోసా నిధులు వేయడం బాధాకరమని పేర్కొన్నారు. వ్యవసాయ భూమి లేని 10 లక్షల మంది కూలీల కుటుంబాలకు ఎకరానికి రూ.6 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు కేవలం 20,336 మందికే ఇచ్చారని, మిగిలిన వారికి ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న అర్హులందరికీ నాలుగు పథకాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎత్తిపోతల ప్రాజెక్టుల కంటే భూగర్భ జలాల పెంపు మేలు

» రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

కోహీర్, చేవెళ్ల జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఎత్తిపోతల ప్రాజెక్టులు నిర్మించుకోవడం కంటే భూగర్భ జలాలు పెంచే ప్రక్రియను చేపడితే సాగు, తాగు నీటికి కొరత ఉండదని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గొటిగర్‌పల్లిలో 2001-2002లో చేపట్టిన చతుర్విధ జల ప్రక్రియ (వాటర్‌షెడ్) పనులను ఆయన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ల జేబులు నింపే ప్రాజెక్టుల కంటే ప్రజా సంక్షేమం కోసం ఖర్చు చేస్తే బాగుంటుందన్నారు. ప్రజాధనాన్ని వృథా చేయకుండా ఎక్కడికక్కడ వర్షం నీటిని భూమిలోకి ఇంకించే ప్రక్రియను చేపడితే బాగుంటుందని పేర్కొన్నారు. రైతు భరోసా పేరుతో రైతులను నమ్మించి మోసం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చతుర్విధ జల ప్రక్రియను వికారాబాద్ జిల్లాలో అమలు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు

3న నోటిఫికేషన్.. మార్చి 3న ఫలితాలు.. షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం

హైదరాబాద్/న్యూఢిల్లీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి, మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గానికి, మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరగనున్నట్లు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఈసీ ప్రకటించింది. ఫిబ్రవరి 10 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ అని, ఫిబ్రవరి 11న స్క్రూటినీ జరుగుతుందని, 13 వరకు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చని తెలిపింది. ఫిబ్రవరి 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి (మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్), ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కూర రఘోత్తం రెడ్డి (మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్), అలుగుబెల్లి నర్సిరెడ్డి (వరంగల్-ఖమ్మం-నల్లగొండ)ల పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మార్చి 8వ తేదీలోపే ఎన్నికల ప్రక్రియను ముగించనున్నట్టు ఈసీ పేర్కొంది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానానికి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల స్థానానికి, శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ స్థానానికి ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి.

2న కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు!

తెలంగాణ మొత్తం పది ఉమ్మడి జిల్లాలకుగాను ఏడు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక.. ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ మూడింటిలో కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటు.. కాంగ్రెస్ సిటింగ్ సీటు అన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సీటు నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న జీవన్‌రెడ్డి.. ఈసారి పోటీలో నిలిచేందుకు ఆసక్తి చూపట్లేదని చెబుతున్నారు. దానికి బదులుగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటును ఆయన ఆశిస్తున్నారు. అయితే జీవన్‌రెడ్డినే మళ్లీ పోటీకి దింపాలని అధిష్ఠానం సూచిస్తోంది. తిరిగి పోటీ చేయడానికి జీవన్‌రెడ్డి సుముఖంగా లేకపోవడంతో ఆశావహులు తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. జీవన్‌రెడ్డికి ప్రత్యామ్నాయంగా ప్రధానంగా అమిగోస్ విద్యాసంస్థల అధినేత ముస్కు రమణారెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, పార్టీ నేతలు వెల్చాల రాజేందర్, ప్రసన్న హరికృష్ణ, మాజీ డీఎస్పీ గంగాధర్‌లు ప్రధానంగా రేసులో ఉన్నారు. ఎన్నికల్లో పోటీకి జీవన్‌రెడ్డి ససేమిరా అంటే.. ఈ ఐదుగురిలో ఒకరికి టికెట్ దక్కే చాన్స్ ఉందంటున్నారు. మరోవైపున రెండు టీచర్ ఎమ్మెల్సీ సీట్లలో పార్టీ తరఫున అభ్యర్థిని నిలపాలా.. లేక విత్రపక్షాల అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలా? అన్నదానిపైనా చర్చ జరుగుతోంది. అయితే ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ సీటును ఆశిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు జి. హర్షవర్ధన్ రెడ్డి కొద్ది నెలలుగా నియోజకవర్గంలో ప్రచారమూ చేసుకుంటున్నారు. అలాగే టికెట్ కోసం తనవంతు ప్రయత్నం గట్టిగా చేసుకుంటున్నారు. కాగా.. కరీంనగర్ పట్టభద్రుల సీటు సహా మూడు సీట్లలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి క్షేత్రస్థాయి సర్వేలనూ కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తోంది. రెండు రోజుల్లో ఆ నివేదికలూ రానున్నాయి. అలాగే ఏడు ఉమ్మడి జిల్లాల నేతలతో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ సంప్రదింపులూ జరుపుతున్నారు. మూడు సీట్లలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఫిబ్రవరి 2న సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ భేటీ కానున్నారు. సర్వే నివేదికలు, పార్టీ నేతల అభిప్రాయాలు, అధిష్ఠానం సూచనలూ పరిగణనలోకి తీసుకుని ఆ సమావేశంలో అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా.. మూడు ఎమ్మెల్సీ సీట్లకూ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించిన బీజేపీ.. ప్రచారంలోనూ ముందుంది. బీఆర్ఎస్ అభ్యర్థులకు సంబంధించి ఆ పార్టీలో ఇంకా స్పష్టత రాలేదు.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

నోటిఫికేషన్	ఫిబ్రవరి 3
నామినేషన్ల దాఖలు గడువు	ఫిబ్రవరి 10
పోలింగ్	ఫిబ్రవరి 27
ఓట్ల లెక్కింపు	మార్చి 3

కేటీఆర్, హరీశ్ నా కాలి గోటికి సరిపోరు

» కాంగ్రెస్ సభల్లో పల్లీలు అమ్ముకునేంత మంది కూడా కేటీఆర్ సభకు రాలేదు

» గద్దర్‌కు పద్మ అవార్డు ఇస్తే తప్పేంటి?

» మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కేటీఆర్, హరీశ్‌రావు తన కాలిగోటికి కూడా సరిపోరని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌లా తాను ఎలక్షన్, కలెక్షన్ చేయలేదని, కేటీఆర్‌కు ఉన్నట్లు తనపై అవినీతి మరకలు లేవన్నారు. నీతి, నిజాయితీకి మారుపేరు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మంత్రితో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు, ప్రజలను కలసి వారి సమస్యలు విన్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ గత 13 నెలల నుంచి అసెంబ్లీకి రాలేదని విమర్శించారు. బడ్జెట్ సమావేశాలకైనా వస్తారో లేదో చెప్పాలన్నారు. కేసీఆర్ కంటే జైలుకెళ్లిన లాలూప్రసాద్ యాదవ్ నయమన్నారు. జైలుకు వెళ్లకున్నా కేసీఆర్ ఒక్కసారి కూడా అసెంబ్లీకి రాలేదన్నారు. కేటీఆర్ పనికిరానోడు.. పనికిరాని మాటలు మాట్లాడుతున్నడు. కేటీఆర్ దగ్గర ఏముంది?... రూ.లక్షల కోట్లు, ఈ కార్ రేసు అవినీతి తప్ప! నాకు లక్షల కోట్లు లేకున్నా.. ప్రజల అండదండలున్నాయ'ని అన్నారు. కాంగ్రెస్ సభల్లో పల్లీలు, ఐస్‌క్రీమ్‌లు అమ్ముకోడానికి ఎంతమంది వస్తారో అంతమంది కూడా కేటీఆర్ ధర్నాకు రాలేదన్నారు. నల్లగొండలో టీ హబ్‌కు తాళం వేసిందే కేటీఆర్ అని ఆరోపించారు. గద్దర్‌కు పద్మ అవార్డు ఇస్తే తప్పేంటని ప్రశ్నించారు. ఆయనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదన్నారు. కాగా, మంత్రితో ముఖాముఖీలో వెంకట్‌రెడ్డిని అక్షర చిట్‌ఫండ్ బాధితులు కలిసి తమకు జరిగిన మోసాన్ని వివరించారు. దీంతో మంత్రి డీజీపీకి ఫోన్ చేసి ఆ సంస్థ ఎండీ పేరాల శ్రీనివాస్‌రావుపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సూచించారు.

జాన్ వెస్లీకి మహేశ్‌గౌడ్ అభినందన

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా ఎన్నుకోబడిన జాన్ వెస్లీకి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు బుధవారం జాన్ వెస్లీతో ఫోన్‌లో మాట్లాడారు. దశాబ్దాలుగా సిద్ధాంతం కోసం పోరాడుతున్న వెస్లీ.. తాజాగా ఆ పార్టీకి రాష్ట్ర కార్యదర్శి కావడం హర్షణీయమన్నారు. దేశం, రాష్ట్రంలో మతతత్వ శక్తులను, అవినీతి పరులను, నియంతలను ఓడించేందుకు లౌకిక భావ సిద్ధాంతాలతో కలిసి పనిచేద్దామని జాన్ వెస్లీని కోరారు. కాగా, కుంభమేళా తొక్కిసలాటలో పలువురు భక్తులు మృతి చెందిన ఘటనపై ఓ ప్రకటనలో మహేశ్‌కుమార్ గౌడ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

కేటీఆర్‌ది కామెడీ షో: చామల

నల్లగొండలో కేటీఆర్ రైతు ధర్నా అట్టర్ ఫ్లాప్ అయిందని, అక్కడ ఆయన కామెడీ షో చేసి వచ్చారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవాచేశారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, రైతు భరోసా తదితర పథకాలతో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఒకేరోజున నాలుగు పథకాల అమలుతో దిమ్మ తిరిగిన కేటీఆర్‌కు ఏం మాట్లాడాలో అర్థం కావట్లేదన్నారు.

సర్టిఫికెట్లు ఉంటేనే ఈడబ్ల్యూఎస్ కోటా

» 'హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్' పోస్టు విషయమై టీజీపీఎస్సీ నిర్ణయాన్ని సమర్థించిన హైకోర్టు

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 పోస్టుకు ఈడబ్ల్యూఎస్ కోటాలో ఎంపికయ్యే అభ్యర్థి తప్పకుండా నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఏడాది ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ సమర్పించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. టీజీపీఎస్సీ రూపొందించిన జాబితాలో తన పేరు ఉన్నప్పటికీ 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సర్టిఫికెట్ లేదనే కారణంతో తనకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తిరస్కరిస్తున్నారని సిద్దిపేట జిల్లాకు చెందిన కె.తిరుపతి అనే అభ్యర్థి హైకోర్టులో పిటిషన్ వేశారు. పాత సంవత్సరాలకు సంబంధించి రెవెన్యూ అధికారులు సర్టిఫికెట్ జారీ చేయడం లేదని.. ఆ తర్వాత సంవత్సరాలకు సంబంధించిన సర్టిఫికెట్లు సమర్పించినట్లు పేర్కొన్నారు.. వాదనలు నమోదు చేసుకున్న జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం.. పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించింది. నోటిఫికేషన్ ప్రకారం సర్టిఫికెట్లు ఉండాల్సిందేనంటూ టీజీపీఎస్సీ నిర్ణయాన్ని సమర్థించింది.

రాధాకిషన్‌రావు బెయిల్ పిటిషన్‌లో తీర్పు రిజర్వు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న రాధాకిషన్‌రావు రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చిన నేపథ్యంలో.. తనకు కూడా బెయిల్ మంజూరు చేయాలని రాధాకిషన్‌రావు పిటిషన్‌లో కోరారు. ఇప్పటికే మంజూరు చేసిన మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని మరో అప్లికేషన్ దాఖలు చేశారు. అయితే రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేసిన జస్టిస్ సుజన ధర్మాసనం.. మధ్యంతర బెయిల్ అంశంపై గురువారం నిర్ణయం వెల్లడిస్తామని తెలిపింది. కేసులోని మరో నిందితుడు భుజంగరావు బెయిల్ పిటిషన్‌పైనా అదే రోజు తీర్పు వెలువడనుంది.

ఆ వివాదాల వల్ల విద్యార్థులు నష్టపోకూడదు

» సర్టిఫికెట్ల జారీకి అవకాశమివ్వండి: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రెండు విద్యాసంస్థల మధ్య వివాదాల కారణంగా.. ఆయా సంస్థల్లో చదువుకునే విద్యార్థులు నష్టపోకూడదని హైకోర్టు వ్యాఖ్యానించింది. మహబూబ్ కాలేజీ మల్టీపర్పస్ హయ్యర్ సెకండరీ స్కూల్, వెంకట్ నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీకి మధ్య వివాదాల కారణంగా మహబూబ్ కాలేజీ ఆధ్వర్యంలోని స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్వీఐటీ), స్వామి వివేకానంద పీజీ కాలేజీ (ఎస్వీపీజీ) విద్యాసంస్థలకు చెందిన దాదాపు 1,800 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. సదరు విద్యాసంస్థల అసలు యజమాని అయిన పిటిషనర్ మహబూబ్ కాలేజీ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని.. పిటిషనర్ సంస్థ అసలు ఈ-మెయిల్ ఐడీని పునరుద్ధరించడంతో పాటు విద్యార్థుల సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసే అవకాశమివ్వాలని జేఎన్‌టీయూ హైదరాబాద్, అఖిల భారత సాంకేతిక విద్యామండలికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక మంది కార్మికులు అసంఘటిత రంగంలో ఉన్నారని, వారికి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బుధవారం జాన్ వెస్లీ విలేకరులతో మాట్లాడుతూ, సరళీకృత ఆర్థిక విధానాలపై బలమైన ఉద్యమాలు నిర్మిస్తామని, బీజేపీ మతోన్మాదాన్ని ఎండగడతామని చెప్పారు. దావో‌స్‌లో పెట్టుబడులు వచ్చాయని సీఎం రేవంత్ ఉదరగొడుతున్నారని, గతంలో కేసీఆర్ కూడా ఇలాగే చేశారని గుర్తు చేశారు. బీజేపీ పట్ల బీఆర్ఎస్ వైఖరేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఎంను బలోపేతం చేయడానికి తొలి ప్రాధాన్యమిస్తామని, వామపక్ష శక్తులను ఐక్యం చేస్తామని చెప్పారు. గద్దర్ గురించి స్పష్టమైన అవగాహన లేకుండా కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. గద్దర్‌కు ప్రజల్లో గుర్తింపు ఉందని, కేంద్రం ఇచ్చే పద్మశ్రీ అవసరం లేదని జాన్ వెస్లీ పేర్కొన్నారు.

నక్సల్స్ పట్ల కేంద్రం వైఖరిని ఖండిస్తున్నాం

» సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో వక్తలు

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అడవి క్షేత్రంగా సమ సమాజం కోసం పోరాడుతున్న నక్సలైట్లను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో కేంద్రం హతమార్చడం దుర్మార్గం.. ఈ అమానుష చర్యను యావత్ సమాజం వ్యతిరేకించాలని వివిధ వామపక్ష పార్టీల నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, మేధావులు గళమెత్తారు. సీపీఐ తెలంగాణ కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ వేదికగా 'నక్సల్స్ పట్ల కేంద్రం రాక్షస విధానాలను వ్యతిరేకిద్దాం- ప్రశ్నించే గొంతుకలను కాపాడుకుందాం' అంటూ సదస్సు నిర్వహించారు. సభాధ్యక్షత వహించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... ప్రజాస్వామిక సమాజాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ నక్సల్స్‌పై హత్యాకాండను నిరసించాలని కోరారు. ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ బస్తర్‌లో విలువైన ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు అప్పగించేందుకే కేంద్రం ఈ హత్యాకాండను కొనసాగిస్తోందని ఆరోపించారు. సీనియర్ సంపాదకుడు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ... బలమైన ప్రజాభిప్రాయాన్ని నిర్మించడంతో పాటు అసమ్మతిని ప్రకటించడం ద్వారానే అణచివేత, నిర్బంధాలను అడ్డుకోగలమని అన్నారు.

జీబీ లింక్ ప్రాజెక్టుపై ఏపీని అడ్డుకోండి

» సీడబ్ల్యూసీ, గోదావరి, కృష్ణా బోర్డులకు తెలంగాణ లేఖ

హైదరాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్ల అనుసంధానం (జీబీ లింక్) ప్రాజెక్టు విషయంలో ఏపీని ముందుకెళ్లకుండా అడ్డుకోవాలని తెలంగాణ కోరింది. ఈ మేరకు కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ), గోదావరి, కృష్ణా నదుల యాజమాన్య బోర్డులకు తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. ఇప్పటికే కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి లేఖ రాయగా... తాజాగా సీడబ్ల్యూసీ, కృష్ణా, గోదావరి బోర్డులకు ప్రభుత్వం లేఖ రాసింది.

రైతుల ఆందోళన సీఎంకు కనబడటం లేదా?

» బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

అసలే దిగుబడి లేక సతమతమవుతున్న రైతులకు గిట్టుబాటు ధర కూడా రావడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా.. మహబూబ్‌నగర్ జిల్లా వేరుశనగ రైతులు చేస్తున్న ఆందోళన సీఎం రేవంత్‌రెడ్డికి కనబడటం లేదా..? అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. వారిపాలన రైతుల పాలిట శాపంగా మారిందని బుధవారం ఎక్స్ వేదికగా ఆమె విమర్శించారు.

'ప్రాక్టికల్స్'లో సీసీ కెమెరాలు వద్దు

» తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల అసోసియేషన్

రాంనగర్, జనవరి29(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలంటూ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరి సతీష్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఫిబ్రవరి 3 నుంచి జరిగే ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలకు తమ కళాశాలల సెంటర్లను ఇవ్వబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాలను వేధిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి శ్రీకృష్ణఆదిత్య, సీఎంవోలోని ఐఏఎస్ అధికారి మాణిక్యరాజును వెంటనే బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాల రాష్ట్ర సదస్సు జరిగింది. తమ డిమాండ్ల సాధన కోసం గురువారం ఉదయం 11 గంటలకు అన్ని జిల్లాల్లోని డీఐవో కార్యాలయాలలో డీఐవోలను కలిసి తమ డిమాండ్ల పత్రం అందజేసి నిరసన ప్రకటిస్తామని గౌరి సతీష్ తెలిపారు.

ఎన్ఐఏ అదుపులో జమాతే ఇస్లామీ జాతీయ అధ్యక్షుడు

ఈనెల 25న శ్రీలంకకు వెళ్తుండగా చెన్నై ఎయిర్‌పోర్టులో అదుపులోకి జకారియా

35ఏళ్లుగా వరంగల్‌లో ఉంటూ హోటల్ వ్యాపారం

వరంగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జమాతే ఇస్లామీ జాతీయ అధ్యక్షుడు జకారియాను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పాకిస్థాన్‌కు చెందిన ఖలీఫా సంస్థకు కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు శ్రీలంకలో నిర్వహిస్తున్న సభకు వెళ్లేందుకు చెన్నైకి వెళ్లిన ఆయన ఎన్ఐఏ అధికారులకు చిక్కారు. వరంగల్‌లో ఉంటున్న జకారియా.. విజయవాడకు చెందిన మరో ఇద్దరితో కలిసి శ్రీలంకకు వెళ్లేందుకు ఈ నెల 25న చెన్నై విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే విమానాశ్రయంలోని ఏఐ ఫేస్ రికగ్నిషన్ స్కానర్ జకారియాను గుర్తించి అధికారులను అలర్ట్ చేసింది. దీంతో అప్రమత్తమైన విమానాశ్రయ అధికారులు వెంటనే నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ)కి సమాచారం ఇచ్చారు. దీంతో ఎన్ఐఏ అధికారులు జకారియాతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. జమాతే ఇస్లామీ అధ్యక్షుడిగా జకారియా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన కదిలికలపై ఎన్ఐఏ నిఘా పెట్టింది. ఇటీవల జకారియా ఫోన్ నుంచి ఐదారుసార్లు పాకిస్థాన్‌కు ఫోన్‌కాల్స్ వెళ్లినట్లుగా ఎన్ఐఏ గుర్తించినట్లుగా సమాచారం. ఈ క్రమంలో జకారియా ఎయిర్‌పోర్టులో చిక్కారు. జకారియాతోపాటు అదుపులో తీసుకున్న ఇద్దరిని విచారించి మర్నాడు పంపించారు. పాకిస్థాన్‌లో ఎవరికి ఫోన్ చేశారో వివరాలు సేకరించినట్లుగా తెలిసింది. జకారియాపై ఎలాంటి కేసులు లేకపోవడంతో ఎన్ఐఏ అధికారులు అనుమానంతోనే అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జకారియా పూర్వీకులు పాకిస్థాన్ నుంచి వలస వచ్చి గుంటూరు జిల్లాలో స్థిరపడ్డారని సమాచారం. 35ఏళ్ల క్రితం వరంగల్‌లోని పోచమ్మమైదాన్‌కు వలస వచ్చి అద్దె ఇంట్లో ఉండి.. 15 ఏళ్ల క్రితం జాన్‌పీరీలు ప్రాంతానికి మకాం మార్చారు. అద్దె ఇంట్లో ఇద్దరు భార్యలు, తొమ్మిది మంది పిల్లలు, సోదరుడు, తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. కాగా, జనవరి 25న ఫోన్‌చేసి, తనను పోలీసులు అదుపులో తీసుకుంటున్నారని చెప్పారని, తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని జకారియా సోదరుడు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల అరిగోస

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కొంటున్నారు. సొమ్ములందక విశ్రాంత ఉద్యోగులు గోస పడుతున్నారు. తమ డబ్బు తమకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఉద్యోగి పదవీ విరమణ చేసిన రోజే ఆయనకు ఇవ్వాల్సిన అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను అందించి, శాలువాలతో సత్కరించి, ఇంటి వరకు ప్రభుత్వ వాహనాల్లో దింపి రావాలంటూ గత కేసీఆర్ ప్రభుత్వం ఆదేశించింది. కానీ, అప్పటి నుంచే ఈ విధానం అమలు కావడం లేదు!! కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా పరిస్థితిలో మార్పు లేదు. రిటైరైన ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల బిల్లులు నెలలు గడుస్తున్నా చెల్లించడం లేదు. వీటన్నింటినీ క్లియర్ చేయాలంటే దాదాపు రూ.5000 కోట్లకు పైగానే అవసరమవుతాయని అంచనా. బిల్లులు క్లియర్ కాకపోవడంతో కొందరు కోర్టులను ఆశ్రయిస్తున్నారు.



ఒక్కో రిటైర్డు ఉద్యోగికి 60-70 లక్షలు రావాలి

సాధారణంగా ఉద్యోగి రిటైరైన తర్వాత ప్రభుత్వం తన సొంత ఖజానా నుంచి ఇచ్చేది పెద్దగా ఏమీ ఉండదు. ఉద్యోగి తన పదవీ కాలంలో దాచుకున్న సొమ్మునే చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఒక్కో ఉద్యోగికి జీపీఎఫ్, టీజీఎల్ఐసీ, కమ్యూటేషన్, గ్రాట్యుటీ, ఆర్జిత సెలవులను సరెండర్ చేయడం వంటివాటన్నింటి కింద రూ.60-70 లక్షల వరకు వస్తుంటాయి. అలాగే, ఒక్కో ఉద్యోగికి జీపీఎఫ్ కింద సగటున రూ.8-10 లక్షల వరకు అందుతుంది. ఉద్యోగి రిటైరైన తర్వాత కమ్యూటేషన్ కింద 40 శాతం వరకు పెన్షన్‌ను ప్రభుత్వానికి అమ్ముకునే వెసులుబాటు ఉంటుంది. మిగతా 60 శాతం పెన్షన్ రూపంలో ప్రతి నెలా అందుతుంది. తాను అమ్ముకున్న 40శాతం పెన్షన్ తాలూకు సొమ్మును ఒకేసారి ప్రభుత్వం అడ్వాన్సుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఉద్యోగికి రిటైరైన వెంటనే దాదాపు రూ.15 లక్షల వరకు అందుతుంది. తెలంగాణ ప్రభుత్వ బీమా (టీజీఎల్ఐసీ) కింద ఉద్యోగి మూల వేతనం నుంచి కనీసం 6 శాతం లేదంటే అంతకంటే ఎక్కువ శాతం మేర ప్రీమియం కట్ అవుతుంటుంది. రిటైరైన తర్వాత ఎల్ఐసీ కింద జమ అయిన సొమ్మును ఉద్యోగికి ఇచ్చేయాలి. దీని కింద రూ.6 లక్షల వరకు అందుతుంది. ఉద్యోగి 300 వరకు ఆర్జిత సెలవుల (ఈఎల్)ను నిల్వ చేసి పెట్టుకోవచ్చు. వీటిని రిటైరైన తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. ఈఎల్‌లకు సంబంధించి ఒక్కో ఉద్యోగికి రూ.12-15 లక్షల వరకు సొమ్ము అందుతుంది. ప్రభుత్వం తన సొంత ఖజానా నుంచి రూ.16లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలి. ఇలా అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాల కింద ఒక్కో ఉద్యోగికి రూ.60-70 లక్షల వరకు సొమ్మును ప్రభుత్వం వెంటనే అందించాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 58 నుంచి 61 ఏళ్లకు పెంచింది. దాంతో 2024 మార్చి 31 వరకు రిటైర్మెంట్లు లేవు. ఆ తర్వాత ప్రారంభమయ్యాయి. 2024లోనే 7,995 మంది రిటైరయ్యారు. ఈ సంవత్సరం 9,630మంది, 2026లో 9,719 మంది, 2027లో 9,443మంది, 2028లో 7,213మంది పదవీ విరమణ చేయనున్నారు. 2024 మార్చి 31న, ఆ తర్వాత ఏప్రిల్ నుంచి రిటైర్ అవుతున్నవారికి ప్రభుత్వం సొమ్ములు చెల్లించడం లేదు. వీరందరి బిల్లులు క్లియర్ చేయాలంటే రూ.5000 కోట్ల వరకు అవసరమని అంచనా వేస్తున్నారు.

కమీషన్లు ఇచ్చేవారికే చెల్లింపులు!

కమీషన్లు ఇచ్చినవారి, పైరవీలు చేసుకునేవారి బిల్లులను మాత్రం చెల్లిస్తున్నారని, పైరవీలు చేయనివారివి పెండింగ్‌లో పెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల వరంగల్ జిల్లాకు చెందిన ఓ రిటైర్డు ఉపాధ్యాయుడు తన బిల్లుల క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖలో రూ.50 వేలు సమర్పించుకున్నాడని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకుడు తెలిపారు. కొంతమంది బిల్లు మొత్తం సొమ్ములో 6-10 శాతం వరకు కమీషన్లను ముట్టజెప్పాల్సి వస్తోందని నేతలు ఆరోపిస్తున్నారు. సాధారణంగా డీడీవోలు బిల్లులు చేసి పంపగానే ట్రెజరీల నుంచి టోకెన్లు జనరేట్ అవుతున్నాయి. ఈ టోకెన్ల సీరియల్ నంబర్లవారీగా బిల్లులను పరిష్కరించాలి. కానీ, పైరవీలు చేసుకునేవారు, కమీషన్లు ఇచ్చేవారి బిల్లులు చివర ఉన్నా క్లియర్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రిటైరైన ఉద్యోగుల బిల్లులపై దృష్టి పెట్టాలని నేతలు కోరుతున్నారు.

కష్టార్జితం చేతికందడం లేదు

నాకు గ్రాట్యుటీ, జీపీఎఫ్, ఆర్జిత సెలవులు తదితర రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.60 లక్షలకు పైగా డబ్బు రావాల్సి ఉంది. రిటైర్మెంట్ తర్వాత ప్రశాంత జీవనం గడుపుదామంటే.. నా కష్టార్జితం చేతికందక ఇబ్బందులు పడుతున్నా.

-షేక్ జహూర్, రిటైర్డ్ టీచర్, హనుమకొండ

97.15 లక్షలు రావాల్సి ఉంది

మెదక్ జిల్లాలో బీసీ హాస్టల్ వార్డెన్‌గా పని చేసి, 2024 జూలైలో పదవీ విరమణ చేశా. నాకు మొత్తం రూ.97,15,000 వరకు రావాల్సి ఉంది. బిల్లులు సమర్పించినా ఇప్పటివరకు పైసా ఇవ్వలేదు. డబ్బు వస్తే.. ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్క వచ్చని ఆరు నెలలుగా ఎదురు చూస్తున్నా.

- మనోహర్, రిటైర్డ్ హాస్టల్ వార్డెన్, మెదక్

బిడ్డ పెళ్లికి ఉపయోగపడట్లేదు

సిద్దిపేట జిల్లాలో టీచర్‌గా పని చేసి, 2024 జూన్ 30న రిటైరయ్యాను. రూ.40 లక్షల వరకు రావాల్సి ఉంది. సర్వీసు పెన్షన్ మాత్రం వస్తోంది. రిటైర్మెంట్ తర్వాత బిడ్డ పెళ్లి చేయాలనుకున్నా. సర్కారు సొమ్ము ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నా.

- రవీందర్, రిటైర్డ్ హెచ్ఎం, సిద్దిపేట



నేటి నుంచి ఏపీలో 'వాట్సాప్ పరిపాలన'

» దేశంలోనే తొలిగా అమలు

» దీని కోసం అధికారికంగా నంబర్ ఏర్పాటు.. సీఎం చంద్రబాబు సమీక్ష

» తొలిదశలో 161 సేవలు

అమరావతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ ఫోన్ వినియోగించే వారందరి దైనందిన జీవితంలో వాట్సాప్ కూడా ఓ భాగమైంది. అలాంటి మాధ్యమాన్ని వినియోగించుకుంటూ ప్రజలకు సౌకర్యవంతంగా సేవలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసింది. పాలనలో సరికొత్త ఆవిష్కారానికి శ్రీకారం చుడుతూ వాట్సాప్ పాలనను గురువారం నుంచి అందుబాటులోకి తెస్తోంది. దీని ద్వారా తొలి దశలో 161 ప్రభుత్వ సేవలు అందించనున్నారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్‌కుమార్ తదితరులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో వాట్సాప్ పాలనను అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వెల్లడించారు. దీనిని మంత్రి నారా లోకేశ్ గురువారం అధికారికంగా ప్రారంభిస్తారని తెలిపారు. వాట్సాప్ ద్వారా పౌరులకు సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ సమాచారం కూడా చేరవేస్తామని సీఎం చెప్పారు. ఈ సేవల కోసం ప్రభుత్వం అధికారికంగా వాట్సాప్ నంబరును ప్రజలకు అందుబాటులో ఉంచుతుందని తెలిపారు.



మాఘమాసమొచ్చె.. పెళ్లికళ తెచ్చె!

» నేటి నుంచి మార్చి 16 దాకా శుభ ముహూర్తాలు

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పెళ్లి పీటలెక్కి.. మూడు ముళ్లతో ఒక్కటయ్యేందుకు నిశ్చితార్థం జరిగిన జంటలు ఎదురుచూస్తున్న మాఘమాసం వచ్చేసింది. గురువారం నుంచి మార్చి 16వ తేదీ వరకు పెళ్లిళ్లకు, నూతన గృహ ప్రవేశాలకు అన్నీ మంచి ముహూర్తాలే. ముఖ్యంగా నిశ్చితార్థం జరిగిన ఇళ్లలో పెళ్లి సందడి నెలకొంది. కల్యాణానికి ముహూర్తాలు నిర్ణయించుకొని ఫంక్షన్ హాళ్ల బుకింగ్, డెకరేషన్, కేటరింగ్ తదితర ఏర్పాట్లలో పెద్దలు మునిగిపోయారు. జనవరి 31న గృహప్రవేశాలకు మంచి ముహూర్తం ఉండగా.. ఫిబ్రవరి 2 నుంచి మార్చి 26 వరకు పెళ్లిళ్లు జరుపుకునేందుకు శుభ ఘడియలున్నట్లు వేద పండితులు చెబుతున్నారు. ముఖ్యంగా ఫిబ్రవరి 2, 3, 7, 13, 14, 15, 16, 21, 23, 25, మార్చి 2, 6, 7, 12, 14, 15, 16, 22 తేదీలు పెళ్లిళ్లకు ముహూర్తాలని తెలిపారు. ప్రత్యేకించి ఫిబ్రవరి 16, మార్చి 16 తేదీలు మంచి ముహూర్తాలని.. ఈ రెండ్రోజులు ఎక్కువ పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఈ ఏడాది జూలై వరకు కొన్ని ముహూర్తాలున్నాయని, నాలుగేళ్ల తర్వాత వరుస నెలల్లో శుభకార్యాలు జరుపుకునే అవకాశం ఈసారే వచ్చిందని వివరించారు. వేడుకల సమయం కావడంతో పురోహితులు, ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్, కేటరింగ్ నిర్వాహకులు, పూల వ్యాపారులకు డిమాండ్ పెరగనుంది.

కుటుంబసభ్యులను గుర్తుపట్టలేని స్థితిలో శ్రీతేజ

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సంధ్యా థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ ఆరోగ్యం రోజురోజుకు మెరుగుపడుతోందని వైద్యులు తెలిపారు. అయితే అతడు ఇంకా తన కుటుంబసభ్యులను గుర్తించడం లేదని వారు వెల్లడించారు. శ్రీతేజ హెల్త్ బులెటిన్‌ను బుధవారం కిమ్స్ వైద్యులు విడుదల చేశారు. శ్రీతేజ కోలుకుంటున్నాడని, తనకు తానుగా ఊపిరి పీల్చుకోగలుగుతున్నాడని తెలిపారు. బాలుడికి ఫిజియోథెరపీ కొనసాగుతోందని పేర్కొన్నారు.

నానమ్మ కళ్లలో ఆనందం చూడాలనే

» మనుమరాలిని కులాంతర వివాహం చేసుకున్నాడని బంటిపై ఆమె కసి

» వాణ్ణి చంపండంటూ ఉసిగొల్పిన వైనం

» హత్యకు స్కెచ్.. నాలుగోసారి సక్సెస్



సూర్యాపేటరూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వేరే కులానికి చెందిన యువకుడు తన మునుమరాలిని తీసుకెళ్లి.. పెళ్లి చేసుకోవడాన్ని.. పైగా తమ కళ్లెదుట ఊర్లోనే కాపురం పెట్టడాన్ని ఆ వృద్ధురాలు జీర్ణించుకోలేకపోయింది. ఊర్లో తలెత్తుకోలేకపోతున్నామని.. వాణ్ని ఎలాగైనా చంపాలని అటు కుమారుడిని.. ఇద్దరు మనుమళ్లను రెచ్చగొట్టింది. అప్పటికే తమ సోదరిని పెళ్లి చేసుకున్న యువకుడిపై కోపంగా ఉన్న ఆ మనవళ్లు మరింత రెచ్చిపోయారు. తమ సోదరిని పెళ్లిచేసుకున్న యువకుడిని పథకం ప్రకారం దారుణంగా హత్యచేశారు. 'ఇదిగో.. చంపాం చూడు' అంటూ కార్లో మృతదేహాన్ని ఇంటికి తెచ్చి మరీ ఆ వృద్ధురాలికి చూపించారు మృతదేహాన్ని చూశాక. శభాష్ రా మనవళ్లా అంటూ ఆ వృద్ధురాలు వారిని మెచ్చుకుంది. ఈ మేరకు సూర్యాపేట జిల్లా కేంద్రం శివారులో జరిగిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి అనే యువకుడి హత్యకేసును పోలీసులు ఛేదించారు. కులోన్మాదమే హత్యకు కారణమని తేల్చారు. హత్యకు ప్రధానంగా కులాంతర వివాహమే కారణమని.. అమ్మాయి ఇద్దరు సోదరులు, తండ్రి, స్నేహితులతో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. బుధవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ కేసు వివరాలను వెల్లడించారు. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి సూర్యాపేటలో ఉంటూ బీ ఫార్మసీ చదివి ఖాళీగా ఉంటున్నాడు. సూర్యాపేట మునిసిపల్ పరిధిలోని పిల్లలమర్రి గ్రామానికి చెందిన కోట్ల నవీన్‌తో బంటికి పరిచయమైంది. బంటిని నవీన్ ఊర్లో పంచాయితీలు, సెటిల్‌మెంట్లలో తోడుగా ఉండేందుకు పిల్లలమర్రిలోని తన ఇంటికి తీసుకెళ్లేవాడు. ఈ క్రమంలో నవీన్ సోదరి భార్గవితో బంటికి పరిచయం ఏర్పడింది. ఇద్దరూ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరు కావడంతో భార్గవి ఇంట్లోవారు వీరి ప్రేమను అంగీకరించలేదు. నవీన్‌కు, బంటి మధ్య విభేదాలేర్పడ్డాయి. నిరుడు ఆగస్టు 7న ఎవ్వరికీ చెప్పకుండా భార్గవి ఇంట్లోంచి వెళ్లిపోయింది. అదేరోజు నార్కెట్‌పల్లి మండలం గోపాలాయిపల్లి గుట్ట వద్ద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో బంటి-భార్గవి కులాంతర వివాహం చేసుకున్నారు. మూడు రోజుల తర్వాత సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో భార్గవి మిస్సింగ్ కేసు నమోదైంది. భార్గవిని బంటి స్టేషన్‌కు తీసుకెళ్లి.. తాము పెళ్లి చేసుకున్నామని, ఇద్దరమూ మేజర్లమని చెప్పాడు. భార్గవి కూడా బంటితోనే ఉంటానని, ఇద్దరం ప్రేమించుకున్నామని, ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నామని పోలీసుల ఎదుట చెప్పింది. దీంతో భార్గవి తల్లిదండ్రులకు పోలీసులు కౌన్సెలింగ్ చేసి పంపించివేశారు. సూర్యాపేటలోని మామిళ్లగడ్డలోని తన అమ్మమ్మ పెరుమాళ్ల సాలమ్మ ఇంట్లో భార్గవితో కలిసి బంటి ఉంటున్నాడు. ఈ పెళ్లి జరిగినప్పటి నుంచి భార్గవి కుటుంబసభ్యులు రగిలిపోతున్నారు. ప్రత్యేకించి భార్గవి నాన్నమ్మ కోట్ల బుచ్చమ్మ (65) వాడిని (బంటిని) ఎలాగైనా చంపాలంటూ నవీన్‌ను రెచ్చగొట్టింది. బంటి హత్య కోసం నవీన్ పథకం వేశాడు. ఇందుకు తనకు, బంటికి కామన్ ఫ్రెండ్ అయిన బైరు మహేశ్ సాయాన్ని తీసుకున్నాడు. బంటి హత్యకు పథకం వేసిన నవీన్ మూడుసార్లు యత్నించి విఫలమయ్యాడు. ఈ క్రమంలో 26వ తేదీ సాయంత్రం ఐదింటికి బంటికి మహేశ్ ఫోన్‌చేసి పిలిపించుకున్నాడు. బంటి స్కూటీపైనే ఇద్దరూ కలిసి మహేశ్ పొలం వద్దకు వెళ్లారు. అప్పటికే నవీన్ తన సోదరుడు వంశీతో కలిసి అక్కడి పరిసరాల్లో మాటు వేశారు. తిరిగి వెళ్దామంటూ బంటి స్కూటీ స్టార్ట్ చేయగా వెంటనే మహేశ్, నవీన్, వంశీ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో బంటి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. నవీన్, మహేశ్, వంశీ కలిసి కారు డిక్కీలో మృతదేహాన్ని వేసుకున్నారు. నేరుగా.. ఆత్మకూర్(ఎస్) మండలం పాతసూర్యాపేట గ్రామానికి వెళ్లి.. బంధువుల ఇంట్లో ఉన్న నవీన్ నాయనమ్మ బుచ్చమ్మకు చూపించారు. తర్వాత అదే కారులో నల్లగొండలో ఉన్న నవీన్ స్నేహితుడు చరణ్ ఇంటికి వెళ్లారు. చరణ్‌ను కారులో ఎక్కించుకొని బయలుదేరగా.. అతడు మధ్యలోనే దిగి వెళ్లిపోయాడు. చివరకు పిల్లలమర్రి శివారులో బంటి శవాన్ని పడేశారు. ఈ కేసుకు సంబంధించి భార్గవి సోదరులు నవీన్, వంశీ, తండ్రి సైదులు, నానమ్మ బుచ్చమ్మ, స్నేహితులు చరణ్, వంశీని అదుపులోకి తీసుకున్నారు.

కొత్త జీవితమిచ్చిన 'ఉస్మానియా'

» ఒకే నెలలో ఐదుగురికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు



కాలేయ మార్పిడి శస్త్రచికిత్సల అనంతరం కోలుకున్న రోగులతో వైద్య బృందం

మంగళ్‌హాట్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలతో ఒకే నెలలో ఐదుగురికి కొత్త జీవితం ప్రసాదించారు. వీరంతా పేద కుటుంబాలకు చెందినవారు. వీరిలో రెండేళ్ల, ఏడేళ్ల వయసు పిల్లలు ఇద్దరు ఉన్నారు. ఒక్కోదానికి రూ.40 నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చు అయ్యే శస్త్రచికిత్సలను ఉస్మానియాలో పూర్తి ఉచితంగా నిర్వహించారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌వోడీ డాక్టర్ మధుసూదన్ వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన అజిత్ కుమార్(2)కు నానమ్మ, సూర్యాపేట జిల్లాకు చెందిన సాత్విక్ గౌడ్(7)కు తల్లి కాలేయం దానం చేశారు. బీఎస్సీ విద్యార్థి జీ వెంకటేశ్ (జోగులాంబ గద్వాల), ఎం హర్షప్రియ (హనుమకొండ), వెంకటేశ్ (40)కు ఎవరూ దాతలు లేకపోవడంతో ఇటీవల బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన కాలేయాన్ని అమర్చారు. ప్రస్తుతం ఐదుగురూ ఆరోగ్యంగా ఉన్నారని హెచ్‌వోడీ తెలిపారు. శస్త్రచికిత్సలు నిర్వహించిన వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్, ఆరోగ్యశ్రీ సీఈవో డాక్టర్ శ్రీభూషణ్ రాజు అభినందించారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం

» 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలు: మంత్రి దామోదర

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో ఉస్మానియా ఆస్పత్రి భవనాలను నిర్మించనున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. పోలీసు శాఖకు ఉన్న 38 ఎకరాల స్థలంలో 26.30 ఎకరాలను ఆస్పత్రి కోసం ఇచ్చిన ఆ శాఖకు, గోషామహల్ ప్రజలకు మంత్రి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి భవనాల నిర్మాణంపై బుధవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 26.30 ఎకరాల్లో 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో విశాలమైన ఆస్పత్రి భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఇందులో 2,000 పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు. అదనంగా మరో 8 విభాగాలను కొత్త ఆస్పత్రిలో ప్రారంభిస్తామని తెలిపారు. అన్ని రకాల డయాగ్నోసిస్ సేవలు ఒకే చోట అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.